సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 292

శుక్రవారం 12-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



జమిలిని అంగీకరించం..

ఉన్నతస్థాయి కమిటీకి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ లేఖ

- 6లో



గెలిస్తే నియంతలా పాలిస్తా..

అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

- 6లో

న్యూస్‌రీల్

31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 31న ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు ఫిబ్రవరి 9 వరకు కొనసాగనున్నాయని సమాచారం.

- వివరాలు 6లో

కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరు



అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని బహిష్కరించాలనే కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని ప్రజలు క్షమించరని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ దివాళాకోరుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

- వివరాలు 3లో

ప్రజల వద్దకు 'ధరణి'

పోర్టల్‌తో ఎదుర్కొంటున్న సమస్యలపై అభిప్రాయ సేకరణ..

సలహాలు, సూచనలూ స్వీకరణ.. ప్రజాభిప్రాయం మేరకే ముందుకు

- ధరణి పునర్నిర్మాణ కమిటీ నిర్ణయం
- కమిటీ ఎలా ముందుకెళ్లాలి, రోడ్ మ్యాప్, చట్టాల పరిధి తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ
- అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు.. విస్తృత అధ్యయనం తర్వాతే తుది నివేదిక
- అవసరాన్ని బట్టి అంశాల వారీగా మధ్యంతర నివేదికలు
- సచివాలయంలో తొలిసారి కమిటీ భేటీ
- ఈనెల 17న మరోమారు సమావేశం.. కార్యాచరణకు రూపకల్పన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులు ధరణి పోర్టల్ కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వారి సలహాలు, సూచనలు, అభిప్రాయాల మేరకు ముందుకెళ్లాలని ధరణి పోర్టల్ పునర్నిర్మాణం కోసం నియమించిన కమిటీ నిర్ణయించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సునిశిత అధ్యయనం చేయాలని, వారి వద్దకు వెళ్లి ప్రత్యేక ఫార్మాట్‌లో వారి మనోగతం తెలుసుకుని క్రోడీకరించాలని ప్రాథమికంగా ఓ అభిప్రాయానికి వచ్చింది. అయితే నేరుగా ప్రజల వద్దకు వెళ్లాలా? గ్రామసభల ద్వారా వారి నుంచి సమస్యలు తెలుసుకోవాలా? లేదంటే అభిప్రాయ సేకరణ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలా? అలా ఏర్పాటు చేయాల్సి వస్తే ఏయే స్థాయిల్లో, ఏ పద్ధతుల్లో అభిప్రాయాలు తెలుసుకోవాలన్న దానిపై కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించారు. ఈ విషయంలో కమిటీ తుది నిర్ణయానికి రాలేదు కానీ, ప్రాంతాల వారీగా రైతుల సమస్యలు తెలుసుకుని వారి అభిప్రాయాలు, ఆలోచనల మేరకు పని చేయాలని మాత్రం నిర్ణయించింది. అలాగే ఈ పోర్టల్ ద్వారా రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులేంటి? కమిటీ ఎలా ముందుకెళ్లాలి? రోడ్ మ్యాప్ ఎలా ఉండాలి? చట్టాల పరిధి ఏంటి? చట్టాల మార్పునకు అవకాశాలెలా ఉన్నాయి? ఇతర రాష్ట్రాల్లో భూసమస్యలను పరిష్కరిస్తున్న తీరు తదితర అంశాలపై సభ్యులు 2 గంటలకు పైగా చర్చించారు. గురువారం సచివాలయంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, ఎం.సునీల్‌కుమార్, రేమండ్ పీటర్, మధుసూదన్, మెంబర్ కన్వీనర్ నవీన్ మిత్తల్‌తో పాటు సీఎంఆర్‌వో పీడీ వి.లచ్చిరెడ్డిలు పాల్గొన్నారు. సభ్యులందరూ విడివిడిగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. కమిటీ పనితీరు ఎలా ఉండాలన్న దానిపై ఓ అవగాహనకు

మిగతా 5వ పేజీలో ▶

'ఊరు'కులు.. పరుగులు



సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్తున్న వారితో బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. గురువారం రాత్రి బస్సులతో రద్దీగా మారిన హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ ప్రాంతం..

సంక్రాంతి ప్రయాణం సాఫీగా

హైదరాబాద్–విజయవాడ హైవేపై జీఎంఆర్, పోలీసు యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు

10 లో

కరెంట్ బిల్లులు పెంచాల్సిందే!

అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశం



- ఆదాయ అవసరాలు, టారిఫ్ మధ్య తేడా ఉండొద్దు
- ఒకవేళ ఉన్నా 3 శాతానికి మించరాదు
- ఇకపై లేట్‌పేమెంట్ సర్‌చార్జీలు, ఆదాయ వ్యత్యాసాన్ని కలిపి మూడేళ్లలో వసూలు చేసుకోవాలి
- ఓపెన్ యాక్సెస్ వినియోగదారులపై చార్జీల బాదుడు వద్దు
- విద్యుత్ (సవరణ)నిబంధనలు–2024 పేరుతో గెజిట్ ప్రకటించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చేసే మొత్తం వ్యయ్యాన్ని విద్యుత్ బిల్లుల రూపంలో రాబట్టుకోవాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. మొత్తం వ్యయాన్ని రాబట్టుకునే క్రమంలో వినియోగదారుల విద్యుత్ చార్జీలను ఎప్పటికప్పుడు పెంచాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ నెల 10న విద్యుత్ (సవరణ) నిబంధనలు–2024ను ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. తదుపరి ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ఆదాయానికి సంబంధించిన అంచనాలను సంబంధిత రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ప్రతి ఏటా నవంబర్‌లోగా డిస్కంలు సమర్పించాల్సి ఉంటుంది. దాన్ని పరిశీలించిన తర్వాత ఆదాయ అవసరాల మొత్తాన్ని ఈఆర్సీ ఆమోదిస్తుంది. ఈ మేరకు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిన విద్యుత్ చార్జీలను సైతం ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే ఈఆర్సీ ప్రకటించాల్సి ఉంటుంది. ఇకపై ఈఆర్సీ ఆమోదించే ఆదాయ అవసరాల మొత్తం, ప్రకటించిన టారిఫ్‌తో వచ్చే ఆదాయ అంచనాల మొత్తం మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండరాదని గజిట్‌లో

మిగతా 2వ పేజీలో ▶

ప్రజాభిప్రాయం.. సామాజిక న్యాయం



- 15 శాసనసభ, 6 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయ కర్తలను నియమించిన ఏపీ సీఎం జగన్
- మూడో జాబితాను ప్రకటించిన మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- మొత్తంగా 50 శాసనసభ, 9 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తల నియామకం
- ప్రజాభిప్రాయం, సామాజిక న్యాయం, మహిళలు, యువతకు పెద్దపీట
- గతంలో అగ్ర వర్ణాలకు కేటాయించిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు చోట్ల బీసీలు, రెండు చోట్ల మైనార్టీలకు అవకాశం

- వివరాలు 10లో

ప్రచారంపై ఫోకస్ చేసి ఉంటే గెలిచేవాళ్లం: కేటీఆర్

- పనుల మీద దృష్టి పెట్టడం వల్లే ఓటమిపాలయ్యాం
- కాంగ్రెస్ అబద్ధాల ముందు అభివృద్ధి ఓడిపోయింది
- అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తాం.. అందరికీ చేరువవుదాం..
- కేడర్‌కు ఏ సమస్య వచ్చినా బస్సు వేసుకుని వస్తాం: హరీశ్‌రావు
- మహబూబాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: వందలాది సంక్షేమ కార్యక్రమాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసినా ఏనాడూ ప్రజలను రోడ్ల మీద వరుసల్లో నిలబెట్టలేదని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజల సౌకర్యాల గురించి ఆలోచించామే తప్ప రాజకీయ ప్రయోజనాలు, ప్రచారం గురించి ఆలోచించలేదన్నారు. పనుల మీద కంటే ప్రచారం మీద ఫోకస్ చేసి ఉంటే మళ్లీ గెలిచేవాళ్లమని చెప్పారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన మహబూబాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. 'కాంగ్రెస్ ప్రచారం చేసిన అబద్ధాల ముందు బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి ఓడిపోయింది. అధికారంలోకి వస్తామనే ఆశలు లేని కాంగ్రెస్.. నోటికొచ్చిన హామీలను ఇచ్చింది. తప్పుడు ప్రచారాన్ని నమ్మి గొప్పగా పనిచేసిన బీఆర్‌ఎస్ నాయకులను కూడా ప్రజలు తిరస్కరించారు. కొత్తగా 6.47 లక్షల రేషన్ కార్డులు, అత్యధిక వేతనాలు, 46 లక్షల మందికి పింఛన్లు ఇచ్చినా ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యాం. ప్రజలు మనల్ని పూర్తిగా తిరస్కరించలేదు. బీఆర్‌ఎస్‌కు అసెంబ్లీలో మూడో వంతు సీట్లు రాగా, 14 స్థానాల్లో కేవలం 6 వేల ఓట్ల తేడాతోనే ఓడిపోయాం. కాంగ్రెస్‌కు, బీఆర్‌ఎస్‌కు ఓట్ల తేడా కేవలం 1.85 శాతం మాత్రమే. గిరిజనుల ప్రాబల్యం ఉన్న నియోజకవర్గాల్లో ఓటమిపై ఆత్మ విమర్శ చేసుకుంటాం. స్థానిక సంస్థలు మొదలుకుని అసెంబ్లీ ఎన్నికల దాకా బలమైన నాయకత్వం

మిగతా 3వ పేజీలో ▶

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రానికి 5వ ర్యాంక్

- తెలంగాణకు మొత్తం నాలుగు జాతీయ అవార్డులు
- క్లీన్ సిటీ కేటగిరీలో జీహెచ్‌ఎంసీకి 9వ ర్యాంక్
- చెత్త రహిత నగరాల్లో హైదరాబాద్‌కు 5 స్టార్ రేటింగ్
- అవార్డులు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- 2లో

'క్లీన్‌సిటీ'ల్లో విశాఖకు నాలుగో స్థానం..

- విజయవాడకు ఆరు, తిరుపతికి ఎనిమిదో స్థానం
- 'ఫాస్ట్ మూవింగ్ సిటీ'విభాగంలో గుంటూరుకు రెండో ర్యాంకు
- 'క్లీన్‌సిటీ ఇన్ ద ఏపీ' కేటగిరిలో పులివెందుల మున్సిపాలిటీకి అవార్డు
- ఫైవ్‌స్టార్ రేటింగ్స్‌తో దక్షిణాదిలో నంబర్‌వన్‌గా నిలిచిన ఏపీ

2 లో

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల..

- వివరాలు 2లో

కలిసి పనిచేద్దాం..

రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు మేం సిద్ధం..

సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్



సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: గూగుల్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తోందని, రాష్ట్రం కోసం వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి రంగాలకు సంబంధించిన డిజిటలైజేషన్ ఎజెండాను అభివృద్ధి చేయడంలో భాగస్వాములు కావడానికి ఆసక్తిగా ఉన్నట్టు చెప్పారు. పౌరుల అవసరాలకు తగ్గట్టు నాణ్యమైన సేవలు అందించడానికి అవసరమైన సాంకేతికత, నైపుణ్యం తమ వద్ద ఉందని వివరించారు. రహదారుల భద్రత విషయంలో గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్ సేవలను వినియోగించేందుకు ఉన్న అవకాశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన అరుణ్‌తివారీ, చిన్నబాబు

'వింగ్స్ ఆఫ్ ఫైర్' పుస్తక రచయిత అరుణ్‌తివారీ, కేన్సర్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎంతో మైక్రాన్ ప్రెసిడెంట్, సీఈఓ భేటీ

ప్రపంచంలోనే అతిపెద్ద మెమొరీ చిప్‌ల తయారీ కంపెనీ మైక్రాన్‌టెక్నాలజీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తే ప్రభుత్వం అన్ని రకాల సహకారాలు అందిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మైక్రాన్ కంపెనీ అధ్యక్షుడు, సీఈఓ సంజయ్ మెహ్రోత్రా గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మైక్రాన్ టెక్నాలజీ సెమీ కండక్టర్ల తయారీ రంగంలో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద కంపెనీ.

ఇదండీ సంగతి



..మీరు చచ్చి బతికిపోయార్సార్!

గురువారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులు



కాంగ్రెస్ టార్గెట్ 15

- మెజారిటీ ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి.. టీ కాంగ్రెస్ సమన్వయకర్తలకు ఖర్గే ఆదేశం
- రాష్ట్రం నుంచి పాల్గొన్న భట్టి, ఉత్తమ్, పొన్నం, జూపల్లి, సురేఖ, సీతక్క

సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణలో 15 ఎంపీ స్థానాల్లో గెలిచేలా పనిచేయాలని కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర నాయకత్వానికి టార్గెట్ విధించింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక తర్వాత తెలంగాణ నుంచే అధిక స్థానాలు ఆశిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ గురువారం దక్షిణాది రాష్ట్రాలైన

మిగతా 2వ పేజీలో ▶



బొమ్మలరామారం పీహెచ్‌సీ నుంచి బయలుదేరడానికి సిద్ధంగా డ్రోన్

బీబీనగర్ ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు..

- మర్యాల పీహెచ్‌సీ నుంచి నమూనాల సేకరణ
- భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు ఎయిమ్స్‌కు ట్రయల్‌రన్‌లో భాగంగా తరలింపు..

- 10లో

క్లుప్తంగా...

14 నుంచి రాహుల్ గాంధీ 'న్యాయ్ యాత్ర'

ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి షమా అహ్మద్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 14 నుంచి రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ యాత్ర'ప్రారంభిస్తారని ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి షమా అహ్మద్ తెలిపారు. గురువారం ఆమె గాంధీభవన్‌లో మాట్లాడుతూ మణిపూర్ నుంచి ముంబై వరకు ఈ యాత్ర ఉంటుందని, మొత్తం 6,700 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగుతుందని వివరించారు. దేశంలో యువత ఉద్యోగాలు, ఉపాధిలేక అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ సర్కార్ మోసం చేసిందని, పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు పెరిగిపోయాయని విమర్శించారు. దీంతో సామాన్య ప్రజల జీవనం కష్టంగా మారిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యక్తులపై ఈడీ, ఐటీ సంస్థలను ఉపయోగిస్తున్నారన్నారు. మరోవైపు కిసాన్, దళిత, ఆదివాసీలు, మణిపూర్‌లో చర్చిలు, ముస్లిం మైనారిటీల మీద దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.

సీఎం పీఆర్వోలుగా 'బొల్లం', మామిడాల శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ప్రజాసంబంధాల అధికారులు(పీఆర్వో)గా బొల్లం శ్రీనివాస్, శ్రీధర్ మామిడాలను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. బొల్లం శ్రీనివాస్ పలు పత్రికల్లో సీనియర్ జర్నలిస్టుగా పనిచేయగా, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యక్తిగత పీఆర్వోగా శ్రీధర్ మామిడాల చాలా ఏళ్లుగా కొనసాగుతున్నారు.

సీతారామ ప్రాజెక్టును తక్షణమే ఆపండి

కేంద్రం ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుమతులు లేకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తాజాగా రాష్ట్ర నీటి పారుదల శాఖను ఆదేశించింది. 25–30 శాతం పనులను పూర్తి చేసినట్టు క్షేత్రస్థాయి తనిఖీలో నిర్ధారించి గతంలోనే షోకాజ్ నోటీసులు జారీచేసింది. పర్యావరణ ప్రభావ మదింపు(ఈఐఏ) నోటిఫికేషన్–2006ను ఉల్లంఘించి పనులు కొనసాగించినందుకుగాను జరిమానాలు విధించేందుకు పర్యావరణ శాఖ సిద్ధమైంది. ఈ మేరకు అదనపు నిబంధనల(అడిషనల్ టీవోఆర్)ను జారీచేస్తామని, ప్రతిపాదనలు పంపించాలని కోరింది. నిబంధనలను ఉల్లంఘించి పనులు చేసిన అధికారులపై పర్యావరణ(పరిరక్షణ) చట్టం 1986లోని సెక్షన్ 19 కింద చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

వ్యవసాయ వర్సిటీలో హైకోర్టా?

హైకోర్టు పరిరక్షణ సమితి అభ్యంతరం



సమావేశంలో హైకోర్టు పరిరక్షణ సమితి సభ్యుల అభివాదం

పంజగుట్ట (హైదరాబాద్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాగున్న భవనాలను కూల్చేసి కొత్త భవనాలు నిర్మించి కమీషన్లు దండుకుందని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రస్తుతం ఎంతో బాగున్న హైకోర్టుకు బదులు కొత్త హైకోర్టు నిర్మిస్తాననడం కూడా కమీషన్ల కోసమేనా? అన్నది చెప్పాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. 'హైకోర్టు మార్పుతో న్యాయవాదులతో పాటు పర్యావరణానికి, వ్యవసాయ పరిశోధనలకు జరిగే నష్టం'అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం హైకోర్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. న్యాయవాది మల్లేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, ప్రొఫెసర్ వాసుదేవ్, బార్ కౌన్సిల్ సభ్యుడు భార్గవ్‌లు మాట్లాడుతూ .. వ్యవసాయంపై జాతీయస్థాయిలో పరిశోధనలు జరిపే ప్రాంతంలో హైకోర్టుకు స్థలం కేటాయించడం వ్యవసాయం నిర్వీర్యమయ్యేందుకు చేస్తున్న కుట్రేనన్నారు. హైకోర్టుకు స్థలం కేటాయిస్తూ తీసుకొచ్చిన జీవో 55ను రద్దుచేసే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. సంక్రాంతి తర్వాత అన్ని ప్రతిపక్షాలు, జేఏసీ, ప్రజా సంఘాలను కలుపుకొనిపోయి ఉద్యమిస్తామని వెల్లడించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, నాయకులు కమల్ సురేష్, ఫణీంద్రలు న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సత్యమూర్తి నాయక్, శారదాగౌడ్, మల్లేష్ గౌడ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో 5వ ర్యాంక్

తెలంగాణకు మొత్తం నాలుగు జాతీయ అవార్డులు

- క్లీన్ సిటీ కేటగిరీలో జీహెచ్ఎంసీకి 9వ ర్యాంక్
- చెత్త రహిత నగరాల్లో హైదరాబాద్‌కు 5 స్టార్ రేటింగ్
- అవార్డులు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరి నుంచి క్లీన్‌సిటీ అవార్డు అందుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఏటా అందజేసే ప్రతిష్టాత్మక స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో తెలంగాణ సత్తా చాటింది. పరిశుభ్రమైన నగరాలు (క్లీన్ సిటీస్), అతి పరిశుభ్రమైన (క్లీనెస్ట్) కంటోన్మెంట్, సఫాయిమిత్ర సురక్ష, గంగా టౌన్స్, మంచి పనితీరు కనబరచిన రాష్ట్రాలు (బెస్ట్ పెర్ఫార్మింగ్ స్టేట్స్) కేటగిరీలన్నీ కలిపి 110 అవార్డులను కేంద్రం ప్రకటించింది. ఇందులో తెలంగాణకు నాలుగు జాతీయ అవార్డులు లభించగా.. మొత్తం 3,029.32 పాయింట్లతో రాష్ట్రం 5వ స్థానంలో నిలిచింది. ఇక ఈ ఏడాది క్లీనెస్ట్ సిటీ అవార్డును ఉమ్మడిగా ఇండోర్, సూరత్‌లు గెలుచుకున్నాయి. ఆలిండియా క్లీన్ సిటీ కేటగిరీలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) 9వ ర్యాంకును కైవసం చేసుకుంది.

మరికొన్ని అవార్డులు

లక్ష కంటే తక్కువ జనాభా ఉన్న కేటగిరీలో తెలంగాణలో క్లీన్ సిటీగా గుండ్ల పోచంపల్లి అవార్డు గెలుచుకుంది. 25 వేలు –50 వేలు జనాభా కేటగిరీలో సౌత్ జోన్‌లో క్లీన్ సిటీగా నిజాంపేట్, 50 వేలు – 1 లక్ష జనాభా కేటగిరీలో సౌత్ జోన్‌లో క్లీన్ సిటీగా సిద్దిపేట స్థానిక సంస్థలు అవార్డులు కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 142 పట్టణ స్థానిక సంస్థల్లో ఓడీఎఫ్ కేటగిరీలో 19, ఓడీఎఫ్+ కేటగిరీలో 77, ఓడీఎఫ్++ కేటగిరీలో 45, వాటర్+ కేటగిరీలో 2 స్థానిక సంస్థలు ఉన్నాయి. చెత్త రహిత నగరాల్లో హైదరాబాద్‌కు 5 స్టార్ రేటింగ్ రాగా, సిద్దిపేట, నిజాంపేట్, గుండ్ల పోచంపల్లి, సికింద్రాబాద్ కంటోన్మెంట్, పీర్జాదిగూడ, సిరిసిల్ల, భువనగిరి, నార్సింగి స్థానిక సంస్థలకు 1 స్టార్ రేటింగ్ ఇచ్చారు. గురువారం ఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీలు అవార్డులను అందజేశారు.

'క్లీన్‌సిటీ'ల్లో విశాఖకు నాలుగో స్థానం

- విజయవాడకు ఆరు, తిరుపతికి ఎనిమిదో స్థానం
- 'ఫాస్ట్ మూవింగ్ సిటీ'విభాగంలో గుంటూరుకు రెండో ర్యాంకు



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్–2023 ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్‌కు అవార్డుల పంట పండింది. జాతీయ స్థాయిలో ఫైవ్‌స్టార్ రేటింగ్స్‌తో నాలుగు కార్పొరేషన్‌లు 'క్లీన్‌సిటీ'అవార్డులను సొంతం చేసుకుని దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ నంబర్‌వన్‌గా నిలిచింది. దేశంలో అత్యుత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగర పాలక సంస్థలు ఈ అవార్డులు దక్కించుకున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆలిండియా 4వ ర్యాంకు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 6వ ర్యాంకు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు 8వ ర్యాంకు లభించగా.. ఇండోర్ మొదటి స్థానంలో నిలిచింది. అలాగే, ఫాస్ట్ మూవింగ్ సిటీ విభాగంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 2వ ర్యాంకు లభించింది. ఇక సీఎం వైఎస్ జగన్ నియోజకవర్గమైన పులివెందులకు 'క్లీన్ సిటీ ఆఫ్ ఏపీ'అవార్డు లభించింది. స్వచ్ఛ భారత్ మిషన్ రూపొందించిన సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్, సర్టిఫికేషన్, సిటిజన్ వాయిస్‌కి సంబంధించి 9,500 మార్కులకు గాను గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) 8,879.25 మార్కులు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది. అలాగే చెత్తరహిత నగరాల్లో ఫైవ్‌స్టార్ రేటింగ్‌ను విశాఖ సాధించింది. మరోవైపు 2021, 2022, 2023 సంవత్సరాలలో గ్రేటర్ విశాఖ బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్, క్లీన్ బిగ్ సిటీ.. విజయవాడ కార్పొరేషన్ ఇండియా క్లీనెస్ట్ సిటీ, క్లీన్ స్టేట్ క్యాపిటల్ జాతీయ అవార్డులను వరుసగా సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకున్నాయి. ఇక తిరుపతి నగరం బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ (2021), సఫాయిమిత్ర సురక్షిత్ ప్రెసిడెంట్ అవార్డు (2022), జాతీయ అవార్డు (2023) దక్కించుకుంది. పుంగనూరు పురపాలక సంఘం 2021, 2022లో బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డును, పులివెందుల 2022లో ఇన్నోవేషన్, బెస్ట్ ప్రాక్టీస్ అవార్డు, 2023లో స్టేట్ అవార్డును దక్కించుకున్నాయి.

'బయో ఏషియా'తో పరిశ్రమల రాక

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆశాభావం



సాక్షి, హైదరాబాద్: బయోఏషియా సదస్సుకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణ ప్రభుత్వానికి అద్భుతమైన అవకాశమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఈ సదస్సుతో హైదరాబాద్‌కు మరిన్ని కొత్త పరిశ్రమలు, పెద్ద సంఖ్యలో పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫిబ్రవరి 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు హెచ్ఐసీసీలో జరిగే బయోఏషియా సదస్సుపై గురువారం సంబంధిత అధికారులతో మంత్రి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దాదాపు 50కి పైగా దేశాలు పాల్గొననున్నాయని, సుమారు 3 వేల మంది ప్రతినిధులు పాల్గొనే ఈ సదస్సుకు ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకు అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బయోఏషియా సదస్సుతో ఆరోగ్య సంరక్షణ రంగానికి అత్యంత మేలు జరుగుతుందన్నారు. ఇదివరకు జరిగిన 20 సదస్సులతో హెల్త్‌కేర్ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఈ సదస్సులకు అసాధారణ వ్యక్తులు హాజరు కానున్నారని, ఇప్పటికే స్పీకర్ల పేర్లు ప్రకటించడంతో అంతర్జాతీయస్థాయిలో ఈ సదస్సుకు ప్రాముఖ్యత సంతరించుకుందని మంత్రి వెల్లడించారు. అనంతరం ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా లైఫ్ సైన్స్ సెక్టార్ మరింత బలోపేతం అయిందన్నారు. ఆరోగ్య సంరక్షణతో పాటు పలు స్టార్టప్ కంపెనీలు ఉద్భవించాయన్నారు. హైదరాబాద్‌లో త్వరలో జరిగే ఈ సదస్సు హెల్త్‌కేర్ రంగానికి ఒక మైలురాయి అవుతుందని జయేశ్ రంజన్ అభిప్రాయపడ్డారు.

రాముడితో బీజేపీ రాజకీయం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచం మొత్తం కొలిచే శ్రీరామచంద్రుడిని బీజేపీ తన స్వార్థ రాజకీయాలకు వాడుకుంటోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని గురువారం ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఈనెల 22న జరగనున్న శ్రీరామ విగ్రహ ప్రతిష్టకు కాంగ్రెస్ హాజరు కావడం లేదని పార్టీ ప్రకటించినట్టు వెల్లడించారు.

వృద్ధ ఖైదీలను విడుదల చేయాలి

సాక్షి, హైదరాబాద్: కారాగారాలలో 60 ఏళ్లు దాటిన వృద్ధ ఖైదీలను జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌కు ఆయన లేఖ రాశారు. 60 ఏళ్లు దాటిన వృద్ధ ఖైదీలు, దీర్ఘ వ్యాధులతో బాధపడుతున్న వారు సత్ప్రవర్తన కలిగిన, దీర్ఘకాలికంగా జైల్లో మగ్గుతున్న ఖైదీలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

బై బై మాల్దీవులు

చలో లక్షద్వీప్

మాల్దీవులకు భారీగా తగ్గిన పర్యాటకుల బుకింగ్‌లు	విమాన చార్జీలు, ప్యాకేజీలపై భారీగా తగ్గించినా వెనుకంజ	లక్షద్వీప్‌కు పెరిగిన డిమాండ్



సాధారణంగా హైదరాబాద్ నుంచి ప్రతి రోజూ వందలాది మంది టూరిస్టులు మాల్దీవులకు వెళ్తారు. హైదరాబాద్ నుంచి కేవలం రెండున్నర గంటల ప్రయాణం కావడం, ఎక్కువ సంఖ్యలో దీవులు, ఆకట్టుకునే బీచ్‌లు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో మూడు, నాలుగు రోజుల పాటు గడిపేందుకు ఆసక్తి చూపుతారు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొద్ది రోజులుగా ఈ టూర్లు పూర్తిగా తగ్గిపోయాయి.

సాక్షి, హైదరాబాద్: పర్యాటకులకు స్వర్గధామంగా భావించే మాల్దీవుల పట్ల నగరవాసులు విముఖతను ప్రదర్శిస్తున్నారు. సాధారణంగా హైదరాబాద్ నుంచి మాల్దీవులకు రోజూ విమానాలు రాకపోకలు సాగిస్తాయి. పర్యాటకులతోపాటు కొత్తగా పెళ్లయిన జంటలు మాల్దీవులను హనీమూన్‌కు ఎంపిక చేసుకుంటారు. అలాగే డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు కూడా మాల్దీవులు కొంతకాలంగా కేరాఫ్‌గా మారింది. కానీ ఇటీవల ప్రధాని మోదీ లక్షద్వీప్ పర్యటన సందర్భంగా మాల్దీవుల మంత్రులు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో దేశంతోపాటు నగరం నుంచీ అక్కడికి వెళ్లే పర్యాటకుల సంఖ్య అకస్మాత్తుగా పడిపోయింది. ఇప్పటికే ప్యాకేజీలు బుక్ చేసుకున్న వాళ్లు పర్యటనలు వాయిదా వేసుకుంటుండగా, కొత్తగా ఎలాంటి బుకింగ్‌లు కావడం లేదని హైదరాబాద్‌కు చెందిన పలు ట్రావెల్స్ సంస్థలు తెలిపాయి. పలు ఎయిర్‌లైన్స్, ట్రావెల్స్ సంస్థలు విమాన, ప్యాకేజీ చార్జీలను తగ్గించినప్పటికీ మాల్దీవులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని నగరానికి చెందిన ఒక ప్రముఖ ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా వరుస సెలవులను దృష్టిలో ఉంచుకుని వెళ్లే వాళ్లు కూడా తమ పర్యటనలను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. దీంతో కొత్త సంవత్సరం సందర్భంగా ఉండే డిమాండ్ కూడా బాగా తగ్గిందన్నారు.

లక్షద్వీప్ వైపు సిటీ చూపు..

మాల్దీవులకు ప్రత్యామ్నాయంగా నగర పర్యాటకులు లక్షద్వీప్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో లక్షద్వీప్‌కు పర్యాటక ప్యాకేజీలు, విమాన చార్జీలు కూడా పెరిగాయి. లక్షద్వీప్‌లో రెండు రోజుల క్రూయిజ్ పర్యటనకు గతంలో రూ.20 వేలు ఉంటే ప్రస్తుతం రూ.35 వేల వరకు ప్యాకేజీ ధరలు పెరిగాయి. ప్యాకేజీల వివరాలను తెలుసుకొనేందుకు పదుల సంఖ్యలో ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు సికింద్రాబాద్‌కు చెందిన ఒక పర్యాటక సంస్థ ప్రతినిధి చెప్పారు. లక్షద్వీప్‌తోపాటు సమీప ప్రాంతాల్లో పర్యటించేందుకూ సిటీజనులు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు గోవా, డామన్ డయ్యూ, కోవలం తదితర ప్రాంతాలకు సైతం సిటీ టూరిస్టులు తరలివెళ్తున్నారు.

ప్యాకేజీల్లో భారీ రాయితీలు

ఒక్కసారిగా మాల్దీవులకు వెళ్లే టూరిస్టులు తగ్గిపోవడంతో ట్రావెల్స్ సంస్థలు, ఎయిర్‌లైన్స్ భారీ ఆఫర్లతో ముందుకొచ్చాయి. గతంలో మూడు రోజుల ప్యాకేజీ రూ.55,000 నుంచి రూ.72,000 వరకు ఉంటే దాన్ని ఇప్పుడు రూ.45,000 నుంచి రూ.60,000 వరకు తగ్గించినట్లు ఒక ట్రావెల్ ఏజెంట్ చెప్పారు. అలాగే రూ.లక్షల్లో ఉండే ప్రీమియం ప్యాకేజీలపైనా భారీ తగ్గింపును ప్రకటించారు. ప్రీమియం ప్యాకేజీలపై రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు తగ్గించినట్లు మరో ట్రావెల్స్ ప్రతినిధి తెలిపారు. విమానంలో సింగిల్ జర్నీ గతంలో రూ.20 వేల వరకు ఉంటే ఇప్పుడు రూ.15వేల వరకు తగ్గించారు. మరోవైపు ఇప్పటికే బుకింగ్‌లు చేసుకున్నవారు మాత్రం తమ పర్యటనలను రద్దు చేసుకోకుండా వాయిదా వేసుకుంటున్నారు. బుకింగ్‌లను రద్దు చేసుకుంటే భారీగా నష్టపోయే అవకాశం ఉండటంతో వాయిదా వేసుకుంటున్నారు. కానీ కొత్తగా బుకింగ్‌లు మాత్రం కావడం లేదు. అన్ని ట్రావెల్స్ సంస్థల్లో మాల్దీవులకు బుకింగ్‌లు పూర్తిగా స్తంభించాయి.

విద్యకు సహకారం అందించండి

హార్వర్డ్ వర్సిటీ బృందానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న హార్వర్డ్ అధ్యాపక బృందం

సాక్షి, హైదరాబాద్: రెసిడెన్షియల్ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఏడాదిపాటు విద్యా కార్యక్రమాలు నిర్వహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం అందించాలని హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యాపకుల బృందానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. డాక్టర్ డొమినిక్ మావో నేతృత్వంలో హార్వర్డ్ వర్సిటీ అధ్యాపకబృందం గురువారం సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జనవరి 7 నుంచి నిర్వహిస్తున్న ప్రోగ్రాం ఫర్ సైంటిఫిక్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్ (పీఎస్ఐఎల్–24) కార్యక్రమంలో పాల్గొనడానికి ఈ బృందం రాష్ట్రానికి వచ్చింది. ఈ బృందం 40 ప్రభుత్వ పాఠశాలల్లో 10–12 తరగతులు చదువుతున్న 100 మంది విద్యార్థులతో పాటు 33 జిల్లాల ఉన్నత పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులకు 5 రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఎంఎస్ షెఫాలీ ప్రకాశ్, డాక్టర్ ఎండీ రైట్ పాల్గొన్నారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా కింద రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి రాజీనామాలతో ఏర్పడిన ఖాళీల భర్తీకి ఈ ఉప ఎన్నికలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తొలి రోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం పేర్కొంది. ఈ నెల 18తో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుంది. 29న పోలింగ్ జరగనున్నారు.

జోక్యం చేసుకోలేం

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలపై పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికలకు ఇప్పటికే నోటిఫికేషన్ వచ్చినందున జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329(బీ) ప్రకారం.. ఈ దశలో జోక్యం చట్టవిరుద్ధమని అభిప్రాయపడింది. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరి రాజీనామాలతో ఖాళీ ఏర్పడిన రెండు ఎమ్మెల్సీ సీట్లకు విడివిడిగానే ఎన్నిక నిర్వహించాలని షెడ్యూల్‌లో ఈసీ పేర్కొంది. రెండింటికీ బ్యాలెట్ పేపర్లను సైతం వేర్వేరు సెట్స్ సిద్ధం చేయాలని, ఒకటి తెలుపు, మరొకటి గులాబీ రంగులో ముద్రించాలని వివరించింది. పోలింగ్ స్టేషన్లనూ విడిగానే ఏర్పాటు చేయాలంది. ఓటర్ల జాబితా కూడా విడివిడిగా రూపొందించాలని నిర్దేశించింది. ఓట్ల లెక్కింపు కూడా విడివిడిగానే జరుగుతుందని పేర్కొంది. ఎన్నికల అధికారులు సహా అన్నీ వేర్వేరుగానే ఉండాలని నిర్దేశించింది. అయితే విడివిడిగా జరిగితే ప్రతి ఎన్నికకు అసెంబ్లీలోని 119 మంది ఎమ్మెల్యేలు ఓటర్లుగా మారుతారు. దీంతో కాంగ్రెస్సే రెండు స్థానాలు గెలిచే అవకాశం ఉంటుంది. ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పటోళ్ల కార్తీక్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(4), ఎన్నికల ప్రవర్తన నియమావళి 1961లోని రూల్ 70 ప్రకారం.. ఒకేసారి ముగియనున్న (నవంబర్ 30, 2027) ఎమ్మెల్సీ పదవీ కాల పరిమితికి ఉప ఎన్నికలు నిర్వహిస్తే ఒకే ఎన్నిక నిర్వహించాలన్నారు. విడివిడిగా ఎన్నిక జరుపుతామంటూ జనవరి 4.. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నోటిఫికేషన్ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఈసీ తరఫున అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 151 ప్రకారమే కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం .. పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రెండు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

- సీఎం రేవంత్‌తో మున్షీ చర్చలు పూర్తి.. ఢిల్లీలో భట్టి అభిప్రాయ సేకరణ
- అద్దంకి దయాకర్, మహేశ్‌కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ, ఫిరోజ్‌ఖాన్ పేర్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటాలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనకు రంగం సిద్ధమవుతోంది. రెండు స్థానాలూ కాంగ్రెస్ పార్టీకి దక్కే అవకాశమున్న నేపథ్యంలో రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటించాలని పార్టీ భావిస్తోంది. అందులో భాగంగా రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయం తీసుకుని అధిష్టానానికి నివేదించారు. లోక్‌సభ సమన్వయకర్తల సమావేశం కోసం ఢిల్లీ వెళ్లిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కూడా అధిష్టానం పెద్దలు ఈ విషయమై చర్చించి ఆయన అభిప్రాయం తీసుకున్నారని తెలుస్తోంది. ఈ రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల కోసం ఎస్సీ, బీసీ, మైనార్టీల పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. రేవంత్ మంత్రివర్గంలో కచ్చితంగా స్థానం లభిస్తుందని భావిస్తున్న తుంగతుర్తి నాయకుడు అద్దంకి దయాకర్ అభ్యర్థిత్వాన్ని ఎమ్మెల్యే కోటాలో ప్రకటించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన బీసీ వర్గాలకు చెందిన నాయకుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు కూడా దాదాపు ఖరారైందని సమాచారం. వీరిద్దరితో పాటు మైనార్టీ కోటాలో షబ్బీర్‌అలీ, ఫిరోజ్‌ఖాన్ పేర్లను కూడా అధిష్టానం పరిశీలిస్తోందని, పటేల్ రమేశ్‌రెడ్డిని నల్లగొండ ఎంపీగా, చిన్నారెడ్డిని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పంపించే ఆలోచనలో కాంగ్రెస్‌పెద్దలున్నట్టు సమాచారం.

కరెంట్ బిల్లులు పెంచాల్సిందే!

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రం స్పష్టం చేసింది. ఒకవేళ వ్యత్యాసం ఉన్నా, 3 శాతానికి మించరాదని ఆదేశించింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే ఈ విషయంలో మినహాయింపు ఉంటుందని తెలిపింది.

లేట్ పేమెంట్ సర్‌చార్జీతో: విద్యుదుత్పత్తి కంపెనీలకు గడువులోగా బిల్లులు చెల్లించనందుకు డిస్కంలపై విధించే లేట్ పేమెంట్ సర్‌చార్జీతో ఈ ఆదాయ వ్యత్యాసాన్ని కలిపి రానున్న మూడేళ్లలో మూడు సమ వాయిదాల్లో వసూలు చేసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ గెజిట్ అమల్లోకి రాక ముందు నాటి ఆదాయ వ్యత్యాసాలను, లేట్‌పేమెంట్ సర్‌చార్జీలను మాత్రం వచ్చే ఏడేళ్లలో ఏడు సమ వాయిదాల్లో వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని చెప్పింది.

వాటికి లైసెన్స్ అక్కర్లేదు: ఏదైనా విద్యుదుత్పత్తి కంపెనీ/కాప్టివ్ విద్యుత్ ప్లాంట్/ఎనర్జీ స్టోరేజీ సిస్టం అవసరాల కోసం ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేసుకోవడం, నిర్వహించడం, గ్రిడ్‌కు అనుసంధానం చేయడం కోసం ఇకపై లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే, వాటి సామర్థ్యం అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పరిధిలో 25 మెగావాట్లు, రాష్ట్ర అంతర్గత ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పరిధిలో 15 మెగావాట్లలోబడి ఉండాలి.

అదనపు సర్‌చార్జీ బాదుడు వద్దు: దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ వినియోగదారులపై అదనపు సర్‌చార్జీలతో పోలిస్తే స్వల్ప కాలిక ఓపెన్ యాక్సెస్ వినియోగదారులపై విధించే అదనపు సర్‌చార్జి 110 శాతానికి మించి ఉండరాదు. అన్ని రకాల ఓపెన్ యాక్సెస్ వినియోగదారులపై విధించే అదనపు సర్‌చార్జీలు.. డిస్కంలు కొనుగోలు చేసే విద్యుత్‌కు సంబంధించిన ఫిక్స్‌డ్ ధరలకు మించకుండా ఉండాలి.

కాంగ్రెస్ టార్గెట్ 15

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళతోపాటు పాండిచ్చేరి సమన్వయకర్తలతో భేటీ అయ్యారు. తెలంగాణ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీప్‌దాస్‌మున్షీతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్కతో పాటు ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు హాజరయ్యారు.

అభ్యర్థుల ఎంపిక నుంచి ఓటరు దాకా...

ఈ భేటీలో ప్రధానంగా అభ్యర్థుల ఎంపిక, ప్రచార సరళి, బూత్‌ల పటిష్టత, ఓటర్ మ్యాపింగ్, వ్యవస్థాపకంగా వివిధ విభాగాల మధ్య సమన్వయం, ఓటరుకు చేరువ వంటి అంశాలపై ఏఐసీసీ పెద్దలు కీలక సూచనలు చేశారు. ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలని, బూత్ లెవల్ ఏజెంట్లను ముందుగానే గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించినట్టు తెలిసింది. దీనిపై ఇప్పటినుంచే కసరత్తు మొదలు పెట్టి పార్టీ వార్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పినట్టు సమాచారం. ఇదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి 60–70 సీట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో అధికారంలో ఉన్న కర్ణాటక నుంచి 22–25 సీట్లు, తెలంగాణ నుంచి 15 సీట్లు ఆశిస్తున్నట్టు వివరించారు. ఈ నెలాఖరుకే అభ్యర్థుల జాబితా తమకు పంపేలా చూడాలని.. సామాజిక సమీకరణలు, ప్రజల్లో బలం, సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఉండాలని సూచించారు. దీనికి రాష్ట్ర నేతలు సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

మెజారిటీ స్థానాల్లో గెలుపే లక్ష్యం: భట్టి, ఉత్తమ్

భేటీ అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మెజారిటీ స్థానాల్లో గెలిచేలా పనిచేస్తామని భట్టి తెలిపారు. దీనికి అనుగుణంగా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. రాష్ట్రం నుంచి అగ్రనేత సోనియాగాంధీ పోటీ చేయాలని ఇదివరకే హైకమాండ్‌కు తెలిపామని, దీనిపై సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నట్టు తెలిపారు. సోనియా పోటీ చేస్తే భారీ మెజారిటీతో గెలిపిస్తామని చెప్పారు. ఉత్తమ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో 13–14 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండలో 3 లక్షల పైచిలుకు మెజారిటీతో విజయం సాధిస్తామన్నారు.

క్లుప్తంగా...

ఎమ్మెల్యే జేబు నుంచి రూ.12 వేలు మాయం

తెలంగాణ భవన్‌లో దొంగల చేతివాటం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ భవన్‌కు వచ్చిన పలువురు బీఆర్‌ఎస్ నేతల వద్ద దొంగలు చేతివాటం ప్రదర్శించారు. గురువారం మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట రావు జేబు నుంచి రూ.12 వేలు కొట్టేశారు. మరో కార్యకర్తకు చెందిన ఫోన్, ఇంకో కార్యకర్త నుంచి రూ.42 వేలను మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో కొట్టేశారు. సమావేశాల్లో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో నాయకులు వస్తుండటం, మధ్యాహ్న భోజన సమయంలో రద్దీ ఉండటంతో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో శుక్రవారం నుంచి తెలంగాణ భవన్ వద్ద భద్రతను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారు.

బీజేపీకి విక్రమ్ గౌడ్ రాజీనామా

పార్టీలో పనిచేసినా గుర్తింపు లేదని ఆవేదన



సాక్షి, హైదరాబాద్: బీజేపీకి మాజీ మంత్రి ఎం.ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ రాజీనామా చేశారు. గురువారం ఈ మేరకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి తన రాజీనామా లేఖను పంపించారు. పార్టీలో చేరి మూడున్నరేళ్ల పాటు పార్టీ నియమావళికి, సిద్ధాంతానికి కట్టుబడి క్రమశిక్షణతో పనిచేసినా తనను ఏ స్థితిలోనూ గుర్తించకపోవడంతో పార్టీ నాయకత్వం వ్యవహారశైలి తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. పార్టీలో సరైన ప్రోత్సాహం, అవకాశాలు లభించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్టు ఈ లేఖలో తెలియజేశారు. బీజేపీ పట్ల నమ్మకంతో చేరిన కొత్త వారిని అంటరానివారిగా చూస్తున్నారని విక్రమ్ గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల్లో కనీస ప్రభావం లేని నాయకులకు పార్టీ పదవులు అంటగట్టి తమ లాంటి వారిపై వారు పెత్తనం చెలాయించడం, తమ భవిష్యత్‌ను నిర్ణయించే స్థితితో ఉండడం నిజంగా ఆశ్చర్యం కలిగించిందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రవర్తించిన తీరు చూస్తుంటే అసలు తెలంగాణలో పార్టీకి అధికారంలోకి రావాలనే ఆలోచన ఉన్నట్టు అనిపించలేదని వ్యాఖ్యానించారు. టికెట్ ఆశించి భంగపడ్డవారిని కనీసం పిలిపించి సముదాయించే ప్రయత్నం చేయకపోవడం పార్టీలో నాయకత్వ లేమికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నా కూడా పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు కనబడడం లేదని పేర్కొన్నారు. అందుకే తనకు బీజేపీ సరైన వేదిక కాదని భావించి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు విక్రమ్‌గౌడ్ తెలియజేశారు.

ఖమ్మం డీసీసీబీపై కాంగ్రెస్ నజర్

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పీఠంపై కాంగ్రెస్ పార్టీ కన్నేసింది. దీని పాలకవర్గం బీఆర్‌ఎస్ చేతిలో ఉంది. రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యాన డీసీసీబీని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. వీవీ పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌గా ఎన్నికైన కూరాకుల నాగభూషణం డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నారు. ఈ క్రమంలో వీవీ పాలెం సహకార సంఘంలోని 11 మంది డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార అధికారికి గురువారం నోటీసు అందించారు. దీంతో పదిహేను రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహిస్తామని డీసీవో తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ పదవిని నాగభూషణం కోల్పోతే డీసీసీబీ చైర్మన్ పదవి నుంచి కూడా తప్పుకోవాల్సి వస్తుంది. ఇదే జరిగితే వైస్ చైర్మన్‌కు పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించవచ్చు. అనంతరం బ్యాంకు డైరెక్టర్లలోంచి ఒకరిని డీసీసీబీ నూతన చైర్మన్‌ను ఎన్నుకుంటారు. తద్వారా చైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్‌పార్టీ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

మళ్లీ టీఆర్‌ఎస్?

బీఆర్‌ఎస్ పేరు మార్చాలంటున్న పార్టీ శ్రేణులు

- పార్టీ పేరులో 'తెలంగాణ ఆత్మ' లోపించిందనే ఆవేదన... బీఆర్‌ఎస్ లోక్‌సభ సన్నాహక సమావేశాల్లో పెరుగుతున్న ఒత్తిడి
- ప్రజల్లో నేటికీ టీఆర్‌ఎస్‌గానే గుర్తింపు ఉందంటున్న నేతలు... పార్టీ అధినేత కేసీఆర్‌కు నివేదించాలని నాయకుల సూచన
- లోక్‌సభ ఎన్నికల నాటికి పేరు మార్పిడి ప్రక్రియ పూర్తి చేసే యోచన?



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ పార్టీగా అవతరించి లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు సుమారు తొమ్మిదిన్నరేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పేరును మునుపటి మాదిరే తెలంగాణ రాష్ట్రసమితి (టీఆర్‌ఎస్)గా మార్చాలనే ఒత్తిడి పెరుగుతోంది. తొమ్మిది రోజులుగా జరుగుతున్న బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఈ మేరకు పార్టీ నాయకులు ముక్తకంఠంతో కోరుతున్నారు. కిందిస్థాయి నేతల నుంచి వస్తున్న డిమాండ్‌కు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు కూడా మద్దతు పలుకుతున్నారు. ఈ నెల 3 నుంచి పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్ వేదికగా ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 22 వరకు ఇవి కొనసాగనున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి ఇతర ముఖ్య నేతలు ఈ భేటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పార్టీ కేడర్ తమ అభిప్రాయాలు వెల్లడించేందుకు అవకాశం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత కంటే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలు, పార్టీ పని తీరు, సంస్థాగత నిర్మాణం లేకపోవడం వంటి అంశాలపైనే పెద్ద సంఖ్యలో సలహాలు, సూచనలు అందుతున్నాయి.

తెలంగాణ సెంటిమెంటుతో పెనవేసుకుపోయాం

ముఖ్యంగా రాష్ట్ర సాధన లక్ష్యంగా ఏర్పడిన టీఆర్‌ఎస్ పేరును బీఆర్‌ఎస్‌గా మార్చడాన్ని పార్టీ నేతలు ప్రస్తావిస్తున్నారు. ప్రజల్లో నేటికీ టీఆర్‌ఎస్‌గానే పార్టీకి గుర్తింపు ఉందని, పార్టీ పేరులో 'తెలంగాణ' లేకపోవడంతో ఆత్మ లోపించినట్లుగా ఉందని చెప్తున్నారు. తెలంగాణఆత్మగౌరవంతో ముడిపడిన పార్టీ పేరులో ఆ పదం లేకపోవడం లోపంగా మారిందని, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ఇది కూడా ఓ అంశంగా పనిచేసిందని అంటున్నారు. తెలంగాణ అనే సెంటిమెంటుతో సుమారు రెండు దశాబ్దాలకు పైగా తాము పెనవేసుకు పోయామని, పార్టీ పేరు మార్చడాన్ని తమతో పాటు కేసీఆర్ అభిమానులు, తెలంగాణవాదులు జీర్ణించుకోలేక పోతున్నామని స్పష్టం చేస్తున్నారు. విపక్ష పార్టీలు, వారి కనుసన్నల్లో నడిచే మీడియా, డిజిటల్ వేదికలు, యూట్యూబ్ చానెళ్లు ఇదే అంశాన్ని ఎజెండాగా చేసుకుని తెలంగాణ రాష్ట్ర సాధనలో పార్టీ పోషించిన పాత్రను తక్కువగా చేసి చూపించే ప్రయత్నం చేశాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు టీఆర్‌ఎస్ పేరిట చివరగా పోటీ చేసిన మునుగోడులో గెలుపొందామని, బీఆర్‌ఎస్ పేరు పార్టీకి అచ్చిరాలేదనే సెంటిమెంటును కూడా కొందరు నేతలు లేవనెత్తుతున్నారు. పార్టీ పేరును మళ్లీ టీఆర్‌ఎస్‌గా మార్చాలనే తమ విన్నపాన్ని పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరుతున్నారు. పార్టీ నేతల నుంచి వస్తున్న ఈ ప్రతిపాదనను సన్నాహక సమావేశాల్లో పాల్గొంటున్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సహా ఇతర కీలక నేతలు బలపరుస్తుండటం గమనార్హం.

జాతీయ స్థాయిలో కూటమికి ఓకే

జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించేందుకు అవసరమైన భావసారూప్య పార్టీలతో కూటమి ఏర్పాటు చేసే కార్యక్రమానికి కేసీఆర్ నాయకత్వం వహిస్తే తమకు అభ్యంతరం లేదని పార్టీ నాయకులు నొక్కి చెప్తున్నారు. తెలంగాణ సాధించిన నేతగా జాతీయ స్థాయిలో కేసీఆర్‌కు మంచి పేరుందని అంటున్నారు. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా.. జాతీయ అంశాలకు సంబంధించి ఒత్తిడి పెంచేందుకు భావసారూప్య శక్తులతో కలిసి నడవాలనే సూచనలు కూడా ఈ భేటీల్లో వస్తున్నాయి. కాగా ఈ నెల 22న భేటీలు పూర్తయిన తర్వాత పూర్తి స్థాయి నివేదిక రూపొందించి కేసీఆర్‌కు ఇవ్వాలని ముఖ్య నేతలు నిర్ణయించారు. కేసీఆర్ ఆమోదం తెలిపిన పక్షంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే లోపు పార్టీ పేరు మార్పు ప్రక్రియను పూర్తి చేస్తామని బీఆర్‌ఎస్ కీలక నేత ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

వరికి బోనస్ పేరిట కాంగ్రెస్ మోసం

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: వరికి బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలసి మీడియాతో మాట్లాడుతూ, రైతుబంధు విషయంలో డిప్యూటీ సీఎం ఒక మాట, వ్యవసాయ మంత్రి మరోమాట మాట్లాడుతున్నారన్నారు. కృష్ణా బేసిన్‌లో నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని, గోదావరి బేసిన్‌లో మాత్రం కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన నీళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సాగునీరు ఇచ్చే విషయంలో రైతులకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి ఎన్నికల హామీల నుంచి కాంగ్రెస్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని నిరంజన్‌రెడ్డి అన్నారు. మిర్చి పంట క్రయ, విక్రయాలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని సత్యవతి రాథోడ్ అన్నారు. మీడియా సమావేశంలో ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎంపీ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఎమ్మెల్యే లేఖ



సాక్షి, హైదరాబాద్: తాను పాల్గొంటున్న అధికారిక కార్యక్రమాల్లో జరుగుతున్న ప్రొటోకాల్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు లేఖ రాశారు. ఈ నెల 10వ తేదీన సంగారెడ్డి టీఎన్జీవో భవన్‌లో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తాను సకాలంలో హాజరైనట్టు లేఖలో పేర్కొన్నారు. అయితే అధికారులు ఆ కార్యక్రమాన్ని ప్రారంభించకుండా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలరెడ్డి రాక కోసం వేచిచూడటంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. కార్యక్రమం ఆలస్యం కావడంతో తాను పాల్గొనాల్సిన ఇతర కార్యక్రమాలకు కూడా అంతరాయం కలిగిందని చెప్పారు.

ప్రచారంపై ఫోకస్ చేసి ఉంటే గెలిచేవాళ్లం: కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

ఉంది. కేసీఆర్ లాంటి గొప్ప నాయకుడు పార్టీకి అండగా ఉన్నారు' అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. 'అడ్డగోలుగా ఇచ్చిన హామీలను నెరవేర్చే దారిలేకనే అప్పులు, శ్వేతపత్రాల పేరిట రేవంత్ రెడ్డి నాటకాలాడుతున్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించేందుకే స్వేదపత్రం రూపొందించాం. అన్ని వర్గాలకు పార్టీ దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తాం' అని కేటీఆర్ చెప్పారు.

ఓటమి స్పీడ్ బ్రేకర్ మాత్రమే: హరీశ్‌రావు

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని భవిష్యత్తులో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'విద్య, వైద్యం, వ్యవసాయం, రోడ్లు ఇలా అన్ని రంగాల్లో కేసీఆర్ అభివృద్ధి చేసినా కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేసింది. రుణమాఫీ, ధాన్యానికి బోనస్ తదితరాలపై మాట తప్పి దగా చేశారు. విద్యుత్‌లో కొత్త విధానం అంటే విద్యుత్‌ను 48 గంటలు ఇస్తారా. లోక్‌సభ ఎన్నికల్లో సమష్టిగా కష్టపడదాం. నెల రోజుల్లో కేసీఆర్ తెలంగాణ భవన్‌లో ఉంటారు. కేడర్‌కు ఏ సమస్య వచ్చినా బస్సు వేసుకుని మీ ముందుకొస్తాం. కార్యకర్తలను కాపాడుకునేందుకు ట్రస్ట్ ఏర్పాటు చేసి కేడర్ పిల్లలకు సహకారం అందిస్తాం. అక్రమ కేసుల నుంచి కార్యకర్తలను కాపాడేందుకు తెలంగాణ భవన్‌తోపాటు జిల్లా కార్యాలయాల్లోనూ లీగల్ సెల్ ఏర్పాటు చేస్తాం. మండల, జిల్లా కమిటీలు వేసుకొని పార్టీని మరింత బలోపేతం చేసుకుందాం. త్యాగాల పునాదుల మీద ఏర్పడిన బీఆర్‌ఎస్‌కు గెలుపోటములు కొత్త కాదు. గల్లీలో ఎవరున్నా తెలంగాణ ప్రయోజనాలు ఢిల్లీలో కాపాడటం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుంది. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌కు చూపింది ట్రైలర్ మాత్రమే. అసలు సినిమా ముందుంది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో అప్పుడే కుమ్ములాటలు: కడియం

కాంగ్రెస్‌లో కుమ్ములాటలు మొదలయ్యాయని, మంత్రి పొంగులేటి తానే నంబర్ 2గా చెప్పుకుంటున్నారని, డిప్యూటీ సీఎం భట్టికి ముఖ్యమంత్రి పదవి రాలేదని ఆయన భార్య వాపోతున్నారని మాజీ మంత్రి కడియం శ్రీహరి ఆరోపించారు. 'కేటీఆర్, హరీశ్‌రావు కృష్ణార్జునుల తరహాలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి. కార్యకర్తలకు అగ్రనాయకత్వం అందుబాటులో ఉండాలి. గతంలో ఎంపికైన దళిత బంధు లబ్ధిదారులకు సాయాన్ని ఆపాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గం' అని కడియం పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'వ్యూహం'పై 22న హైకోర్టు తీర్పు

సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై వాదనలు పూర్తి



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం సినిమా విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. పిటిషనర్, నిర్మాత, దర్శకుడు, సీబీఎఫ్‌సీ తరఫు న్యాయవాదుల వాదనలు పూర్తి కావడంతో తుది ఉత్తర్వులను ఈ నెల 22న వెల్లడిస్తామని రాష్ట్ర హైకోర్టు పేర్కొంది. తెలుగుదేశం పార్టీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా గురువారం మరోసారి విచారణ చేపట్టారు. నిర్మాత తరఫున సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. '2023, అక్టోబర్ 28న సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ కోసం నిర్మాత దరఖాస్తు చేసుకోగా, దానిని అడ్డుకునేందుకు అదే నెల 30న ఫిర్యాదు చేశారు. దీనిని 31న సీబీఎఫ్‌సీ చైర్మన్ తిరస్కరించారు. దాంతో నవంబర్‌లో మరోసారి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిర్మాత ఇదే హైకోర్టును ఆశ్రయించారు. రివిజన్ కమిటీ ఏర్పాటు చేసి సర్టిఫికెట్ జారీపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. 9 మందితో ఏర్పాటైన కమిటీ కొన్ని మార్పులతో ఏకగ్రీవంగా సర్టిఫికెట్ జారీ చేసింది. అయితే దీనిని సవాల్ చేస్తూ టీడీపీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఇదే హైకోర్టు ఆదేశాల మేరకు ఇచ్చిన సర్టిఫికెట్‌ను మళ్లీ ఇదే కోర్టు నిలుపుదల చేయడం సరికాదు. చిత్రం విడుదలలో జాప్యం కారణంగా నిర్మాత పెద్ద ఎత్తున నష్టపోయే అవకాశం ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌ను కొట్టివేయాలి' అని విజ్ఞప్తి చేశారు. ఆర్జీవీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ చెబుతున్నట్లు ఏపీ ఎన్నికలు సరైన కారణం కాదు. ఏదో రకంగా చిత్రం విడుదలను ఆపాలన్నదే వారి ఉద్దేశం. నిజంగా ఏపీ ఎన్నికలన్నదే కారణం అయితే మరి తెలంగాణలో విడుదలకు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారు. చిత్రం నిర్మాణం పూర్తయిన నాటి నుంచే అడుగడుగునా అడ్డుకుంటూ వస్తున్నారు' అని వివరించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది శ్రవణ్‌కుమార్, సీబీఎఫ్‌సీ తరఫున ఏఎస్‌జీ నరసింహ శర్మ వాదనలు వినిపించారు.

కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరు

అయోధ్య కార్యక్రమాన్నే బహిష్కరిస్తారా?

- బాలరాముడి ప్రాణప్రతిష్ఠ ఆహ్వాన తిరస్కరణ ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనం
- హిందువుల జీవనవిధానంపై గౌరవం లేని కాంగ్రెస్: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ బహిష్కరించాలనే నిర్ణయాన్ని ప్రజలు క్షమించరని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి వచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరించడం కాంగ్రెస్ దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. శ్రీరామ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అంటే కాంగ్రెస్‌కు కంటగింపు ఎందుకని ప్రశ్నించారు. గురువారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడు తూ అభద్రతాభావంతో, కుహనాలౌకికవాదంతో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తూ హిందుత్వ వ్యతిరేక వైఖరిని చాటుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటుబ్యాంకు, బుజ్జగింపు, మతతత్వ రాజకీయాల కోసం, తమ దుర్మార్గపు ఆలోచనల పరంపరలో భాగంగానే అయోధ్యకు వచ్చేది లేదంటూ కాంగ్రెస్ రాజకీయ దృక్పథంతోనే ఈ నిర్ణయం తీసు కుందన్నారు. రాముడి ఉనికినే కొట్టివేసిన చరిత్ర కాంగ్రెస్‌దని, బహిష్కరించడం ఆ పార్టీకి అలవాటయిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న నాయకత్వంతో కాంగ్రెస్ పార్టీ.. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, హిందువుల జీవన విధానంపై ఏమాత్రం గౌరవం లేకుండా వ్యతిరేకంగా మాట్లాడుతోందని నిందించారు.

మజ్లిస్ మెప్పు పొందేందుకే హిందువులపై కేసులు

పార్లమెంట్, జీ-20, ఎన్నికల కమిషన్ సమావేశాలను కాంగ్రెస్ బహిష్కరించిందని దేశ సమగ్రత దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. అయోధ్య రామాలయ అక్షింతలు పంపిణీ చేస్తుంటే సికింద్రాబాద్ పోలీసులు కేసు నమోదు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నొప్పి ఏంటి? పోలీసులకు వచ్చిన ఇబ్బంది ఏంటి? వారం రోజుల తర్వాత ఎవరి ఒత్తిడితో కేసులు పెట్టారని ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీ మెప్పు పొందేలా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

కాంగ్రెస్‌కు ముందుంది ముసళ్ల పండుగ

ప్రస్తుతం కాంగ్రెస్ కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లకే పరిమితమైందని, ఇంకా ఆ పార్టీకి ముందుంది ముసళ్ల పండుగ అని కిషన్‌రెడ్డి హెచ్చరించారు. ఈనెల 22న శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా.. అన్ని వర్గాలకు చెందిన ప్రముఖులు, కవులు, కళాకారులు, సాధుసంత్‌లు, సామాజిక సంస్థలు, ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించారని చెప్పారు. ఈ ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత సోనియా గాంధీ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అధీర్ రంజన్ చౌదరిలను ట్రస్టు ఆహ్వానించిందని కిషన్‌రెడ్డి వివరించారు.



నిశ్చయంగా - ప్రజలలో మంచి పనులు చేసేవారు ఎవరో పరీక్షించటానికి - మేము భూమిపై ఉన్న వస్తువులను దానికి అలంకారంగా (ఆకర్షణీయ మైనవిగా) చేశాము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 12 జనవరి 2024

'మహా' జనానిదే తుది తీర్పు

సుప్రీంకోర్టు తుది గడువు దగ్గరపడుతున్న వేళ మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ బుధవారం తన నిర్ణయాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికే పార్టీ ఎమ్మెల్యేల్లో అత్యధికుల మద్దతుందనీ, అదే 'నిజమైన శివసేన' అనీ తేల్చారు. అలాగని ఉద్ధవ్ ఠాక్రే వెంటనున్న ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయలేదు. పార్లమెంటు నుంచి అసెంబ్లీల వరకూ మన చట్టసభల్లో ఫిరాయింపులు, ఇతరేతర సమస్యలు తలెత్తినప్పుడు అధికార పక్షాల ప్రయోజనాల పరిధిని మించి స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవటానికి సభాధ్యక్షులు సిద్ధపడరని తరచు రుజువవుతూనేవుంది. మహారాష్ట్ర కూడా దానికి మినహాయింపు కాదు. అందువల్లే రెండుగా చీలిన శివసేన వర్గాల్లో ఏది నిజమైందో, ఏది కాదో తేల్చడానికి స్పీకర్ నార్వేకర్‌కు ఏడాదిన్నర కాలం పట్టిందంటే ఆశ్చర్యం లేదు. జనవరి 10 తుది గడువని సుప్రీంకోర్టు గట్టిగా చెప్పకపోయివుంటే మరెన్ని నెలలు పట్టేదో అనూహ్యం. లెక్కలు తేల్చడానికి శివసేనకు భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు లేరు. అయినా నార్వేకర్ గరిష్ఠ వ్యవధిని తీసుకుని తుది నిర్ణయం ప్రకటించారు. 2019లో ఆ పార్టీ నేతృత్వంలో ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వం ఏర్పడిననాటికి శివసేన ఎమ్మెల్యేలు 55 మంది. 2022 జూన్ 21న 34 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సభానాయకుడిగావున్న ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో తిరగబడటంతో పార్టీ నిలువునా చీలింది. వెంటనే ఉద్ధవ్ మేల్కొని షిండే స్థానంలో సభానాయకుడిగా అజయ్ చౌధరిని నియమించటంతోపాటు, విప్‌గా వున్న షిండే వర్గం నేతను తొలగించి, తన వర్గంలోని సునీల్ ప్రభును ప్రకటించారు. ఎన్ని చేసినా ప్రయోజనం లేదని గ్రహించాక జూన్ 29న ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేశారు.

మరికొన్ని నెలల్లో సాధారణ ఎన్నికలు రాబోతుండగా వెలువడిన నార్వేకర్ నిర్ణయం... ఈ చీలికను ప్రోత్సహించి షిండే సర్కారులో చేరిన బీజేపీకి సహజంగానే ఊరటనిచ్చే అంశం. భావోద్వేగాల ప్రభావం ఎక్కువుండే మహారాష్ట్రలో ఉద్ధవ్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడివుంటే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి సానుభూతి వెల్లువెత్తేది. ఇప్పటికే ఉద్ధవ్ శివసేన పేరును, గుర్తును కూడా కోల్పోయారు. ఆ అంశంలో ఎన్నికల సంఘం షిండే వర్గానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. సొంత మనిషిగా భావించిన షిండేయే బీజేపీ ప్రోద్బలంతో శివసేనలో చిచ్చు రగిల్చి ఉద్ధవ్‌కు అన్యాయం చేశారని జనం భావిస్తున్నట్టు పలు సర్వేలు చెబుతున్నాయి. ఇది షిండే వర్గంతోపాటు బీజేపీని కూడా దెబ్బతీసేలా వున్నదని ఆ సర్వేల సారాంశం. అందుకే అనర్హత అంశం జోలికి వెళ్లకపోవటమే మంచిదని షిండే వర్గం భావించినట్టు కనబడుతోంది. అయితే ఉద్ధవ్ వర్గం మౌనంగా ఏమీవుండదు. స్పీకర్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయటంతోపాటు ప్రజాక్షేత్రంలోకెళ్తానని ఇప్పటికే ప్రకటించింది. కనుక 'నిజమైన శివసేన' షిండేదేనన్న స్పీకర్ నిర్ణయంపై అది కావలసినంత రచ్చ చేస్తుంది. అటు కొందరు ఎమ్మెల్యేలతో నిష్క్రమించిన అజిత్ పవార్ వర్గంపైనా ఇలాంటి పిటిషనే పెండింగ్‌లో వుంది. ఈనెల 31లోగా వెలువడే ఆ నిర్ణయం కూడా ప్రకంపనలు రేపడం ఖాయం.

మన రాజ్యాంగం సభాధ్యక్షులకు ఎన్నో అధికారాలిచ్చింది. అనేక సందర్భాల్లో న్యాయస్థానాలు సైతం ప్రభుత్వాల బలాబలాలు తేలాల్సింది చట్టసభల్లోనేనని తేల్చిచెప్పాయి. కానీ తాము ఎమ్మెల్యేగా ఎన్నికైన పార్టీల ప్రయోజనాల పరిధిని మించి స్పీకర్లు వ్యవహరించలేకపోతున్నారు. మహారాష్ట్ర విషయానికే వస్తే ఉద్ధవ్ వర్గం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, స్పీకర్‌పై ఒత్తిడి తెస్తే తప్ప నిర్ణయం వెలువడలేదు. తమ నిర్ణయాలను ప్రశ్నించే అధికారం న్యాయస్థానాలకు లేదని స్పీకర్‌లు చెబుతూ వుంటారు. వాటి ఆదేశాలను బేఖాతరు చేస్తుంటారు. అయితే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించినంతవరకూ అటువంటి స్వతంత్రతను అందరూ హర్షిస్తారు. అందుకు భిన్నంగాపోయి న్యాయస్థానాలతో అక్షింతలు వేయించుకునే పరిస్థితి తెచ్చుకుంటే అది స్పీకర్ల వ్యవస్థను బలహీనపరుస్తుంది. సాధారణంగా ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లేని సందర్భాల్లో ప్రభుత్వాలు ఏర్పడేటపుడూ... ఆ ప్రభుత్వాలు అస్థిరతలో పడినప్పుడూ ప్రత్యర్థి పక్షాలు ఖరీదైన విలాసవంతమైన హోటళ్లలో శిబిరాలు నిర్వహించటం, అవసరాన్నిబట్టి విమానాల్లో వేరే రాష్ట్రాలకు ఎమ్మెల్యేలను తరలించటం తరచు మన దేశంలో కనబడుతూనేవుంటుంది. ఈ తంతు మన ప్రజాస్వామ్యానికి తలవంపులు తెస్తున్నది కూడా. దానికితోడు సభాధ్యక్షులుగా వున్నవారు సైతం ఏదో ఒక వర్గం చేతిలో కీలుబొమ్మలై తటస్థతకు తూట్లుపొడిచి నిర్ణయాలు తీసుకోవటం లేదా నిర్ణయ ప్రకటనలో విపరీతమైన జాప్యం చేయటం తరచు కనబడుతుంది. భారీ మెజారిటీతో నెగ్గిన తెలుగుదేశం అధినేత స్వర్గీయ ఎన్టీఆర్ సర్కారును ఆయనకు స్వయానా అల్లుడైన చంద్రబాబు నాయుడు 1995 ఆగస్టులో కూల్చి, అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు జరిగిన పరిణామాలను ఎవరూ మరిచిపోరు. అంతకుముందూ, ఆ తర్వాతా కూడా పదే పదే అలాంటి ఉదంతాలే దేశంలో పునరావృతమయ్యాయి. స్పీకర్ తాజా నిర్ణయంపై ఉద్ధవ్ వర్గం న్యాయస్థానంలోనూ, వెలుపలా పోరాడుతుంది. ఇప్పటికైతే షిండే ప్రభుత్వం నిశ్చింతగా వుండొచ్చు. కానీ ఈ చీలికలపైనా, ప్రభుత్వాలను కూల్చటంపైనా జనం స్పందన ఎలావుండబోతున్నదో రాబోయే ఎన్నికల్లో తేలుతుంది. ఆ తర్వాతైనా రాజకీయ పక్షాలు పరిణతితో వ్యవహరించటం నేర్చుకుంటాయని ఆశించాలి.

నవ భారతంలోకి ముందడుగు

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

దేశంలో మహిళలు ఇప్పటికీ అర్ధ బానిసత్వంలోనే ఉన్నారు. పితృస్వామ్యం, సంకుచిత సామాజిక, సాంస్కృతిక విలువలు, లింగ వివక్ష వంటివి మహిళల వెనుకబాటుతనానికి కారణాలు. భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందక పోవడానికి కారణం, పితృస్వామ్యం. ఈ పరిస్థితి మారాలి. మహిళతో పాటు నిరుద్యోగి, రైతు, కార్మికుడు, యువత కూడా జీవన సంక్షోభంలో ఉన్నారు. స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాద భావనలు కూడా సంక్షోభంలో పడ్డాయి. అందుకే 2024 సంవత్సరంలో ప్రజలు ఆత్మగౌరవంతో, అభ్యుదయ భావాలతో నడవాలి. గిరిజనులు, దళితులు, బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు స్వేచ్ఛగా జీవించగలిగే నూత్న భారత నిర్మాణం కోసం కలిసికట్టుగా పనిచేయాలి.

భారతదేశం లౌకిక దేశం. భారతాన్ని వర్ణ భారతంగా మార్చాలన్నది పెద్ద వ్యూహం. కానీ అది సాధ్యం కాదు. ఎందుకంటే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామిక, లౌకిక రాజ్యాంగంగా రూపుదిద్దారు. దాని పునాదులను కదపటం ఎవరి వల్లా కాదు. అంబేడ్కర్ రాజ్యాంగ రూపకల్పనలో ఫ్రెంచి విప్లవంలోని వాల్టేర్, రూసో భావాలను తీసుకున్నారు. నిజానికి ఆయన రాజ్యాంగం పునాదుల పునర్నిర్మాణం నుండి ప్రారంభమైంది. రాజ్యాంగం ప్రకారం, ఆరు సంవత్సరముల వయసు పూర్తి అగు వరకు బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు, విద్యా వసతులు కల్పించటానికి ప్రభుత్వం కృషి చేయాలి. 14 సంవత్సరాల వయసు వచ్చువరకు బాల బాలికలకు ఉచిత నిర్బంధ విద్య నేర్పాలి. అయితే ఈనాటికీ బాల బాలికలకు పౌష్టిక ఆహారం పెట్టలేని స్థితిలో మనం ఉన్నాము. పసిపిల్లలకు పాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నాము. పిల్లలకు పౌష్టికాహారం కావాలి, ఆరోగ్య పరిరక్షణ కావాలి, పర్యావరణ పరిరక్షణ కావాలి. పురిటిలోనే శిశువులు చనిపోతున్న పరిస్థితులు పెరుగుతున్నాయి. ఒక శిశువుని పెంచి పోషించాలంటే పేదరాలైన తల్లి వల్ల కాదు. దానికి ప్రభుత్వపు, సమాజపు బాధ్యత కూడా కావాలి.

నిజానికి ఒక శిశువు మరణిస్తే ఆ దేశానికి భవిష్యత్తు మరణించినట్టే. రాను రాను భారతదేశంలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. దానికి కారణం విపరీతంగా రేట్లు పెరిగిపోవడమే. 2019 జనవరి నుండి 2022 మే వరకు కూరగాయలు, పాలు, బెల్లం, దుంపలు, వంటనూనె, గుడ్లు, పంచదార ఉత్పత్తి, సరఫరా తగ్గుముఖం పట్టాయి. బియ్యం, పప్పులు, ఉప్పులు కొనుక్కోలేని స్థితికి సామాన్యులు నెట్టబడుతున్నారు. కారణం కూరగాయలు రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ఎరువులు, విత్తనాల ధరలు ఎక్కువవుతున్నాయి. అకాల వర్షాలకు రైతు కుదేలవుతున్నాడు. కాళ్ళు సన్నగా, కడుపులు బోలుగా, భుజాన కండలేక 40 కోట్ల మంది ఈసురోమంటున్నారు.

ఇంక స్త్రీల విషయానికి వస్తే పురుషులు తినినంత కూడా తినలేకపోతున్నారు. వాళ్లు అర్ధ బానిసత్వంలోనే ఉన్నారు. వారితో ఆరు గాలం పనిచేయించుకుంటున్నారు. మహిళల్లో సగం మంది కూడా ఉద్యోగినులు లేరు. పితృస్వామ్యం, సంకుచిత సామాజిక, సాంస్కృతిక విలువలు, అల్ప విద్యాస్థాయి, తగు ఆస్తులు లేకపోవడం, లింగ వివక్ష, మహిళలపై నేరాలు, ఘోరాలు అత్యధికంగా ఉండడం వంటివి మహిళల వెనుకబాటుతనానికి కారణాలుగా చెప్పక తప్పదు. ఎన్సీఆర్‌బి (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) నివేదిక (డిసెంబర్ 2023) ప్రకారం, మహిళల పట్ల జరుగుతున్న నేరాలు 2021లో కంటే, 2022లో 4 శాతం అధికంగా సంభవించాయి. 2022లో మహిళలకు వ్యతిరేకంగా 4,45,000 నేర ఘటనలు జరిగాయి. కుటుంబ సభ్యుల క్రూరత్వం, దౌర్జన్యాలు ఈ నేరాలలో అత్యధికం. ప్రతీ జీవన వ్యవహారంలోనూ, మరీ ముఖ్యంగా ఆదాయంలో లింగ వ్యత్యాసం, వివక్ష తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఉత్పత్తి కార్యకలాపాలలో పట్టణ మహిళల భాగస్వామ్యం 24.0 శాతం కాగా, పురుషుల శాతం 73.8 శాతంగా ఉన్నది. 2004–2005, 2011–2012 సంవత్సరాల మధ్య కార్మిక శ్రేణుల నుంచి దాదాపు రెండు కోట్ల మంది మహిళలు వైదొలిగారని ప్రపంచ బ్యాంకు నివేదికలు వెల్లడించాయి.



ఈ అంతరాలను విస్మరించడమంటే, మహిళలు ఇంకా పలు దశాబ్దాల పాటు అణచివేతకు గురికావడమే అని నిష్కర్షగా చెప్పక తప్పదు. భారతదేశం పితృస్వామ్య వ్యవస్థా నిర్మాణంతో ఉంది. అంటే ప్రతీ అంశంలోనూ పురుషుడిదే ఆధిపత్యం. అందుకే ఆడశిశువు భ్రూణ హత్యలు ఎక్కువగా జరిగాయి. ఫలితంగా చాలామంది పురుషులకు ఇప్పుడు పెళ్ళి చేసుకోవడానికి అమ్మాయిలు దొరకడం లేదు. కొందరు ఎదురు కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకుంటున్నారనే కథనాలు వినిపిస్తున్నాయి. మరోవైపు బాలికలు, యువతులను అపహరించడం, వారిని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి వ్యభిచార వృత్తిలోకి దింపడం ఎక్కువవుతోంది. స్త్రీలను అవమానించడం, అనుమానించడం, అపహాస్యం చేయడం, అత్యాచారం చేయడం, అణచివేయడం నిత్యాచారమైంది. భారతదేశం అంతా ఆర్థికంగా అభివృద్ధి చెందక పోవడానికి కారణం, పితృస్వామ్యం. ముందుగా స్త్రీకి మనం పౌష్టికాహారం పెట్టగలగాలి. స్త్రీల పేరు మీద భూములకు పట్టాలివ్వాలి. బస్సుల్లోనే కాక రైళ్ళల్లోనూ, విమానాల్లోనూ ఉచిత సేవలు అందించాలి. అప్పుడు అన్ని చోట్లకీ ఆమె ప్రయాణించగలుగుతుంది. ప్రస్తుతం బంగారు నిల్వలు ఎక్కువగా ఉంటున్నాయి కాబట్టి, మూడు శవర్ల బంగారం ప్రతీ స్త్రీకి ఇవ్వాలి.

ఇకపోతే నిరుద్యోగుల సంఖ్య భారతదేశంలో పెరిగిపోతోంది. 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' నివేదిక 2023 ప్రకారం, 25 సంవత్సరాల లోపు వయసు పట్టభద్రులలో నిరుద్యోగితా రేటు 42.3 శాతం. 30 నుంచి 34 సంవత్సరాల వయసు పట్టభద్రులలో ఇది 9.8 శాతం. ఈ నిరుద్యోగిత పరిస్థితులు సమాజంపై విషమ ప్రభావాన్ని చూపుతున్నాయి. అంతర్గత వలసలు, అంతకంతకూ పెచ్చరిల్లుతోన్న నేరాలు, హింసాకాండ, మాదకద్రవ్యాల వినియోగం నిరుద్యోగిత పర్యవసానాలే అనడంలో సందేహం లేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామన్న పాలకపక్షం హామీ కేవలం ఒక ఎన్నికల జుమ్లా (వంచన) అని తేలిపోయింది. నిరుద్యోగులు ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎంఏ, ఎంఎడ్, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, బీఎడ్‌లు చేసి కూడా ఉపాధి పనులకు వెళ్తున్నారు. సింగపూర్‌లోని హ్యూమన్ క్యాపిటల్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్, మరికొన్ని సంస్థలు కలిసి ఏటా విశ్వ ప్రతిభా పోటీతత్వ సూచీ(జీటీసీఐ)ని వెలువరిస్తుంటాయి. విద్య, నైపుణ్య శిక్షణ, అవకాశాల లభ్యత, ప్రభుత్వాల చేయూత వంటి ప్రమాణాల ఆధారంగా 'జీటీసీఐ'ని రూపొందిస్తాయి. 2023 సూచీలో 134 దేశాలకు గాను ఇండియాకు 103వ స్థానం దక్కింది. అయినా, ప్రపంచంలో అతిపెద్ద ప్రతిభా కర్మాగారం ఇండియాయేనని ప్రభుత్వ వర్గాలు ఊదరగొడుతున్నాయి.

ఆర్థిక సాంఘిక సాంస్కృతిక విద్యా సాంకేతిక రంగాలు సంక్షోభంలో ఉన్నాయి. శిశువు, స్త్రీ, నిరుద్యోగి, రైతు, కార్మికుడు, యువత జీవన సంక్షోభంలో ఉన్నారు. భారత రాజ్యాంగం సమర్పించిన స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమత, మమత, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం కూడా సంక్షోభంలో పడ్డాయి. అందుకే 2024 సంవత్సరంలో ప్రజలు సామర్థ్యాన్ని పెంచుకొని, చైతన్యవంతంగా ఉత్పత్తిని పెంచుకోవాలి. సామరస్యతను పెంచుకొని ఆత్మగౌరవంతో, అభ్యుదయ భావాలతో నడవాలి. అంబేడ్కర్, ఫూలే, బుద్ధుని ఆశయాలతో సంపద అందరికి పంపిణీ అయ్యే విధానంతో సాగాలి. మొత్తం భారతదేశం 2025 జనవరి 1 కల్లా సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలి. పారిశ్రామిక విప్లవంలో ముందడుగు వేయాలి. గిరిజనులు, దళితులు, బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు స్వేచ్ఛగా జీవించగలిగే నూత్న భారత నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. నదులను అనుసంధానం చేసుకొని ఎక్కువ ఎగుమతులు చేయగలిగిన స్థాయిలో ఉత్పత్తిని పెంచుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంచుకోవాలి. చంద్రుడినే కాదు, అనేక గ్రహాలను అధీనం చేసుకునే స్థాయికి ఎదగాలి. భౌతిక, రసాయన శాస్త్ర అధ్యయన విస్తృతి పెరగాలి. నోబెల్ బహుమతి పొందగలిగే స్థాయిలో విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యను పెంచాలి. అన్ని దిశలా అన్ని రంగాల్లో భారతీయులందరం భాగస్వాములై భారత భాగ్యోదయానికి కృషి చేద్దాం. చరిత్రను పాలకులు కాదు, ప్రజలే మారుస్తారు. చరిత్ర నిర్మాణానికి ముందుకు నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గాల్లో ప్రాణాలు



మా చిన్న చెల్లె కొడుకు, 25 ఏళ్లవాడు కారు ప్రమాదంలో మరణించాడు. వాడు వాళ్లకు ఒకే అబ్బాయి. మెడిసిన్ చదువుతున్నాడు. ఇంటర్న్‌షిప్ పూర్తయ్యే దశలో ఉన్నాడు. రోడ్లు, హైవేల అక్రమ కోతలు, ఇంజినీరింగ్ లోపాలను సవరించేంతవరకూ విలువైన ప్రాణాల్ని మనం నష్టపోతూనే ఉంటాం.

– గురిందర్ సింగ్ ఢిల్లోఁ
పంజాబ్ అదనపు డీజీపీ

వాళ్లదే చేస్తారు



ఒక విషయంలో నన్ను ఇక మార్చలేనంతగా స్విస్ / జర్మన్ అయిపోయాను. జలుబును తగ్గించడానికి ఎడతెరిపి లేకుండా లైమ్ బ్లాసమ్ (వేప వంటి ఒక చెట్టు), కామొమిల్ (సీమ చేమంతులు) హెర్బల్ టీలు తాగుతూనే ఉన్నాను.

– సుచిత్ర, తమిళ రచయిత్రి

ఎందుకలా?



ప్రజాస్వామ్యాన్ని (ఓటు ద్వారా నిర్ణయం తీసుకునే విధానం) సమర్థించిన మొదటి తత్వవేత్త బుద్ధుడు. అదే సోక్రటీస్, ప్లేటో ఈ భావనను వ్యతిరేకించారు. అయితే, 2000 ఏళ్ల అనంతరం జ్ఞానోదయం అయిన ఆలోచనాపరులు రోమన్ రిపబ్లిక్‌ను పునరుజ్జీవింపజేశారు. కానీ వైశాలి నిర్మాణం మాత్రం భారతీయుల జ్ఞాపకాల్లో లేకుండా పోయింది.

– జోసెఫ్ టి నూనీ, థింకర్

అలా వ్యాపించాలి!



కవిత అనేది లావుపాటి కవితల పుస్తకానికి చెందదు. అది లంచ్‌బ్యాగు వెంట నడవాలి, అద్దం దగ్గర వేలాడాలి, పార్టీ ఆహ్వానాలతో అందుతుండాలి, క్యాండీని చుట్టే నోట్ కావాలి.

– డి.ఎ. పావెల్, అమెరికన్ కవి

తప్పేం లేదు!



గోప్యతకూ, ప్రైవసీకి చాలా తేడా ఉంది. ఎంత దగ్గరివాళ్లు అయినప్పటికీ, కొన్ని విషయాలను వ్యక్తిగతంగా ఉంచుకోవాలని అనుకోవడం పట్ల పశ్చాత్తాపం ఏమీ అక్కర్లేదు.

– పూజా గర్గ్, సైకాలజిస్ట్

చావు ముంగిట్లోనూ...

సమాజాన్ని తట్టి లేపే అరుదైన కవుల్లో ఒకరు అలిశెట్టి ప్రభాకర్. బతికింది కొద్ది కాలమే అయినా సమాజం అనే విశాలమైన 'కాన్వాస్'పై బలమైన సాహిత్య ముద్రను వేసి 'తాను మరణించి జనులకి కవిత నందించి' అన్నట్లుగా జీవిత కాలంలో తను చూసిన పరిస్థితులనూ, అనుభవించిన పేదరికాన్నీ, సమాజంలోని వైరుధ్యాలనూ ఓ వైపు వ్యాధి (క్షయ) ముదిరి చావుకి దగ్గరౌతున్నా అదరక చెదరక బెదరక కలాన్ని ముందుకు నడిపి కవితా సేద్యం చేసిన కవి కర్షకుడు అలిశెట్టి ప్రభాకర్. 'ఎర్ర పావురాలు' (1978), 'మంటల జెండాలు', 'చురకలు' (1979), 'రక్తరేఖ' (1985), 'ఎన్నికల ఎండమావి' (1989), 'సంక్షోభ గీతం' (1990), 'సిటీలైఫ్' (1992) వంటి కవిత్వ సంపుటాలు అచ్చువేసి తెలుగు సాహిత్యంపై తనదైన ముద్రను వేశాడు.



అలిశెట్టి ప్రభాకర్

'ఒక నక్క /ప్రమాణస్వీకారం చేసిందట/ఇంకెవర్నీ మోసగించనని /ఒక పులి/పశ్చాత్తాపం ప్రకటించిందట/ తోటి జంతువుల్ని సంహరించినందుకు/ ఈ కట్టుకథ విని/గొర్రెలింకా/ పుర్రెలూపుతూనే ఉన్నాయ్.' అక్షర సత్యాలు పై వాక్యాలు.

'ఓ ఆడదాని కళ్ళు తవ్వేశా /కన్నీటి శిథిలాలు బయల్పడ్డాయి
ఓ దౌర్భాగ్యుడి పొట్టలో ప్రవేశించా/పేగులు నాగుబాముల్లా బుసలు కొట్టాయి/ఓ చిన్నారి హృదయాన్ని స్పృశించా /వాని తల్లి శిలావిగ్రహమే బ్రద్దలైంది'

దశాబ్దాల క్రితం రాసిన ఈ మాటలు ఇప్పటి పరిస్థితులకూ వర్తిసాయనడం అతిశయోక్తి కాదు. ఏ వాదాలకూ, ఏ వివాదాలకూ లొంగక తనదైన శైలిలో సాహిత్యాన్ని సుసంపన్నం చేసి నేటికీ విమర్శకులకూ, పరిశోధకులకూ కొత్త ప్రశ్నలు వేస్తున్నాడు అలిశెట్టి ప్రభాకర్. జాషువా **'సుకవి జీవించు ప్రజల నాలుకల యందు'** అన్నట్లుగా నేటికీ కవిత్వ రూపంలో జీవించే ఉన్నాడు అలిశెట్టి. తెలుగు సాహిత్య చరిత్రలో జయంతి, వర్ధంతి ఒకే తేదీన ఉన్న వ్యక్తి బహుశా అలిశెట్టి ప్రభాకర్ (12.1.1954 – 12.1.1993) ఒక్కడే కావచ్చు. **'మరణం నా చివరి చరణం కాదు. మనోహరాకాశంలో విలపించే చంద్రబింబం నా అశ్రుకణం కాదు. పీడుతుడే నా అస్త్రం – అణ్వస్త్రం శత్రువు నా పాద ధూళి'** లాంటి పదునైన వాక్యాలు ప్రభాకర్ శైలికి నిదర్శనాలు. శ్రీ శ్రీ, దాశరథి తరువాత సమాజాన్ని తట్టిలేపే సాహిత్యాన్ని అందించిన గొప్ప వ్యక్తి అలిశెట్టి ప్రభాకర్.

– డాక్టర్ మహ్మద్ హసన్, సాహిత్య విమర్శకులు
(నేడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)

వికసిత భారత్ లక్ష్య సాధనకు యువతే కీలకం

సందర్భం




బండారు దత్తాత్రేయ

స్వామి వివేకానంద, 19వ శతాబ్దపు భారతీయ తత్వవేత్త, ఆధ్యాత్మిక నాయకుడు, గొప్ప ఆలోచనాపరుడు, వక్త, కవి, యువతకు మార్గనిర్దేశకుడు. ప్రపంచ పునరుత్పాదకతకు యువతను చోదక శక్తిగా ఆయన భావించారు. యువతలో నిక్షిప్తమై ఉన్న నిగూఢమైన శక్తిని ఉదాత్తమైన ఆదర్శాల వైపు మళ్లించడం ద్వారా సమాజంలో గొప్ప పరివర్తన తీసుకురావచ్చని ఆయన నమ్మారు. వ్యక్తిత్వ నిర్మాణం, నైతిక సమగ్రత, బలమైన ఆత్మవిశ్వాసం వంటివి యువత అభివృద్ధికి అవసరం అని నొక్కి వక్కాణించారు. ఆధునిక విద్య, ఆధ్యాత్మిక జ్ఞానాల చక్కటి సమ్మేళనాన్ని పెంపొందించుకోవాలని ఆయన యువతను ప్రోత్సహించారు. విద్యా వ్యవస్థ జ్ఞానాన్ని అందించడంతోపాటూ సామాజిక బాధ్యతనూ, స్వావలంబననూ పెంపొందించాలని వాదించారు.

స్వామి వివేకానందుని జయంతిని ప్రతి ఏడాదీ జనవరి 12న 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుకొంటున్నాం. నిర్భయులూ, నిస్వార్థపరులూ, మానవ సేవకు కట్టుబడి ఉండేవారుగా యువతరాన్ని స్వామి అభివర్ణించారు. నిర్భాగ్యులకు సేవ చేయడం అంటే దేవునికి నిజమైన సేవ చేసినట్లని ఆయన బలంగా నమ్మారు. మాతృభూమికి, ప్రజానీకానికి సేవ చేసేందుకు దేశంలోని యువత దృఢ సంకల్ప శక్తిని కలిగి ఉండాలన్నారు. 'మీరందరూ, ఎక్కడ ప్లేగు లేదా కరువు వ్యాప్తి చెందినా, లేదా ప్రజలు ఎక్కడ కష్టాల్లో ఉన్నారో అక్కడికి వెళ్లి, వారి బాధలను తగ్గించండి' అని యువతకు పిలుపునిచ్చారు.

స్వామి 1893 సెప్టెంబర్ 11న చికాగోలో 'వరల్డ్ పార్లమెంట్ ఆఫ్ రిలిజియన్స్'(ప్రపంచ మతాల సమ్మేళనం)లో చేసిన ఉపన్యాసం వివిధ మతాలకు చెందిన వారిపై చెరగని ముద్ర వేసింది. తన హృదయాంతరాళం నుంచి పెల్లుబికిన భాతృభావంతో 'అమెరికా సోదరీ, సోదరులారా' అని సంబోధిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. అంతే... ఒక్కసారిగా ఉరుము ఉరిమినట్లు ప్రేక్షకుల నుంచి చప్పట్ల మోత! 'మీరు మాకు అందించిన సాదరమైన అపురూప స్వాగతానికి మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. ప్రపంచంలోని అత్యంత పురాతనమైన సన్యాసుల తరఫునా, మతాలకే మాత అయిన మతం తరఫునా, హిందూ మతానికి చెందిన అన్ని వర్గాలూ, తెగలకు చెందిన లక్షలాదిమంది ప్రజల తరఫునా పేరు పేరునా ధన్యవాదాలు' అన్నారు. అలాగే 'ప్రపంచానికి సహనం, సార్వత్రిక అంగీకారం రెండింటినీ బోధించిన మతానికి చెందినవాడిగా నేను గర్వపడుతున్నాను. మేము సార్వత్రిక సహనాన్ని విశ్వసించడంతోపాటూ అన్ని మతాలనూ నిజమైనవిగా అంగీకరిస్తాం... భూమిపై ఉన్న అన్ని మతాలకూ, దేశాలకూ చెందిన బాధితులకూ, శరణార్థులకూ ఆశ్రయం కల్పించిన దేశానికి చెందినవాడిగా నేను గర్విస్తున్నాను' అని ఎలుగెత్తి చాటారు.



నేడు స్వామి వివేకానంద జయంతి : జాతీయ యువజన దినోత్సవం

'ఎరైజ్, ఎవేక్, అండ్ స్టాప్ నాట్ అంటిల్ ది గోల్ ఈజ్ రీచ్డ్' (లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి) అని స్వామి ఇచ్చిన పిలుపు ఎంతో ప్రసిద్ధి చెందింది. అలాగే 'మీరు లోపల నుండి ఎదగాలి. ఎవరూ మీకు బోధించరు, మిమ్మల్ని ఆధ్యాత్మికంగా మార్చరు. మీ సొంత ఆత్మ తప్ప మరొక గురువు లేదు' అని బోధించారు. ఒక దేశ బలం, శక్తి దాని యువత చేతుల్లోనే ఉందని నొక్కి చెప్పారు. ఆయన దృష్టిలో యువత సానుకూల మార్పుకు దీపధారులు. మంచి భవిష్యత్తును రూపొందించడానికి అవసరమైన శక్తి, ఉత్సాహం, సృజనాత్మకతను కలిగి ఉండేవారు. 'మీరు బలహీనులని భావించడం మహాపాపం... విశ్వంలోని అన్ని శక్తులూ ఇప్పటికే మనవి. కళ్లకు అడ్డుగా చేతులు పెట్టుకొని అంతా చీకటి అని ఏడ్చేదీ మనమే. మీ జీవితంలో రిస్క్ తీసుకోండి. మీరు గెలిస్తే, మీరే నాయకత్వం వహించవచ్చు; మీరు ఓడిపోతే, మీరు మార్గనిర్దేశం చేయవచ్చు' అంటూ స్వామి ఇచ్చిన అద్భుతమైన సందేశాలు యువతకు అనుసరణీయాలు.

యువత శారీరకంగానూ, మానసికంగానూ దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు స్వామి. వారు క్రీడా మైదానాలకు వెళ్లాలన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, విశాల హృదయాలు కలిగిన యువతను ఆయన కోరుకున్నారు. అందుకే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఫిట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభించారు. 21వ శతాబ్దం భారత్ శతాబ్దం కావడానికి మోదీ కృషి చేస్తున్నారు. ఐఎమ్ఎఫ్ అంచనా ప్రకారం భారత్ జీడీపీ 5 ట్రిలియన్ డాలర్లు దాటినందున, మనది నేడు ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అలాగే 2027 నాటికి ప్రపంచంలోని 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుంది. 2047 నాటికి, భారతదేశం అభివృద్ధి చెందిన దేశానికి సంబంధించిన అన్ని లక్షణాలతో 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి సిద్ధంగా ఉంది. ఇలా 'వికసిత్ భారత్' సాకారం కావాలంటే యువత కీలక పాత్ర పోషించవలసి ఉంది.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం అనేక మైలురాళ్లను చేరుకుంది. 'చంద్రయాన్' అంతరిక్ష రంగంలో సాధించిన ప్రగతికి ఒక ఉదాహరణ. డిజిటల్ ఆవిష్కరణ పట్ల దేశం నిబద్ధతను చాటిచెప్పే ఆధార్, యూపీఐ, ఏపీ స్టాక్, కొవిన్ ప్లాట్ ఫారమ్ వంటి వాటి వల్ల భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. భారత్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారే దిశగా అడుగులు వేస్తోంది. మన సేవల రంగం, ముఖ్యంగా ఐటీ, ఐటీయేతర డొమైన్‌లలో ప్రపంచ ప్రాముఖ్యం కలిగి ఉంది. 300 బిలియన్ డాలర్ల కన్నా ఎక్కువ విలువ కలిగిన 100 యునికార్న్‌లను భారత్ కలిగి ఉండి, ప్రపంచంలోని మూడవ–అతిపెద్ద స్టార్ట్–అప్ పర్యావరణ వ్యవస్థగా నిలిచింది. ఈ 'అమృత్ కాల్' సందర్భంలో 'ఆత్మనిర్భర్ భారత్'ను రూపొందించడానికి స్వామి వివేకానంద బోధనలను ఉపయోగించుకుందాం!

వ్యాసకర్త హరియాణా గవర్నర్

గొప్ప చెప్పుకోరాదు!

జ్యోతిర్మయం

పూర్వం అయోధ్య నగరాన్ని సుదర్శనుడనే రాజు పాలిస్తుండేవాడు. సరయూనది తీరంలో ఆగమ నియమానుసారంగా క్రతువులు చేస్తూ ప్రతిరోజు లక్షా పాతికవేల మందికి భోజనం సంతృప్తికరంగా పెట్టేవాడు. దీనితో అతని ఖ్యాతి దిశ దిశలా వ్యాపించి, దేవలోకానికి కూడా చేరింది. ఆశ్చర్య పోయిన నారద మహాముని సుదర్శనుడి వద్దకు వచ్చాడు. దేవర్షికి నమస్కారం చేసి, 'మీ రాకతో నా జన్మ ధన్యమైంది. నేను ముక్తుడనయ్యాను స్వామీ!' అంటాడు. 'నీ యశస్సు బ్రహ్మ భువనాంతములను తాకింది. ఎంతో పుణ్యం చేసుకున్న వారికి మాత్రమే ఇటువంటి ఖ్యాతి దక్కుతుంది సుమా!' అంటాడు నారదుడు. ఆశ్చర్యపోతాడు సుదర్శనుడు. ఆ ఆశ్చర్యాన్ని గమనించిన నారదుడు 'నీవెంత పుణ్యాత్ముడవో నీవే పరీక్షించుకోవచ్చును' అంటూ అప్పటికప్పుడు సరయూతీరంలోని ఇసుకతో ఒక కుండను తయారుచేసి, 'ఈ పచ్చికుండలో నీవు నీళ్ళు నింపు, నిలుస్తాయి' అంటాడు. సుదర్శనుడు అలాగే చేయగా, ఆ కుండలో నీళ్ళునిలుస్తాయి. ఇలా చేసిన కుండలలోనే వండి భోజనం పెట్టమని సుదర్శనుడికి చెప్పి దేవలోకానికి వెళ్ళిపోతాడు నారదుడు.

ఒక రోజు ఇసుక కుండలలో వంటలు ఉడుకుతూ ఉండగా, 'ఇటువంటి ఘనతను సాధించినది నేను ఒక్కడినే కదా!' అంటాడు సుదర్శనుడు. నోటిలోంచి ఆ మాటలు వస్తూండగానే ఉడికే కుండలు ఒక్కసారిగా ఇసుక కుప్పలై పోతాయి. అది చూసి బాధలో మునిగిపోయిన సుదర్శనుడి వద్దకు మళ్ళీ నారదముని వచ్చి...

'ఇంత మహిమ వడసితి నని
సంతసమున నీవు రాజసము గైకొన్నన్
సంతతము జేయు సుకృతం
బింతయు నిట్టింకె నింక నే మనవచ్చున్' అంటాడు.

'ఇంత గొప్ప మహిమను సాధించాననే అహంకారం మనసు నిండా కమ్ముకోగా మర్యాద తప్పావు. గర్వం వలన సజావుగా జరిగే పని కాకుండాపోయింది' అన్నది నారదుడి మాటల సారాంశం. 'తన గొప్పను తాను గర్వంగా చెప్పుకోవడం కార్యహానికే' అని కొఱవి గోపరాజు రచించిన 'సింహాసన ద్వాత్రింశిక' ద్వితీయాశ్వాసంలోని ఈ కథ చెబుతుంది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.పాడ్యమి సా.4.31 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.45 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.9.33 నుండి 11.01 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.35 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.19 వరకు, **అమృతఘడియలు:** ప.11.37 నుండి 1.09 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.39.

పందెం కోడికి ఆర్టీసీ వేలం

- సమయం: శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు
- వేదిక: కరీంనగర్ ఆర్టీసీ డిపో–2

సాక్షిప్రతినిధి, కరీంనగర్: సంక్రాంతి వేళ..కరీంనగర్‌లో ఓ పందెం కోడి వార్త సందడి చేస్తోంది. ఆసక్తి ఉన్న వారు ఈ కోడిని వేలంపాటలో దక్కించుకోవచ్చంటూ ఆర్టీసీ డిపో–2 మేనేజర్ మల్లయ్య గురువారం ఒక ప్రకటన చేయడమే ఇందుకు కారణం. ఇంతకీ ఈ కోడి కథాకమామీషు ఏంటో ఓసారి చూద్దాం!


ఆర్టీసీ అధికారుల అధీనంలో ఉన్న కోడి

అసలేం జరిగిందంటే...?

ఈనెల 9వ తేదీన కరీంనగర్ ఆర్టీసీ డిపో–2కు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు వరంగల్ నుంచి వేములవాడకు వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి కరీంనగర్ డిపోకి చేరుకుంది. బస్సు దిగి ఇంటికి వెళదామని బస్సు డ్రైవర్, కండక్టర్ సిద్ధమవుతుండగా, ఇంతలో కోడి కూత వినబడటంతో ఇద్దరూ అవాక్కయ్యారు. సీటు కింద దాన్ని సంచిలో జాగ్రత్తగా కట్టేసిన తీరు చూసి, ఎవరో ప్రయాణికుడు మర్చిపోయాడని గుర్తించారు. కోడి యజమాని వస్తాడని కొద్దిసేపు చూశారు. కానీ, ఎవరూ రాకపోవడంతో ఏం చేయాలో తోచక కంట్రోలర్‌కు ఆ కోడిని అప్పగించారు. మూడురోజులుగా ఆ కోడిని ఓ ఇనుప బోనులో రక్షణ కల్పిస్తున్నారు. దానికి దాణా, నీళ్లు ఇస్తూ అతిథిలాగే మర్యాదలు చేస్తున్నారు. కోడి యజమానికి తెలియజేసే క్రమంలో మీడియాలోనూ ప్రకటన విడుదల చేశారు. అయినా కోడి ఆచూకీ కోసం ఎవరూ రాలేదు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కరీంనగర్ డిపో–2 ఆవరణలో బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనవచ్చునని డిపో మేనేజర్ మల్లయ్య పేర్కొన్నారు. ఇంతకీ సర్కారు వారి పాట ఎంత ఉంటుందో..? ఆ కోడి యజమాని వస్తాడా? రాడా..? ఇంతకీ వేలం పాటలో దేవుని పాట ఎంతకు మొదలవుతుంది? అన్న విషయంపై చర్చ సాగుతోంది.

'కాళేశ్వరం'పై ముగిసిన విజిలెన్స్ విచారణ

- ప్రాజెక్టు రికార్డులు హైదరాబాద్‌కు తరలింపు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని డివిజన్ ఇరిగేషన్ కార్యాలయంలో మూడు రోజులుగా విజిలెన్స్ ఎస్పీ రమేశ్ ఆధ్వర్యంలో పది మంది అధికారుల బృందం చేపట్టిన విచారణ గురువారం మధ్యాహ్నం ముగిసింది. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌కు సంబంధించిన కీలక రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఏఈఈ, డీఈఈ, ఈఈలతో మాట్లాడి ప్రాజెక్టు భూమిపూజ నుంచి నేటి వరకు జరిగిన ప్రతి అంశాన్ని తెలుసుకున్నారు. ఆయా బ్యారేజీలు, పంపుహౌస్‌ల రికార్డులను సీజ్ చేసి హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. మంగళవారం నుంచి గురువారం వరకు బిజీబిజీగా సీక్రెట్‌గా గడిపిన విజిలెన్స్ అధికారులు గురువారం మధ్యాహ్నం రికార్డుల పరిశీలన పూర్తి చేసి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ రమేశ్ మీడియాతో మాట్లాడుతూ మేడిగడ్డ, అన్నారం, పంపుహౌస్‌లకు సంబంధించిన రికార్డులను పరిశీలించామని తెలిపారు. అన్నింటిని వెంట తీసుకెళ్తున్నట్లు చెప్పారు. వీటిలో లోటుపాట్లు ఉంటే ఉన్నతాధికారులు తదుపరి విచారణ చేసి పూర్తి వివరాలు తెలియజేస్తారన్నారన్నారు. విజిలెన్స్ విచారణ నేపథ్యంలో ఆ ప్రాంతంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


మహదేవపూర్ ఇరిగేషన్ కార్యాలయం నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు వాహనంలో ఉంచిన రికార్డులు

ఒడిశా నుంచి నగరానికి గంజాయి

- నిందితుని నుంచి 10 కేజీల సరుకు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

రాజేంద్రనగర్: ఒడిశా నుంచి నగరానికి ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకొస్తున్న యువకుడిని రంగారెడ్డి జిల్లా, రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 10 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ సత్యనారాయణ తెలిపారు. ఉప్పర్‌పల్లి స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పూర్తి వివరాలను ఆయన వెల్లడించారు. ఒడిశా మల్కన్‌గిరి ప్రాంతానికి చెందిన హరిశంకర్ గోల్దార్(30) నగరంలో లేబర్ పని చేస్తున్నాడు. అయితే, ఇక్కడ గంజాయి వ్యాపారం జోరుగా సాగుతుందని తెలుసుకొని విక్రయించాలని నిర్ణయించాడు. ఏడాదిగా ఈ దందా కొనసాగిస్తున్నాడు. గతంలో హన్మకొండ పోలీసులకు పట్టుబడి జైలుకెళ్లాడు. మెకానిక్ పని వచ్చిన హరిశంకర్ 10 కేజీల గంజాయిని ప్యాకెట్లలో దాచి స్కూటీపై ఒడిశా నుంచి నగరానికి బయలుదేరాడు. హైదర్షాకోట్‌కు చెందిన కొరియర్ బాయ్ వరుణ్ కుమార్(19)కు 2 కేజీలు, లంగర్‌హౌస్‌కు చెందిన వార్డు బాయ్ మనీశ్‌కుమార్(23)కు 2 కేజీలు విక్రయించాడు. అనంతరం మొదట మనీశ్, వరుణ్ ద్విచక్ర వాహనంపై ముందుకు కదిలారు. వారి వెంటే హరిశంకర్ స్కూటీపై వస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అయితే, వాహనంతో పాటు అతని వద్ద ఎలాంటి గంజాయి లభించలేదు. దీంతో మరోసారి పరిశీలించి ఒక ప్యాకెట్ కనిపించింది. ఆపై బండిని స్టేషన్‌కు తీసుకొచ్చి పూర్తిగా వాహనాన్ని పరిశీలించి మిగతా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో మనీశ్‌కుమార్, వరుణ్ కుమార్‌లను పట్టుకుని మొత్తం సరుకుని స్వాధీనం చేసుకున్నారు. వరుణ్‌కుమార్ గతంలో నార్సింగి పీఎస్ పరిధిలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడు.

ముగ్గురిని బలిగొన్న కుటుంబ కలహాలు?


- ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

లింగాల: కుటుంబకలహాలతో ఓ తల్లి ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తను కూడా ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అప్పాపూర్‌పెంట గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపూర్‌పెంటకు చెందిన చిగుర్ల గురువయ్య– చిన్న నాగమ్మ(35) దంపతులకు కుమారుడు(4), కూతురు(3) ఉన్నారు. కాగా గురువయ్య అటవీశాఖలో వాచర్‌గా పనిచేస్తున్నాడు. అయితే కొన్నిరోజులుగా గురువయ్యకు వేతనం సరిగ్గా అందకపోవంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి గురైన నాగమ్మ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తను కూడా తీసుకోవడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. అయితే ఈ సంఘటన నల్లమలలోని లోతట్టు ప్రాంతంలో చోటుచేసుకోవడంతో పూర్తి వివరాలు తెలియలేదు.


ఇద్దరు చిన్నారుల మృతదేహాలు

జేఈఈ వైపు విద్యార్థుల చూపు

- ఈసారి పెరిగిన దరఖాస్తులు
- 12.3 లక్షల అప్లికేషన్లు
- సిలబస్ తగ్గడమే కారణమా?
- ఈ నెల 24 నుంచి పరీక్ష..
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్న ఎన్‌టీఏ



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 24 నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్ష మొదలవనుంది. ఫిబ్రవరి 1 వరకు ఇది కొనసాగుతుంది. పూర్తిగా కంప్యూటర్ ఆధారంగా జరిగే మెయిన్స్‌కు ఈ ఏడాది దరఖాస్తులు భారీగా పెరిగాయి. దేశవ్యాప్తంగా గత ఏడాది 11.62 లక్షల మంది దరఖాస్తు చేస్తే, ఈ ఏడాది (2024) 12.30 లక్షల మంది దరఖాస్తు చేశారు. 2022లో వచ్చిన దరఖాస్తులు 10.26 లక్షలే కావడం గమనార్హం. 2014 తర్వాత నుంచి మెయిన్స్ రాసే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. క్లాసులు సరిగా జరగకపోవడం ఒక కారణమైతే, కోచింగ్ కేంద్రాలు లేకపోవడం మరో కారణం. అయితే, 2022 నుంచి పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. దీంతో మెయిన్స్‌కు పోటీ పెరిగింది.

సిలబస్‌లో మార్పులూ కారణమే..

కొన్నేళ్లుగా జేఈఈ మెయిన్స్ అంటే విద్యార్థులు భయపడే పరిస్థితి ఉంది. ముఖ్యంగా మేథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులు కష్టంగా ఉంటున్నాయి. గణితంలో ప్రశ్నలు సుదీర్ఘంగా ఉంటున్నాయి. ప్రిన్సిపుల్స్ ఆఫ్ మేథమెటికల్ ఇండక్షన్ అండ్ సింపుల్ అప్లికేషన్స్, మేథమెటికల్ రీజనింగ్, ప్లేన్ అండ్ డిఫరెంట్ ఫామ్స్‌తో మొత్తం 10 చాప్టర్స్‌లో ప్రశ్నలకు జవాబులు రాబట్టడానికి ఎక్కువ సమయం పడుతోంది. దీంతో ఇతర సబ్జెక్టుల్లో ప్రశ్నలకు జవాబులు రాసేందుకు సమయం తక్కువగా ఉండటంతో విద్యార్థుల్లో టెన్షన్ పెరుగుతోంది. కెమిస్ట్రీ సులభంగా ఉన్నప్పటికీ మేథ్స్ సమయం తినేయడంతో ఇందులో సరిగా ఆన్సర్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని నిపుణులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) దృష్టికి తెచ్చారు. దీంతో మేథ్స్‌లో పది చాప్టర్ల నుంచి ఈసారి ప్రశ్నలు ఇవ్వడం లేదు. ఇదే పరిస్థితి ఫిజిక్స్‌లోనూ ఉంది. 12 చాప్టర్ల నుంచి ప్రశ్నలివ్వడం మానేసినట్టు ఎన్టీఏ ప్రకటించింది. జియో స్టేషనరీ శాటిలైట్స్, డాప్లర్ ఎఫెక్ట్‌ఇన్ సౌండ్, కలర్ కోడ్ ఫర్ రెసిస్టర్స్ వంటి చాప్టర్లు ఇందులో ముఖ్యమైనవి. కెమిస్ట్రీలో కష్టంగా ఉన్న 9 చాప్టర్లను మినహాయించారు. పాలిమర్స్, స్టేట్ ఆఫ్ మ్యాటర్స్, సర్ఫేస్ కెమిస్ట్రీ వంటి కీలకమైన చాప్టర్లున్నాయి. అదీగాక, తెలంగాణ, ఏపీ మినహా చాలా రాష్ట్రాల్లో స్థానిక ఎంసెట్ నిర్వహించడం లేదు. జేఈఈ ర్యాంకు ఆధారంగానే రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు కేటాయిస్తున్నారు. ఈ కారణంగా జేఈఈ రాయడం అనివార్యంగా మారింది.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఈసారి జేఈఈ మెయిన్స్ నిర్వహణకు ఎన్టీఏ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. విద్యార్థుల బయోమెట్రిక్‌ను పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు పరీక్ష మధ్యలో వాష్‌రూంకు వెళ్లి, తిరిగి వచ్చినా బయోమెట్రిక్ తప్పనిసరి చేస్తున్నట్టు వెల్లడించింది. కొన్నేళ్లుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్న కేంద్రాలను గుర్తించి, ఈసారి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఒకవేళ సాంకేతిక సమస్య వచ్చినా అప్పటికప్పుడు కంప్యూటర్ ఏర్పాటు చేసే యోచనలో అధికారులు ఉన్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

- ప్రభుత్వం కోరితే సీబీఐ విచారణ చేపట్టేందుకు కేంద్రం సిద్ధం: బండి

కరీంనగర్‌టౌన్/కరీంనగర్ రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు విచారణపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని చెప్పిన కాంగ్రెస్ నేతలు, మేడిగడ్డ బ్యారేజీ పైనే జ్యుడీషియల్ విచారణ కోరడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ నేతల అవినీతిని కాపాడేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరితే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అయోధ్య రామమందిర కార్యక్రమాన్ని కాంగ్రెస్ బహిష్కరించడం విడ్డూరమన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన 3కే రన్‌లో పాల్గొన్న అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిఉంటే మాజీ మంత్రి కేటీఆర్‌ను జైలుకు పంపి ఉండేవారమని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని ఆరోపించారు. తెలంగాణ కోసం కేసీఆర్ రక్తం చిందించారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ రక్తం ఎక్కడ చిందించారో చెప్పాలన్నారు.


3కే రన్‌లో పాల్గొన్న బండి సంజయ్

అక్షరసూరీడు 'అలిశెట్టి'

- రాష్ట్రస్థాయి పురస్కారాల ప్రదానంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: అలిశెట్టి ప్రభాకర్ అక్షరసూరీడని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లాకేంద్రంలో కళాశ్రీ ఆధ్వర్యంలో పలువురు సాహితీవేత్తలకు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి అలిశెట్టి రాష్ట్రస్థాయి పురస్కారాలను ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో ఆదోనికి చెందిన కవి స్వయం ప్రభ, కరీంనగర్‌కు చెందిన సిరిపురం వాణిశ్రీ, మెట్‌పల్లికి చెందిన శరత్‌చంద్ర, హైదరాబాద్‌కు చెందిన సురేందర్ తదితరులు ఉన్నారు. అలిశెట్టి తెలుగు సాహితీలోకం మరిచిపోలేని కవి అని, అలతి పదాలతో అనంత అర్థాలు చెప్పారని సంజయ్ కొనియాడారు. అలిశెట్టి కవితలు ఇప్పటికీ ప్రజల్లో నానుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అలిశెట్టి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశ్రీ వేదిక అధ్యక్షుడు గుండేటి రాజు, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అలిశెట్టి కుమారుడు సంగ్రామ్ తదితరులు పాల్గొన్నారు.


అలిశెట్టి రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు

ఉచిత యోగా శిక్షణ కార్యక్రమానికి స్పందన భేష్

2న ఆన్‌లైన్ యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన హాబిల్డ్ సంస్థ

నాగ్‌పూర్/ న్యూఢిల్లీ: కొత్త ఏడాది 2024ను పురస్కరించుకుని నాగ్‌పూర్‌లోని హాబిల్డ్ సంస్థ ఆన్‌లైన్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత యోగా శిక్షణ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోంది. జనవరి 2 నుంచి ప్రారంభమైన 21 రోజుల లైవ్ యోగా చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా గురువారం యోగాసనాలు నేర్చుకునేందుకు దేశవ్యాప్తంగా అధికసంఖ్యలో ప్రజలు ఆసక్తి కనబరిచారు. దీంతో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం గిన్నిస్ రికార్డును నెలకొల్పింది. ఈ సందర్భంగా హాబిల్డ్ సంస్థ సీఈవో సౌరభ్ బోత్రా నాగ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ కొన్ని వారాలుగా హాబిల్డ్ సంస్థ ఫిట్‌నెస్, యోగా శిక్షణపై కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నో మైలురాళ్లు సాధించడం గర్వంగా ఉందన్నారు. యోగా తత్వాన్ని అర్థం చేసుకుని ఈ ఉచిత యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 12 స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మరికొన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

జనవరి చలి ఏదీ!

- రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితి
- సాధారణం కంటే 7 డిగ్రీల వరకు ఎక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు
- కొన్ని ప్రాంతాల్లో చలికి బదులు ఉక్కపోత
- వచ్చే 3రోజుల్లో చలి పెరిగే చాన్స్

గురువారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో)

నల్లగొండ	17.4	దుండిగల్	19.3
హకీంపేట్	17.5	మహబూబ్‌నగర్	19.9
మెదక్	18.0	రామగుండం	20.5
హనుమకొండ	18.5	ఖమ్మం	21.0
హైదరాబాద్	18.5	నిజామాబాద్	21.2
ఆదిలాబాద్	19.0	భద్రాచలం	22.0

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఈ సమయంలో ఎముకలు కొరికే చలి ఉండాలి. కానీ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతుండడంతో చలికి బదులు ఉక్కపోత ఉంటోంది. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. సగటున 3 డిగ్రీల నుంచి 7 డిగ్రీల మేర అధికంగా నమోదవుతుండడం గమనార్హం. రాష్ట్రంలోని వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఈ పరిస్థితి కొనసాగుతోందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే వచ్చే మూడురోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అంతటా అధికమే...

రాష్ట్రంలో అంతటా కనిష్ట ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఐఎండీ అధికారుల గణాంకాల ప్రకారం ఆదిలాబాద్‌లో సాధారణం కంటే 9.1 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదైంది. ఈ సమయంలో 10 డిగ్రీల నుంచి 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 19 డిగ్రీలు నమోదవుతోంది. నిజామాబాద్‌లో సాధారణం కంటే 5.7 డిగ్రీ సెల్సియస్, రామగుండంలో 5.5 డిగ్రీ, భద్రాచలంలో 4.3 డిగ్రీ, మెదక్‌లో 3.8 డిగ్రీ, హైదరాబాద్‌లో 3 డిగ్రీ సెల్సియస్ చొప్పున అధికంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుత వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో రానున్న మూడు రోజులు కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయి. దీంతో రాత్రిపూట చలి ప్రభావం పెరిగే అవకాశం ఉంది. గురువారం ఖమ్మంలో 31 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 18 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

ప్రజల వద్దకు 'ధరణి'

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చిన సభ్యులు.. ఈనెల 17న మరోమారు భేటీ అయి తదుపరి కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు.

15 రోజుల్లో తొలిదఫా సూచనలు

ధరణి పునర్నిర్మాణం కోసం అవసరమైన నివేదిక ఇవ్వాలంటూ ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిన నేపథ్యంలో.. ఒక్కసారే తుది నివేదిక కాకుండా పలు దఫాలుగా మధ్యంతర నివేదికలు సమర్పించాలని, తొలిదఫా సలహాలు, సూచనలు 10–15 రోజుల్లో ప్రభుత్వానికి అందజేయాలని నిర్ణయించారు. నాంపల్లిలోని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయం కేంద్రంగానే కమిటీ పని చేయాలని, ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయించారు. రైతుల ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారానికి సంబంధించిన అంశంపై ప్రత్యేక చర్చ జరిగినట్టు తెలిసింది. గతంలో రైతుల వినతులను పట్టించుకోలేదని, కలెక్టర్ స్థాయిలో నిర్ణయాధికారాలున్న నేపథ్యంలో సమస్యలు పరిష్కారం కాక చాలా ఇబ్బందులు పడ్డారని, ఈ నేపథ్యంలో గ్రీవెన్స్ పరిష్కార అధికారాలను వికేంద్రీకరణ చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై సభ్యులు చర్చించారు. గ్రీవెన్స్‌తో పాటు సాంకేతిక పరమైన సమస్యలను ఎలా డీల్ చేయాలన్నది కూడా చర్చకు వచ్చినట్టు సమాచారం. మొత్తం మీద ధరణి పోర్టల్‌తో సంబంధముండే అన్ని భాగస్వామ్య పక్షాలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలని, ఇతర రాష్ట్రాల్లో భూసమస్యల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించారు. కాగా 'పునర్నిర్మాణమంటే చాలా పెద్ద టాస్క్. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మేం టెస్ట్ క్రికెట్ మ్యాచ్ ఆడే పరిస్థితి లేదు. ట్వంటీ ట్వంటీ ఆడాల్సిందే. ట్వంటీ ట్వంటీలో ప్రతి బంతిని కీలకంగా పరిగణించినట్టు గానే మేం ప్రతి అంశాన్ని కీలకంగా తీసుకుని ముందుకు వెళ్లాల్సిందే..' అని సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యుడొకరు వ్యాఖ్యానించారు.

గత తప్పులు పునరావృతం కానివ్వం: కోదండరెడ్డి

సమావేశానంతరం ధరణి కమిటీ సభ్యులు సునీల్‌కుమార్, మధుసూదన్, లచ్చిరెడ్డిలతో కలిసి కోదండరెడ్డి విలేకరులతో మాట్లాడారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అన్ని అంశాలను సవరించి త్వరగా ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని చెప్పారు. పోర్టల్ ఎవరు నిర్వహిస్తే బాగుంటుందన్న దానిపై కాంగ్రెస్ పార్టీ ఆలోచన మేరకు ముందుకెళతామని, సీఎం రేవంత్, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

జీవిత ఖైదీ వద్ద సెల్‌ఫోన్

కుషాయిగూడ: చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రంలో సెల్‌ఫోన్ కలకలం రేగింది. జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి సెల్‌ఫోన్ వాడుతూ అధికారులకు పట్టుబడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలు.. హత్య కేసులో నిందితుడిగా పదేళ్లగా జీవిత ఖైదీ శిక్ష అనుభవిస్తున్నాడు శివప్రసాద్. అయితే, సత్ప్రవర్తన కలిగిన ఖైదీగా చర్లపల్లి వ్యవసాయక్షేత్రంలో ఉంటున్నాడు. కాగా, చాలా రోజులుగా శివప్రసాద్ సెల్‌ఫోన్ వినియోగిస్తుండటంతో జైలు సిబ్బందే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు తనిఖీ చేసి శివప్రసాద్ వద్ద సెల్‌ఫోన్‌ను గుర్తించారు. దీంతో శివప్రసాద్‌ను చంచల్‌గూడ జైల్‌కు పంపించడంతో పాటు జైల్ పర్యవేక్షణాధికారిపై విచారణకు ఆదేశించినట్టు సమాచారం. అయితే, జైల్ పర్యవేక్షణాధికారి కళాసాగర్‌ను వివరణ కోరగా.. పేరోల్‌పై వెళ్లిన శివప్రసాద్ సెల్‌ఫోన్ డిపాజిట్ చేయకుండా తన వద్దే ఉంచుకున్నాడని చెప్పారు. సెల్‌ఫోన్ స్వయంగా జైల్ పర్యవేక్షణాధికారే ఇచ్చినట్టు మరో వాదన ఉంది. సిబ్బంది తన గురించి ఏం మాట్లాడుతున్నారో తెలుసుకునేందుకే కళాసాగర్ శివప్రసాద్‌కు సెల్‌ఫోన్ సమకూర్చినట్టు సమాచారం. సదరు అధికారుపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలే ఉన్నాయి.

నిరుద్యోగులకు ఇక మంచిరోజులే..

- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాను రాష్ట్ర గవర్నర్ ఆమోదించడం మంచి పరిణామమని, నిరుద్యోగులకు మంచిరోజులు రానున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వీలైనంత తొందరగా ఉంటుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల్లేక నిరుద్యోగులు అల్లాడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలనకు గవర్నర్ సహకారం ఉండాలని కోరారు.ం నిరుద్యోగులు ఎక్కడ కూడా ఆగం కావొద్దని దయాకర్ సూచించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

తాంసి: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రా మానికి చెందిన కౌలు రైతు ఎడిపెల్లి రమేశ్ (50) అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, ఎస్సై లాల్‌సింగ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్ పిప్పల్‌కోటి గ్రామ శివారులో 12 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. అయితే వాతావరణం అనుకూలించక ఆశించిన దిగుబడి రాదేమోనని, పెట్టుబడికి తెచ్చిన అప్పు ఎలా తీర్చాలని కలత చెందాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య దేవమ్మ, కుమారుడు వెంకటస్వామి ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


రమేశ్ (ఫైల్)

మహిళా ప్రయాణికులే టార్గెట్

- పోలీసులకు చిక్కిన చైన్‌స్నాచర్

సికింద్రాబాద్: మాదకద్రవ్యాలకు బానిసైన యువకుడు రైల్వేస్టేషన్‌లలో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. దీంతో నిందితుడిని పోలీసులు గురువారం రిమాండ్ చేశారు. రైల్వే అదనపు డీజీ మహేశ్ భగవతి, ఎస్పీ సలీమా కథనం ప్రకారం.. సికింద్రాబాద్ న్యూబోయిగూడకు చెందిన చిన్నయ్య వీరరాఘవులు ఆకాశ్(23) ఇంటర్మీడియట్ మధ్యలో ఆపేశాడు. కొంతకాలం ఓ కంపెనీలో డెలివరీబాయ్‌గా, ఆపై మరో చోట టెలీకాలర్‌గా పని చేశాడు. ఈక్రమంలో వ్యసనాలకు బానిసై వచ్చే జీతం చాలక చోరీలు మొదలుపెట్టాడు. సికింద్రాబాద్, లింగంపల్లి, సంజీవయ్య పార్కు రైల్వేస్టేషన్‌లలో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసేవాడు. రైలు కదిలే సమయంలో వారిని వెంబడించి మెడలోని బంగారు ఆభరణాలను లాక్కొనేవాడు. ఈ తరహాలో కొద్ది కాలంలోనే ఐదు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఈనెల 10న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఎస్సై మాజిద్ నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు చేస్తుండగా ఆకాశ్ పట్టుబడ్డాడు. విచారణ చేపట్టగా చేసిన నేరాలు అంగీకరించాడు. మొత్తం ఐదు కేసులకు సంబంధించి 14.3 తులాల బంగారు ఆభరణాలను నిందితుడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సొత్తును త్వరగా రికవరీ చేసిన ఎస్సై మాజిద్, ఆర్పీఎఫ్ ఏఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుల్స్ మహిపాల్‌రెడ్డి, భవానీ శంకర్, హరిలాల్, కృష్ణ, సురేశ్, సతీశ్‌కు అదనపు డీజీపీ మహేశ్‌భగవతి నగదు రివార్డులు అందించారు.


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న రైల్వే ఏడీజీ మహేశ్ భగవత్, ఎస్పీ సలీమా

తైవాన్‌లో త్రిముఖం!

- రేపే అధ్యక్ష ఎన్నికలు
- చైనాతో సంబంధాలను నిర్దేశించబోతున్న పోరు
- మూడు పార్టీల మధ్య పోటాపోటీ
- ఎన్నికల బరిలో డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ, కౌమిన్‌టాంగ్ పార్టీ, తైవాన్ పీపుల్స్ పార్టీ

అగ్రరాజ్యం అమెరికా, డ్రాగన్ దేశం చైనా మధ్య ఆధిపత్య పోరాటానికి కేంద్ర బిందువుగా మారిన తైవాన్‌లో అధ్యక్ష ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 13వ తేదీన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు సిద్ధమయ్యారు. ద్వీప దేశమైన తైవాన్‌లో జరుగుతున్న ఈ ఎన్నికలు ప్రపంచమంతటా ఆసక్తి కలిగిస్తున్నాయి. తైవాన్‌కు ప్రధాన ప్రత్యర్థిగా మారిన చైనాతో తదుపరి సంబంధాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఈ ఎన్నికలు నిర్దేశించబోతున్నాయి. తైవాన్‌లో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు తగ్గిపోవడం, ఇళ్ల ధరలు భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో త్రిముఖ పోరు కనిపిస్తోంది. చైనా దూకుడును కట్టడి చేయగల సత్తా ఉన్న నాయకుడికే ఈ ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టే అవకాశం ఉందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అధికార డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(డీపీపీ) ప్రస్తుత ఉపాధ్యక్షుడు విలియం లాయ్ చింగ్-టి, మాజీ ప్రతిపక్ష కౌమిన్‌టాంగ్(కేఎంటీ) పార్టీ నుంచి మాజీ పోలీసు చీఫ్, న్యూ తైపీ నగర మాజీ మేయర్ హౌ యు-హీ, తైవాన్ పీపుల్స్ పార్టీ(టీపీపీ) నుంచి కొ వెన్-జి ఈ ఎన్నికల బరిలో నిలిచారు. వారి బలాబలాలు, విజయావకాశాలు ఎలా ఉన్నాయో చూద్దాం..

- సాక్షి, నేషనల్ డెస్క్

తైవాన్ పార్లమెంట్‌లో మొత్తం స్థానాలు: 113

ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్థానాలు: 57

ప్రభుత్వ పదవీ కాలం: 4 ఏళ్లు

2020లో ఎవరికి ఎన్ని స్థానాలు

పార్టీ	గెలిచిన స్థానాలు
డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ	61
కౌమిన్‌టాంగ్ పార్టీ	38
తైవాన్ పీపుల్స్ పార్టీ	5
ఇతరులు	9



చైనా పెత్తనాన్ని ప్రశ్నిస్తున్న విలియం లాయ్ చింగ్-టి

64 ఏళ్ల విలియం లాయ్ చింగ్-టి మృదు స్వభావిగా పేరుగాంచారు. తైవాన్‌కు స్వయం పాలన హోదాను నిలబెట్టడానికి చాలా ఏళ్లుగా పోరాటం సాగిస్తున్నారు. చైనా పెత్తనాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించారు. తైవాన్ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న యోధుడిగా తనను తాను అభివర్ణించుకుంటున్నారు. విలియం లాయ్ చింగ్-టి అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో వైద్య విద్య అభ్యసించారు. స్వదేశంలో కొన్నాళ్లు డాక్టర్‌గా పనిచేశారు. 1990వ దశకంలో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తొలుత తైనాన్ సిటీ నుంచి చట్టసభకు ఎన్నికయ్యారు. 2010లో తైనాన్ మేయర్‌గా విజయం సాధించారు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ నుంచి అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగారు. చైనాతో సత్సంబంధాలను తాను కోరుకుంటున్నానని ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారు. శత్రువులుగా కాదు, మిత్రులుగా ఉందామని చైనాకు సూచిస్తున్నారు. తైవాన్ తరహాలో చైనాలోనూ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటివి వర్ధిల్లాలని తాను ఆశిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, చైనా మాత్రం విలియం లాయ్ చింగ్-టి పట్ల విముఖత వ్యక్తం చేస్తోంది. ఆయన ఒక పేచీకోరు అని నిందలు వేస్తోంది. తరచుగా లేనిపోని సమస్యలు సృష్టిస్తుంటాడని విమర్శిస్తోంది. డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ నుంచి ఉపాధ్యక్ష పదవికి హెసియావో బి-కిమ్ పోటీపడుతున్నారు. ఆమె జపాన్‌లో జన్మించారు. అమెరికాలో పెరిగారు. కరడుగట్టిన స్వాతంత్ర్య ఉద్యమకారిణిగా ఆమెకు పేరుంది.

చైనాకు అనుకూలం! హౌ యు-హీ

కౌమిన్‌టాంగ్(కేఎంటీ) పార్టీ నేత, 66 ఏళ్ల హౌ యు-హీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. చిన్నప్పుడు తన కుటుంబ వృత్తి అయిన పందుల పెంపకం చేపట్టారు. పంది మాంసం విక్రయించారు. విద్యాభ్యాసం అనంతరం పోలీసు అధికారిగా పనిచేశారు. పందులను పట్టుకోవడానికి చిన్నప్పుడు నేర్చుకున్న నైపుణ్యం పోలీసు అధికారిగా ఉన్నప్పుడు చాలాసార్లు పనికొచ్చిందని ఆయన ఒక సందర్భంలోచెప్పారు.



చాలా హై-ప్రొఫైల్ కేసులను సమర్థవంతంగా ఛేదించారు. హంతకులను అరెస్టు చేశారు. పదవీ విరమణ తర్వాత 2010లో రాజకీయాల్లో చేరారు. 2018లో 'న్యూ తైపీ' నగర మేయర్‌గా ఎన్నికయ్యారు. 2022లో మరోసారి మేయర్‌గా విజయం సాధించారు. పోలీసు అధికారిగా, మేయర్‌గా ఆయన పనితీరు ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంది. అందుకే అధ్యక్ష ఎన్నికల్లో తమ అభ్యర్థిగా హౌ యు-హీని కౌమిన్‌టాంగ్ పార్టీ ఎంపిక చేసింది. ఎనిమిదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న ఆ పార్టీ ఈసారి గెలుపు కోసం శ్రమిస్తోంది. ఎన్నికల ప్రచారంలో హౌ యు-హీ చైనా గురించి పెద్దగా ప్రస్తావించడం లేదు. చైనా అనుకూలవాది అంటూ ఆయనపై కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. 'స్వతంత్ర తైవాన్'కు హౌ యు-హీ వ్యతిరేకి అని ఆరోపిస్తున్నారు. తైవాన్, చైనా మధ్య సంబంధాలు రిపబ్లిక్ ఆఫ్ చైనా రాజ్యాంగంపై ఆధారపడి ఉంటాయని, ఇందులో గందరగోళం ఏమీ లేదని ఆయన తేల్చిచెబుతున్నారు. కౌమిన్‌టాంగ్ పార్టీ నుంచి ఉపాధ్యక్ష పదవికి జా షా-కాంగ్ పోటీ పడుతున్నారు. చైనా, తైవాన్ పునరేకీకరణ జరగాలని జా షా-కాంగ్ వాదిస్తుంటారు.

యువత ఆదరణ చూరగొంటున్న కొ వెన్-జి

తైవాన్ పీపుల్స్ పార్టీ(టీపీపీ) నుంచి 64 సంవత్సరాల కొ వెన్-జి రేసులో నిలిచారు. ఆయన వైద్యుడిగా పనిచేస్తూ పదేళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చారు. 2014లో జరిగిన 'సన్ ఫ్లవర్ ఉద్యమం'లో పాల్గొన్నారు. అప్పట్లో చైనాకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆ తర్వాత కొ వెన్-జి 2015లో తైపీ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఎనిమిదేళ్లపాటు అదే పదవిలో సేవలందించారు. మేయర్‌గా చైనాతో సంబంధాలు పెంచుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు. 2019లో తైవాన్ పీపుల్స్ పార్టీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చైనాతో సంబంధాల విషయంలో ఎలాంటి వైఖరిని వ్యక్తం చేయకుండా గుంభనంగా వ్యవహరిస్తున్నారు. చైనాకు అనుకూలమో, వ్యతిరేకమో చెప్పకుండా దాట వేస్తున్నారు.



ప్రధానంగా యువతలో ఆయన పట్ల ఆదరణ కనిపిస్తోంది. డీపీపీ, కేఎంటీ పార్టీలకు తామే ప్రత్యామ్నాయం అని కొ వెన్-జి పేర్కొంటున్నారు. 2020 ఎన్నికల్లో 113 స్థానాలకు గాను టీపీపీ కేవలం ఐదు సీట్లు గెలుచుకుంది. తైవాన్ పార్లమెంట్‌లో మూడో అతిపెద్ద పార్టీగా మారింది. ఇక టీపీపీ నుంచి ఉపాధ్యక్ష రేసులో సిట్టింగ్ ఎంపీ, సంపన్న వ్యాపారవేత్త సింథియా వు నిలిచారు. తైవాన్‌లో ప్రఖ్యాతిగాంచిన వ్యాపార సంస్థ 'షిన్ కాంగ్ గ్రూప్' ఆమె కుటుంబానికి చెందినదే.

31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలంటున్నాయి. 31న ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు ఫిబ్రవరి 9 వరకు కొనసాగనున్నాయని సమాచారం. సమావేశాల తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించనున్నారు. తర్వాతి రోజు ఫిబ్రవరి ఒకటిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెడతారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వానికి ఇది చివరి బడ్జెట్. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు అవసరమైన ఖర్చులకు పార్లమెంట్ ఆమోదం తీసుకునేందుకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చే ప్రభుత్వం తిరిగి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మహిళా రైతులను ఆకట్టుకునేలా కీలక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని రెట్టింపు చేసే ప్రతిపాదన ఉండొచ్చని సమాచారం. మహిళా రైతులకు కిసాన్ నిధిని పెంచితే ప్రభుత్వానికి అదనంగా రూ.12,000 కోట్లు రావచ్చని లెక్కలు వేస్తున్నాయి. ఈ ప్రకటనను ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో హైలైట్ చేసే అవకాశం ఉందని చెబుతున్నాయి.

మళ్లీ ఎన్నికైతే నియంతలా పరిపాలిస్తా

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా తాను మళ్లీ ఎన్నికైతే ఒక నియంత తరహాలో పరిపాలన సాగిస్తానని మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. తనకు రెండు లక్ష్యాలు ఉన్నాయని, వాటిని నెరవేర్చవడానికి అవసరమైతే నియంతలా మారుతానని స్పష్టం చేశారు. మెక్సికో సరిహద్దు నుంచి నుంచి అమెరికాలోకి చొరబాట్లను అరికట్టడం, ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రోత్సాహం ఇవ్వడం తన లక్ష్యాలు అని వివరించారు. ప్రతిపక్షాలు తనపై తప్పుడు ప్రచారం సాగిస్తూ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయని ట్రంప్ మండిపడ్డారు. ఒకవేళ తనపై అక్రమ కేసులు నమోదు చేసి, విచారణ చేపడితే అమెరికా మొత్తం స్తంభించిపోతుందని తేల్చిచెప్పారు. విపక్షాలు తనను నియంతగా చిత్రీకరించి, ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అధ్యక్షుడిగా అధికారంలో తాను యుద్ధాలు చేయలేదని, విదేశాల్లో ఉన్న అమెరికా దళాలను వెనక్కి రప్పించానని గుర్తుచేశారు. జో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇతర దేశాల్లో యుద్ధాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ యుద్ధాల నుంచి రాజకీయంగా లాభం పొందాలని బైడెన్ ఎత్తుగడలు వేస్తున్నారని ట్రంప్ ధ్వజమెత్తారు.

జమిలి ఎన్నికలను అంగీకరించం

ఉన్నత స్థాయి కమిటీకి మమతా బెనర్జీ లేఖ



కోల్‌కతా: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'విధానాన్ని తాము అంగీకరించబోమని టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తేల్చి చెప్పారు. మన దేశ సమాఖ్య నిర్మాణం ప్రకారం 'ఒక దేశం-ఒకే ఎన్నిక' ఆలోచన ఆచరణ సాధ్యం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికల విధానం అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ కార్యదర్శి డాక్టర్ నితేన్ చంద్రకు ఈ మేరకు మమతా బెనర్జీ లేఖ రాశారు. ఈ అంశాన్ని హేతుబద్ధతతో పరిశీలించాలని ఆమె ఎన్నిల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. 'జమిలి ఎన్నికల యోచన సమాఖ్య నిర్మాణ కోణంలో చూస్తే సాధ్యం కాదు, ఆమోద యోగ్యం కాదు. సరైన విధానం కూడా కాదు. అందుకే, నేను ఈ విధానాన్ని ఆచరణాత్మక కోణంలో అంగీకరించను. ఈ అంశాన్ని చాలా చాలా హేతుబద్ధంగా ప్రత్యేకంగా పరిశీలించాలని కూడా భారత ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నాను'అని ఆమె గురువారం సెక్రటేరియట్ వద్ద విలేకరుల సమావేశంలో అన్నారు. 'ఇది కేవలం టీఎంసీ అభిప్రాయం మాత్రమే కాదు, ఇండియా కూటమి పార్టీలది కూడా. ఈ యోచనను పరిశీలించేటప్పుడు కేంద్ర, రాష్ట్ర విధానాలు, కేంద్రం, రాష్ట్ర నిర్మాణాలు వంటి వాటిని కూడా చూడాలి'అని ఆమె పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ జమిలి ఎన్నికల నిర్వహణపై అభిప్రాయాలు తెలపాలంటూ రాజకీయ పార్టీలకు లేఖలు రాసిన విషయం తెలిసిందే.

బంగ్లా ప్రధానిగా అయిదోసారి హసీనా ప్రమాణం

ఢాకా: అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా(76) గురువారం బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా అయిదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవలి ఎన్నికల్లో అవామీ లీగ్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలను ప్రధాన ప్రతిపక్షం బీఎన్‌పీతోపాటు ఆ పార్టీ మిత్ర పక్షాలు బహిష్కరించాయి. అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ దేశ 12వ ప్రధానిగా హసీనాతో ప్రమాణం చేయించారు. దీంతో వరుసగా నాలుగోసారి, మొత్తమ్మీద అయిదోసారి ఆమె ప్రధానిగా పగ్గాలు చేపట్టినట్లయింది. అనంతరం మంత్రివర్గ సభ్యులు కూడా ప్రమాణం చేశారు.

అజ్మీర్ దర్గాకు ప్రధాని మోదీ చాదర్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అజ్మీర్‌లోని ప్రముఖ షరీఫ్ దర్గాకు చాదర్ అందజేశారు. గురువారం ఢిల్లీలో ఆయన్ను కొందరు ముస్లిం ప్రముఖులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి చాదర్‌ను అందజేశారు. సూఫీ ప్రవక్త ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ వర్ధంతి సందర్భంగా జరిగే ఉర్సులో ఈ చాదర్‌ను కప్పుతారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వ్యవహారాల మంత్రి స్మృతీ ఇరానీ, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్దిఖి ఉన్నారు. ప్రధాని మోదీ 'ఎక్స్'లో స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈడీ విచారణకు ఫరూక్ అబ్దుల్లా డుమ్మా

న్యూఢిల్లీ: నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా (86) గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు గైర్హాజరయ్యారు. జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ 2018లో కేసు నమోదు చేసింది. ఇందులో మనీ లాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు జరుపుతున్న ఈడీ శ్రీనగర్‌లోని తమ కార్యాలయంలో విచారణకు రావాలంటూ నోటీసులు పంపింది. 'ఈరోజు నేను వెళ్లడం లేదు'అని పీటీఐతో ఆయన నివాసం నుంచి ఫోన్‌లో తెలిపారు. కారణాలను వెల్లడించలేదు.

అద్వానీ అయోధ్యకు వస్తున్నారు: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: బీజేపీ కురువృద్ధ నేత, రామ జన్మభూమి ఉద్యమాన్ని ముందుండి నడిపిన ఎల్‌కే అద్వానీ (96) అయోధ్యలో ఈ నెల 22వ తేదీన జరగనున్న ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొంటారని వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్ చెప్పారు. అవసరమైతే, ఆయన కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. అయితే, బీజేపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు, సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీ రాకపై ఇప్పటి వరకు స్పష్టత లేదని అన్నారు.

ఢిల్లీలో భూ ప్రకంపనలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతోపాటు ఉత్తరాది రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. గురువారం మధ్యాహ్నం రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1 గా నమోదైనట్లు జాతీయ భూకంప కేంద్రం వెల్లడించింది. భూకంప కేంద్రం పాకిస్తాన్-అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లోని హిందూకుష్ ప్రాంతంలో ఉంది. దీంతో దేశరాజధానితో పాటు పంజాబ్, చండీగఢ్, జమ్మూకశ్మీర్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో కొద్దిసేపు భూమి కంపించింది. పాక్‌లోని లాహోర్, ఇస్లామాబాద్, ఖైబర్ ఫఖ్తున్ఖ్వా సహా పలు ప్రాంతాల్లో భూ ప్రకంపనలు నమోదైనట్లు అక్కడి మీడియా వెల్లడించింది.

మాల్దీవుల్లో విదేశీ జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నాం: చైనా

బీజింగ్: మాల్దీవుల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నామని చైనా పేర్కొంది. మాల్దీవుల సార్వభౌమత్వం, స్వాతంత్ర్యాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపింది. మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు చైనాలో అయిదు రోజుల పర్యటన శుక్రవారంతో ముగియ నుంది. ఈ సందర్భంగా రెండు దేశాలు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు పరస్పరం మద్దతుగా నిలవాలంటూ ఒక ప్రకటన విడుదలైంది. 'మాల్దీవుల సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం, జాతి గౌరవాన్ని నిలబెట్టడంలో చైనా గట్టిగా మద్దతిస్తుంది. మాల్దీవుల విధానాలను గౌరవిస్తుంది, మద్దతు ఇస్తుంది. మాల్దీవుల అంతర్గత వ్యవహారాల్లో బాహ్య జోక్యాన్ని వ్యతిరేకిస్తుంది'అని అందులో పేర్కొంది. భారత ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను అధ్యక్షుడు ముయిజ్జు తొలగించడం, ఈ వ్యవహారం ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తలు పెంచడం తెలిసిందే. ఈ సమయంలోనే చైనా అనుకూలుడిగా పేరున్న ముయిజ్జు బీజింగ్ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. పర్యటన అనంతరం చైనాపై ప్రకటన విడుదల చేయడం గమనార్హం.



ఓ సూపర్ మార్కెట్ నుంచి సామాన్లు ఎత్తుకెళ్తున్న జనం

పపువా న్యూగినీలో అల్లర్లు.. 15 మంది మృతి

పోర్ట్ మోర్స్‌బీ: పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూగినీ అల్లర్లతో అట్టుడుకుతోంది. వేతనాల్లో కోతకు నిరసనగా పోలీసులు సమ్మెకు దిగడంతో జనం దుకాణాలు, కార్లకు నిప్పుపెట్టారు. సూపర్‌మార్కెట్లను దోచుకున్నారు. ఇప్పటికే నిరుద్యోగం, అధిక ధరలు ఆకాశాన్నంటడంతో అసంతృప్తితో జనం రగిలిపోతున్నారు. బుధవారం పోలీసులు, ఇతర విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు పార్లమెంట్ ఎదుట నిరసనకు దిగారు. వేతనాల్లో 50 శాతం వరకు కోతపెట్టడాన్ని నిరసించారు. అయితే, కంప్యూటర్‌లో పొరపాటు కారణంగానే వేతనంలో కోత పడినట్లు ప్రధాని చెప్పారు. ఈ సమాధానంతో సంతృప్తి చెందని ఆందోళనకారులు పార్లమెంట్ భవనం లోపలికి చొచ్చుకెళ్లారు. ప్రధానమంత్రి కార్యాలయం ఆవరణలోని కారుకు నిప్పుపెట్టారు. గేటును విరగ్గొట్టారు. అనంతరం సాధారణ ప్రజానీకం వారికి తోడైంది. అందరూ కలిసి పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చి యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణల్లో రాజధానిలో 8 మంది, దేశంలోని రెండో అతిపెద్ద లే నగరంలో ఏడుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. రాజధాని పోర్ట్ మోర్స్‌బీలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అదనంగా బలగాలను రప్పించారు. 14 రోజుల పాటు ఎమర్జెన్సీ అమల్లో ఉంటుందని ప్రధానమంత్రి జేమ్స్ మరపే ప్రకటించారు. బుధవారం సాయంత్రానికే పరిస్థితి అదుపులోకి వచ్చినప్పటికీ పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నట్లు ప్రధాని చెప్పారు. సోషల్ మీడియాలో అసత్యాల ప్రచారమే పరిస్థితికి కారణమని నిందించారు. పోలీసులు లేకపోవడంతో అవకాశవాదులు రెచ్చిపోయారన్నారు.

సరిహద్దులు సురక్షితం.. కానీ కొంత సున్నితం

- మన సైనిక దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయి
- ఎలాంటి సవాలు ఎదురైనా తిప్పికొట్టడానికి సిద్ధం
- భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే వెల్లడి



న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి భారత్-చైనా సరిహద్దుల్లో పరిస్థితులు ప్రస్తుతం సాధారణంగా, స్థిరంగానే ఉన్నప్పటికీ, కొంత సున్నితమైనవేనని భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే చెప్పారు. సరిహద్దుల్లో ఎప్పుడు ఎలాంటి సవాలు ఎదురైనా గట్టిగా తిప్పికొట్టడానికి మన సైనిక దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉన్నతస్థాయి సన్నద్ధతను పాటిస్తున్నాయని వెల్లడించారు. తగినన్ని సైనిక రిజర్వ్ దళాలు సరిహద్దుల్లో మోహరించాయని పేర్కొన్నారు. సరిహద్దుల్లో భద్రతాపరమైన వైఫల్యాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. సైనిక దినోత్సవం నేపథ్యంలో జనరల్ మనోజ్ పాండే గురువారం మీడియాతో మాట్లాడారు. సరిహద్దు వివాదం సహా ఇతర అంశాలకు పరిష్కారం కనుగొనడానికి భారత్, చైనా మధ్య సైనిక, దౌత్యవర్గాల స్థాయిలో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇక భారత్, పాకిస్తాన్ సరిహద్దుల్లో నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వెంబడి చొరబాట్లను కట్టడి చేస్తున్నామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో హింసాకాండ తగ్గుముఖం పట్టిందని, రాజౌరీ-పూంచ్ సెక్టార్‌లో మాత్రం హింసాత్మక సంఘటనలు కొంతమేరకు పెరిగాయని వివరించారు. సరిహద్దుకు అవతలివైపు ఉగ్రవాద సంస్థలు చురుగ్గా కార్యకలాపాలు సాగిస్తున్నాయని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో కాల్పుల విరమణ కొనసాగుతోందన్నారు. సరిహద్దు అవతలి వైపు నుంచి భారత్‌లోకి ఆయుధాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన యాంటీ డ్రోన్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు.

ఇండియా–మయన్మార్ సరిహద్దులో..

రెండు దేశాల నడుమ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకొనే దిశగా భూటాన్-చైనా మధ్య కొనసాగుతున్న చర్చలపై జనరల్ మనోజ్ పాండే స్పందించారు. ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. భూటాన్‌తో భారత్‌కు బలమైన సైనిక సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇక ఇండియా-మయన్మార్ సరిహద్దులో పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉందని అంగీకరించారు. అక్కడి పరిస్థితిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని అన్నారు.

మెహబూబా ముఫ్తీకి తప్పిన ప్రమాదం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ రోడ్డు ప్రమాదం నుంచి త్రుటిలో సురక్షితంగా బయటపడ్డారు. గురువారం ఆమె ప్రయాణిస్తున్న కారు అనంత్‌నాగ్ జిల్లా సంగం ప్రాంతంలో మరో కారును ఢీకొట్టింది. ఘటనలో ఆమె కారు తీవ్రంగా దెబ్బతినగా, డ్రైవర్‌కు, అందులో ఉన్న భద్రతాధికారి ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ముఫ్తీకి మాత్రం ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించేందుకు ఖానాబల్ వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకున్నట్లు చెప్పారు. ఘటన అనంతరం మెహబూబా ముఫ్తీ వేరే కారులో తన ప్రయాణాన్ని కొనసాగించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదం నుంచి తన తల్లి సురక్షితంగా బయటపడ్డారని ముఫ్తీ మీడియా అడ్వైజర్, ఆమె కుమార్తె ఇల్టిజా ముఫ్తీ ధ్రువీకరించారు.

లైంగిక వేధింపుల ఆరోపణలు.. నేపాల్ 'బుద్ధ బాయ్' అరెస్ట్



కఠ్మాండు: నేపాల్‌కు చెందిన ఆధ్యాత్మిక నేత, బుద్ధుడి అవతారంగా భావించే రామ్ బహదూర్ భోంజన్(33)ను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆశ్రమంలోని పలువురు యువతుల అదృశ్యం, అత్యాచారం ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. నీళ్లు, ఆహారం, నిద్ర లేకుండా ధ్యానంలో అతడు నిశ్చలంగా నెలలపాటు ఉంటాడని ఆయన అనుచరులు నమ్ముతారు. అతడిని బుద్ధ బాయ్‌గా పిలుచుకుంటారు. తన ధ్యానానికి ఆటంకం కలిగించినందుకుగాను పలువురిపై అతడు దాడి చేసినట్లు, అనుయాయులపై భౌతిక, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలున్న రామ్ బహదూర్ దశాబ్ద కాలంగా తప్పించుకు తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. సలార్హి ఆశ్రమంలో ఓ బాలికపై 2018లో అత్యాచారానికి పాల్పడినట్లు కూడా పోలీసులకు ఫిర్యాదు అందింది. బుధవారం పట్టుబడిన సమయంలో అతడి వద్ద 3 కోట్ల నేపాలీ కరెన్సీతోపాటు 22,500 డాలర్లు లభించినట్లు సమాచారం.

అది 'భారత్ తోడో అన్యాయ్ యాత్ర': నడ్డా



ఇటానగర్: కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రను బీజేపీ చీఫ్ జేపీ నడ్డా భారత్ తోడో అన్యాయ్ యాత్రగా అభివర్ణించారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ప్రయత్నించలేదన్నారు. విభజించి- పాలించు రాజకీయాలకు మారుపేరైన కాంగ్రెస్ దేశాన్ని విభజించేందుకే యత్నించిందని ఆరోపించారు. అప్పటి దుర్మార్గాలను దాచి ఉంచేందుకే తాజాగా యాత్ర మొదలుపెట్టిందన్నారు. గురువారం ఆయన ఇటానగర్‌లో మాట్లాడారు.

బ్యాగులో మద్యం బాటిళ్లున్నాయ్!

- క్యాబ్ డ్రైవర్‌తో సూచనా సేథ్
- బ్యాగులో బిడ్డ మృతదేహంతో 12 గంటల ప్రయాణం

బెంగళూరు: గోవాలో నాలుగేళ్ల కొడుకు చంపి, మృతదేహం ఉంచిన సూట్ కేసును బెంగళూరుకు తీసుకువచ్చిన సీఈవో సూచనా సేథ్ గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. దాదాపు 12 గంటలపాటు కొడుకు మృతదేహంతో కారులో ప్రయాణించిన సమయంలో ఆమె ఎలా ప్రవర్తించిందనే విషయాన్ని క్యాబ్ డ్రైవర్ రేజాన్ డిసౌజా వెల్లడించాడు. ప్రయాణం ప్రారంభమైనప్పటి నుంచి ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉన్నట్లు డిసౌజా తెలిపాడు. జనవరి 7వ తేదీన అర్ధరాత్రి 12.30 సమయంలో గోవాలోని కండోలిమ్‌లో ఉన్న 'సోల్ బన్యాన్ గ్రాండ్' అనే సర్వీస్ అపార్టుమెంట్ నుంచి డిసౌజాకు కాల్ వచ్చింది. ఒక మహిళను అర్జంటుగా బెంగళూరుకు తీసుకెళ్లాల్సి ఉందనేది కాల్ సారాంశం. వెంటనే డిసౌజా కారుతో అక్కడికి వెళ్లాడు. ఒంటి గంటకు సూచనా సేథ్ బయటకు వచ్చింది. డిసౌజా ఆమెను రిసెప్షన్ దగ్గర రిసీవ్ చేసుకున్నాడు. ఆమెతోపాటు ఉన్న నల్ల రంగు బ్యాగు చాలా బరువుగా ఉంది. బ్యాగు గురించి ఆ సమయంలో డిసౌజాకు ఎటువంటి అనుమానం రాలేదు. 'మద్యం బాటిళ్లు గానీ ఉన్నాయా మేడం, బ్యాగు బరువుగా ఉంది'అని అడిగా. అందుకామె, అవును, మద్యం బాటిళ్లున్నాయి అని సమాధానమిచ్చిందని డిసౌజా తెలిపాడు. ప్రయాణం మొత్తమ్మీద దాదాపుగా వాళ్లిద్దరూ మాట్లాడుకోలేదు. గోవా-కర్ణాటక సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్ జామ్‌తో 4 గంటలు లేటయింది. అయినా కూడా సూచన ఎటువంటి అసహనం కానీ, భయపడ్డట్లుగానీ కనిపించలేదని డిసౌజా చెప్పాడు. 'ఆమె ఎవరికీ ఫోన్ చేయలేదు. ఆమెకు కూడా ఫోన్ కాల్స్ రాలేదు'అని తెలిపాడు. 'ట్రాఫిక్ జామ్ క్లియర్ అయ్యేందుకు ఆలస్యమవుతుంది మేడం. అర్జంటు అన్నారు కదా, యూ-టర్న్ తీసుకుని ఎయిర్ పోర్టుకు పోనివ్వమంటారా? అని అడిగా. అయితే, ఆమె ఎయిర్‌పోర్టుకు వద్దు, ట్రాఫిక్ క్లియర్ అయ్యాకే వెళ్దామని బదులిచ్చింది. అర్జంటుగా వెళ్లాలంటూనే, ట్రాఫిక్ సమస్య ఉన్నా సమస్య లేదనడం వింతగా అన్పించింది. కర్ణాటక సరిహద్దులు దాటగానే గోవా పోలీసుల నుంచి ఫోనొచ్చింది. కారులో ఉన్న మహిళతోపాటు బాబు ఉన్నాడా అని అడిగారు. ఆమె ఇచ్చిన అడ్రస్, ఇతర వివరాలన్నీ ఫేక్ అని చెప్పారు. దగ్గర్లోని పోలీస్ స్టేషన్ దగ్గరికి వెళ్లాలని సూచించారు. నేరుగా పోలీస్ స్టేషన్‌లావరణలో కారును ఆపడంతో, సూచన ఇక్కడికెందుకు తీసుకొచ్చావు? అని అడిగింది. పోలీసులు మీతో మాట్లాడుతామన్నారు'అని ఆమెకు చెప్పినట్లు వివరించాడు. 'పోలీసులు కారు సోదా చేసి, బ్యాగులో చిన్నారి మృతదేహాన్ని కనుగొన్నారు'అని డిసౌజా చెప్పాడు.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 12 । జనవరి । 2024

పందెం కోడికి ఆర్టీసీ వేలం

సంక్రాంతి పందెంలో పాల్గొనే ఓ కోడికి కరీంనగర్ ఆర్టీసీ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం వేసేందుకు నిర్ణయించారు. ఆసక్తి ఉన్నవారు కొనుగోలు చేసుకోవచ్చని డిపో–2 మేనేజర్ మల్లయ్య తెలిపారు. సోషల్ మీడియాలో ఇప్పుడు ఈ కోడి వార్త హల్ చల్ చేస్తోంది. ఈ నెల 9న కరీంనగర్–2 డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు వరంగల్ నుంచి వేములవాడకు వెళ్లిన అనంతరం తిరిగి కరీంనగర్ చేరుకుంది. కోడి కూత వినబడటంతో బస్సు డ్రైవర్, కండక్టర్ దాన్ని కంట్రోలర్‌కు అప్పగించారు. మూడు రోజులుగా ఆ కోడిని ఆర్టీసీ రక్షిస్తోంది.

– సాక్షి ప్రతినిధి కరీంనగర్ - వివరాలు మెయిన్‌లో..



న్యూస్‌రీల్

ఫిబ్రవరిలోగా ఇంటి పన్ను వసూలు చేయాలి

- జీపీ భవనాల పనులు త్వరగా పూర్తవ్వాలి
- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్: ఇంటి పన్ను, కరెంట్ బిల్లులు ఫిబ్రవరి నెలాఖరులోగా వసూలు చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, జూనియర్ ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు నిత్యం ప్రతీ గ్రామ పంచాయతీలో 50 మంది కూలీలు హాజరు కావాలన్నారు. వ్యవసాయ, దాని అనుబంధ, సహజ వనరులు, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. 2023–24లో హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద నిర్దేశిత లక్ష్యం ప్రకారం పనుల మంజూరు తీసుకొని, పనులు పూర్తి చేయాలన్నారు. నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు వేయడం 100 శాతం పూర్తవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, మండల పరిషత్ డెవలప్‌మెంట్ ప్లాన్ నిర్ణీత సమయంలో తయారు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ భవనాల పనులు త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్డీవో ఎల్.శ్రీలత, జెడ్పీ సీఈవో పవన్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, అదనపు డీఆర్డీవో సంధ్యారాణి, డివిజనల్ పంచాయతీ అధికారి జి.లత, సహాయ పథక సంచాలకులు డాక్టర్ పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్ వాసికి అరుదైన అవకాశం

- సీఎం పీఆర్వోగా సీనియర్ జర్నలిస్టు
- స్వగ్రామంలో హర్షం



బొల్గం శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు బొల్గం శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీఆర్వోగా నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందారు. పీజీ వరకు విద్యాభ్యాసం చేసిన శ్రీనివాస్ మొదట ఈనాడు దినపత్రికలో కంట్రిబ్యూటర్‌గా పత్రిక రంగంలో ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం సాక్షి దినపత్రికలో బ్యూరో ఇన్‌చార్జిగా, జనరల్ బ్యూరోగా పనిచేశారు. ప్రస్తుతం వీ6–వెలుగు దినపత్రికలో బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నారు. ఈక్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి పీఆర్వోగా నియమితులయ్యారు. చిన్నతనం నుంచి సాహిత్యం, జర్నలిజంపై మక్కువ చూపేవారు. చదువుల తల్లి నారాయణపూర్‌లో ఇప్పటికే అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు అధికారులు ఉండగా, ఈ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు సీఎం పీఆర్వోగా అరుదైన అవకాశం రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాస్ నియామకంపై గ్రామస్తులతోపాటు అతని స్నేహితులు, స్థానిక అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

నిరీక్షణ తప్పలే.. అంబులెన్స్ కదల్లే



పాఠశాలలు, కళాశాలలకు శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించడంతో స్వగ్రామాలకు వెళ్లేవారు ఒక్కసారిగా వేల సంఖ్యలో కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకున్నారు. దీంతో సంక్రాంతి పండుగకు వేసిన అదనపు బస్సులు కూడా సరిపోక నిరీక్షిస్తూ ఇబ్బందులు పడ్డారు. సీట్లు దొరకాలని బస్సుల వెంట పరుగులు తీశారు. కిటికీల నుంచి బ్యాగులు, చంటి పిల్లలను బస్సుల్లోకి ఎక్కించారు.



కరీంనగర్ బస్టాండ్‌లో గురువారం ఓ యువకుడికి ఫిట్స్ రావడంతో తోటి ప్రయాణికులు 108కి ఫోన్ చేశారు. వెంటనే వచ్చిన అంబులెన్స్ బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా బస్టాండ్ ఇన్‌గేట్ మొత్తం బస్సులతో నిండిపోయి, దారి కరువైంది. దీంతో కొద్దిసేపు ఆ వాహనం అక్కడే ఆగిపోయింది. కాసేపటికి బస్సులు క్లియర్ కావడంతో వెళ్లిపోయింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

మిత్రుడి హాల్ టికెట్‌తో పరీక్షకు

- మాల్ ప్రాక్టీస్ కింద ఇద్దరూ బుక్

కరీంనగర్‌సిటీ: తన హాల్ టికెట్ పోవడంతో మిత్రుడి హాల్ టికెట్‌తో పరీక్షకు హాజరై దొరికిపోయిన ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల పరీక్షా కేంద్రంలో జరిగింది. ఈ ఘటనలో హాల్ టికెట్ ఇచ్చిన మిత్రుడు కూడా మాల్‌ప్రాక్టీస్ కింద బుక్‌కావడం గమనార్హం. వివరాలు.. శాతావాహన యూనివర్సిటీ డిగ్రీ కోర్సులకు సంబంధించి మొదటి, మూడవ పరీక్షలు జరుగుతున్నాయి. ధర్మపురి పట్టణంలోని 4 డిగ్రీ కళాశాలకు సంబంధించిన విద్యార్థులు స్థానిక నైట్ కాలేజీలో (శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల) పరీక్షలు రాస్తున్నారు. గురువారం మధ్యాహ్నం మొదటి సెమిస్టర్ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో స్థానిక నవోదయ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి తన హాల్ టికెట్ పోవడంతో తనతో పాటే పరీక్షకు హాజరయ్యే మిత్రుడి బ్యాక్‌లాగ్ పేపర్ హాల్‌టికెట్ తీసుకొని హాజరై పరీక్షను రాస్తున్నాడు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ప్రత్యేక తనిఖీలు చేయడంతో ఇద్దరూ దొరకగా, మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేశారు.

ధాన్యం.. మాయం

- లక్షల క్వింటాళ్లు అమ్ముకుంటూ రూ.కోట్లలో సంపాదన
- అధికారులు నోటీసులిచ్చినా జంకు లేదు
- జిల్లాలో పలువురు మిల్లర్ల తీరు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో అక్రమాలు తేటతెల్లం
- సీఎంఆర్ ఇవ్వకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్న ప్రభుత్వం
- ఈ నెలాఖరు వరకే గడువు



కరీంనగర్ అర్బన్: రైస్‌మిల్లు ఉంటే చాలు పెట్టుబడి లేని దందా.. ప్రభుత్వమిచ్చిన ధాన్యాన్ని మరాడించి, బియ్యం సర్కారుకు ఇవ్వాల్సి ఉండగా మాయం చేస్తున్నారు. లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని అమ్ముకొని రూ.కోట్లు సంపాదిస్తూ ప్రభుత్వానికి మొండిచేయి చూపుతున్నారు. ఏళ్లుగా ఈ దందా సాగుతోంది. కేసులు నమోదు చేసినా, నోటీసులిచ్చినా జంకు లేదు. రాజకీయంగా ఏమైనా చేయగలమనే నమ్మకంతోపాటు పలువురు నేతల హస్తం కల్పతరువవుతోంది. ఇప్పటికే పౌర సరఫరాల సంస్థ అధికారులు జమ్మికుంట మిల్లర్లపై కేసులు పెట్టగా, శంకరపట్నం మండలంలో ఒక మిల్లర్‌ను రిమాండ్‌కు తరలించడం సంచలనం రేపుతోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూడు రోజులపాటు తనిఖీలు చేయగా అక్రమమార్గంలో ధాన్యాన్ని విక్రయించిన మిల్లర్ల గుండెల్లో గుబులు మొదలైంది. రేషన్ బియ్యాన్ని పెద్దమొత్తంలో కొనుగోలు చేసి, ప్రభుత్వానికి అప్పగించాలనుకుంటే సీపీ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో బ్రేక్ పడినట్లయింది.

బియ్యం ఎలా ఇస్తారో?

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరులోగా సీఎంఆర్ ఇవ్వకుంటే కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొనగా ప్రస్తుత పరిస్థితుల్లో ఆ గడువులోగా ఇవ్వడం గగనమే. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, రీసైక్లింగ్ చేయాలని పలువురు మిల్లర్లు 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా, ఇతర జిల్లాల రైతుల నుంచి సేకరించిన 2,96,900.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లుల కెపాసిటీని బట్టి కరీంనగర్ జిల్లాలోని దాదాపు అన్ని మిల్లులకు కేటాయించారు. ఇప్పటివరకు 1,99,901.890 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చారు. ఇంకా 34,863,690 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. ఇక, 2022–23 యాసంగి సీజన్‌లో 3,74,825.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు అందించారు. 2,53,634,580 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 60,088 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. పెద్దమొత్తంలో ధాన్యాన్ని మాయం చేసిన వారు బియ్యాన్ని ఎలా ఇస్తారో వేచిచూడాలి.

మిగతావారిపై చర్యలేవి?

కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతాల్లో ఇటీవల 7 మిల్లుల్లో తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లక్షల క్వింటాళ్ల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. జమ్మికుంటకు చెందిన ఓ మిల్లర్ అక్రమాలను చూసి ఆశ్చర్యపోయారు. ఈ ఒక్క మిల్లులోనే దాదాపు 4 లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం లోటును గుర్తించినట్లు సమాచారం. అలాగే, శంకరపట్నం మండలం మొలంగూర్‌లోని ఓ మిల్లులోనూ ఇలాంటి భాగోతమే బయటపడగా జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రజనీకాంత్ బాధ్యుడిపై కేసు పెట్టారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కరీంనగర్‌లోని రెండు, మానకొండూర్ మండల కేంద్రంలో రెండు, తిమ్మాపూర్ మండలం రేణికుంటలోని మరో రెండు రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ మిల్లుల్లోనూ ప్రభుత్వం కేటాయించిన ధాన్యం పూర్తిస్థాయిలో లేదని తెలిసింది. అయితే మొలంగూర్‌కు చెందిన మిల్లర్‌పై కేసు నమోదు చేసిన అధికారులు మిగతా మిల్లర్లపై చేయకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి.

సీఎంఆర్ ఇస్తున్నది కొందరే..

కొందరు మిల్లర్లు నిజాయితీగా సీఎంఆర్ ఇస్తుండగా మరికొందరు బరితెగించి వ్యవహరిస్తుండటం వ్యవస్థకే మాయని మచ్చగా మిగులుతోంది. గతంలో మిల్లర్లు ధాన్యం మరాడించిన తర్వాత సీఎంఆర్ ఇవ్వకుండా అమ్ముకోవడమో, పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి, సీఎంఆర్ కింద ఇవ్వడమో చేసేవారు. కానీ, కొంతకాలంగా ఏకంగా ప్రభుత్వమిచ్చిన ధాన్యాన్నే అమ్ముకునే స్థితికి చేరారు. బియ్యం కంటే ధాన్యం అమ్మితేనే ఎక్కువ గిట్టుబాటు అవుతుండటంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు అక్రమంగా తరలించారు.

రైస్‌మిల్లర్ల నేత ఆడియో వైరల్

ప్రభుత్వం సీరియస్ ఉంది.. ఎప్పటిలాగే వచ్చిన ధాన్యాన్ని అమ్ముకుంటే ముందు తీవ్ర పరిణామాలుంటాయి.. నేను చెప్పేది అర్థం చేసుకోండి.. సీఎం, మంత్రి సీరియస్‌గా ఉన్నారు.. అమ్ముకున్నవారి పరిస్థితి ఎక్కడికి దారి తీస్తుందో తెలియదు.. ధాన్యం ఉన్నవారు మాత్రం మరాడించి ప్రభుత్వానికి ఇవ్వండి. ఇంతకుమించి నేనేం చెప్పలేనంటూ రైస్‌మిల్లర్ల సంఘం నేత ఆడియో వైరల్‌గా మారింది.

ఆలస్యం చేస్తే బ్లాక్ లిస్టులో చేర్చుతాం

- అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీకిరణ్



మిల్లులో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

జమ్మికుంట(హుజూరాబాద్): వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎమ్మార్ అందించడంలో ఆలస్యం చేస్తే మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో చేర్చుతామని అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీకిరణ్ హెచ్చరించారు. గురువారం జమ్మికుంట పట్టణంలో సివిల్ సప్లై డీఎం రజనీకాంత్, హుజూరాబాద్ ఆర్డీవో రాజులతో కలిసి సప్తగిరి మిల్లులో తనిఖీలు చేపట్టారు. ధాన్యం నిల్వలను పరిశీలించారు. వానాకాలంలో తీసుకున్న ధాన్యం, ప్రభుత్వానికి ఇప్పటివరకు ఇచ్చిన సీఎమ్మార్ వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 31 వరకు బియ్యం అందించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఎఫ్‌సీఐని సందర్శించి, డీఎం రామారావుతో మాట్లాడారు. గోదాంల సామర్థ్యం, సీఎమ్మార్ దిగుమతి ఆలస్యంపై ఆరా తీశారు. కొంతమంది మిల్లర్లు సీఎమ్మార్ అప్పగించడం లేదని, అలాంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ రజని, సివిల్ సప్‌లై డీటీ వసంతరావు, ఎఫ్ఐ వినోద్‌కుమార్, ఆర్ఐలు తిరుపతి, సంతోష్‌కుమార్‌తో తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కార్పొరేషన్‌కు రెండో ర్యాంకు



కరీంనగర్ కార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షన్–2023లో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. గ్రేటర్ హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. లక్ష జనాభాకు పైబడి ఉన్న మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ ఏడాదికి గానూ కేంద్ర ప్రభుత్వం గురువారం ర్యాంకులు ప్రకటించింది. ఈసారి దేశవ్యాప్తంగా 446 నగరాలతో పోటీపడిన కరీంనగర్ నగరపాలక సంస్థ 6,241 మార్కులతో 81వ ర్యాంకు సాధించింది. గతేడాది 382 నగరాలతో పోటీపడి, 4,563 మార్కులతో 67వ ర్యాంకు సాధించింది.

గర్వంగా ఉంది: మేయర్ సునీల్‌రావు

జాతీయ స్థాయిలో కరీంనగర్ నగరపాలక సంస్థను మరింత గొప్ప స్థానంలో నిలబెడతాం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రస్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ తర్వాత కరీంనగర్ టాప్‌లో నిలవడం గర్వంగా ఉంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో జాతీయస్థాయిలో కరీంనగర్‌ను ఉన్నత స్థానానికి తీసుకెళ్తాం. ర్యాంకు రావడానికి కారణమైన పారిశుధ్య కార్మికులు, అధికారులు, పాలకవర్గ సభ్యులు, నగర ప్రజలకు కృతజ్ఞతలు.

‘కొత్తపల్లి’కి మూడో ర్యాంకు

కొత్తపల్లి(కరీంనగర్): స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా దేశంలోని 15 వేల జనాభా గల మున్సిపాలిటీల విభాగంలో సౌత్‌జోన్ కింద కొత్తపల్లి మున్సిపాలిటీకి క్లీన్‌సిటీ విభాగంలో మూడో ర్యాంకును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వరుసగా రెండుసార్లు అవార్డు రావడంపై మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కమిషనర్ వేణుమాధవ్, కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు.

మార్కెట్ కమిటీలపై గురి

- ఆశావహుల్లో సందడి
- కమిటీల రద్దు ప్రకటనతో మొదలైన పైరవీలు
- జిల్లాలో 7 వ్యవసాయ మార్కెట్లు



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కరీంనగర్ అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఆశావహుల్లో సందడి నెలకొంది. నామినేటెడ్ పోస్టుల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు కీలకం కాగా, సీనియర్, జూనియర్ నేతలు అప్పుడే పైరవీలు మొదలు పెట్టారు. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించినవారు ఈ పోస్టులపై కన్నేశారు. జిల్లాలో జమ్మికుంట, కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూరు, గంగాధర, గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. మార్కెట్ కమిటీలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులనే పాలకులుగా, డైరెక్టర్లుగా నియమించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందోనన్న చర్చ జరుగుతోంది.

రిజర్వేషన్ ఉంటుందా?

రైతులైతేనే తోటి రైతులకు న్యాయం చేయగలరన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం వారినే చైర్మన్లుగా, వైస్ చైర్మన్లుగా నియమించింది. రిజర్వేషన్ విధానం అమలు చేసి, పాలకవర్గంలో 18 మంది సభ్యులుగా ఉండాలని నిర్ణయించింది. గతంలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో కలిపి సభ్యుల సంఖ్య మొత్తం 14 ఉండగా 18కి పెంచింది. తొలుత పాలకవర్గ పదవీకాలం ఏడాది కాగా, తదుపరి రెండేళ్లకు పెంచింది. ఓసీ జనరల్ తదుపరి ఎస్సీ మహిళ, ఓసీ జనరల్, తర్వాత బీసీ–డీ, అనంతరం ఓసీ మహిళగా రిజర్వేషన్ అమలవుతోంది. ఈసారి రిజర్వేషన్ ఉంటుందో లేదో చూడాలి.

మార్కెట్ల ఆదాయాన్ని బట్టి గ్రేడింగ్

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానంగా పంటల కొనుగోలు పరంగా పన్నుతో ఆదాయం లభిస్తుంది. ఆయా మార్కెట్ల ఆదాయాన్ని బట్టి ప్రభుత్వం గ్రేడింగ్ నిర్ణయిస్తుంది. రూ.3 కోట్లకు పైగా ఉంటే సెలక్షన్ గ్రేడ్‌గా పరిగణిస్తుండగా డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. రూ.కోటి నుంచి రూ.3 కోట్ల మధ్య ఆదాయం వస్తే స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తూ ఏడీ క్యాడర్ అధికారిని నియమిస్తారు. రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు ఆదాయం ఉంటే గ్రేడ్–1 గా, రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉంటే గ్రేడ్–2గా, రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం ఉంటే గ్రేడ్–3గా పరిగణిస్తూ అధికారుల నియామకం ఉంటుంది. రూ.25 లక్షల వరకు ఆదాయం లభిస్తే దానికి అసిస్టెంట్ సెక్రెటరీ స్థాయి అధికారి నియమిస్తారు. కరీంనగర్, జమ్మికుంట సెలక్షన్ గ్రేడ్, చొప్పదండి స్పెషల్ గ్రేడ్, హుజూరాబాద్ గ్రేడ్–1, గంగాధర గ్రేడ్–3 కాగా, మానకొండూర్, గోపాల్‌రావుపేట వేటి పరిధిలోకీ రావు.

స్వాతంత్య్రోద్యమంలో ఓబన్నది కీలక పాత్ర

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: స్వాతంత్య్రోద్యమంలో వడ్డె ఓబన్న కీలక పాత్ర పోషించారని, ఆయన చరిత్రను భావితరాలకు చెప్పాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబన్న 217వ జయంతి వేడుకలను ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. సంచార జాతికి చెందిన సుబ్బన్న–సుబ్బమ్మ దంపతులకు 11 జనవరి, 1807లో ఓబన్న జన్మించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతల సమ్మయ్య, ఉపాధ్యక్షుడు చల్ల రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కొమ్మరాజుల శ్రీనివాస్, ఓర్సు మురళి, భిక్షపతి, వెంకటేశ్, బొంత నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు, నాయకులు

సేంద్రియ పద్ధతిలో మొక్కలను పెంచాలి

తిమ్మాపూర్(మానకొండూర్): నర్సరీల్లో మొక్కలను ఫర్టిలైజర్లతో కాకుండా సేంద్రియ పద్ధతిలో పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న నర్సరీని, మహాత్మానగర్‌లోని సంపద వనాన్ని గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. మొక్కలను ప్లాస్టిక్ బ్యాగులలో కాకుండా సీడ్ బాల్స్‌లా తయారు చేసి, పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీలత, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కిరణ్‌కుమార్, ఏపీవో లలిత, ఈసీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వోబీ పనులపై ఎంపీ ఫైర్

- నేను ఎంపీనని మీకు తెలుసా?
- పరిశీలనకు వచ్చాక భూ సేకరణ సమస్య అంటారా?
- అధికారులపై బండి సంజయ్ ఆగ్రహం



ఆర్వోబీ పనులు పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులపై యాక్షన్ ప్లాన్ ఏది? పనులెంతవరకు వచ్చాయి? కాంట్రాక్టర్ ఎక్కడ? అంటూ ఆర్అండ్‌బీ అధికారులను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. యాక్షన్ ప్లాన్ నివేదిక లేదని, కాంట్రాక్టర్ రాలేదని చెప్పడంతో తమాషా చేస్తున్నారా అంటూ ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. మార్చి నెలాఖరులోపు పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. లోడింగ్ పాయింట్‌ను వేరేచోటుకు మార్చితే ఇబ్బంది అవుతుందని స్థానిక నాయకులు చెప్పడంతో అక్కడే ఉంచాలని అధికారులకు ఎంపీ సూచించారు. అనంతరం ఆర్వోబీ పనులను పరిశీలించారు. భూసేకరణ సమస్య ఏర్పడుతోందని అధికారులు తెలుపుగా నేను ఎంపీనని మీకు తెలుసా? పనులు ప్రారంభించి 4 నెలలవుతోందని, పరిశీలనకు వస్తే చెప్తారా అంటూ మండిపడ్డారు. ఆర్వోబీ నిర్మాణానికి కేంద్రం సేతుబంధన్ కింద రూ.154 కోట్లు మంజూరు చేసిందని, భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. భూసేకరణ చేయకుండా పనులు చేపట్టడం సరికాదని, కాంగ్రెస్ సర్కారు సహకరించాలని కోరారు. తాత్కాలిక రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. ఏడాదిలోపు ఆర్వోబీ పనులను పూర్తి చేయకుంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ సాంబశివరావు, డీఈఈ రవీందర్, రైల్వే అధికారులు సమీర్‌కుమార్, రవీందర్, దేవేందర్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృసింహుని హుండీ ఆదాయం రూ.54.21 లక్షలు



హుండీ లెక్కిస్తున్న వలంటీర్లు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. 95 రోజుల్లో రూ.54,21,314 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. అలాగే 90 గ్రాముల మిశ్రమ బంగారం, 6.20కిలోల మిశ్రమ వెండి, 31 విదేశీనోట్లు సమకూరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా గ్రూప్ దేవస్థానం ఈవో వేణుగోపాల్, రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, గందె పద్మ, గునిశెట్టి రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శివరామకృష్ణకు దేశరత్న అవార్డు



త్రీడీ ఆర్ట్‌ను పరిశీలిస్తున్న ఉత్తరప్రదేశ్ ఎంపీ జగదాంబికపాటిల్



శివరామకృష్ణ

రామగిరి(మంథని): మంథని జేఎన్‌టీయూ కళాశాల మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రముఖ అంతర్జాతీయ త్రీడీ పెయింటర్ సింగారపు శివరామకృష్ణ ప్రతిష్టాత్మక దేశరత్న అవార్డుకు ఎంపికయ్యాడు. ఫిబ్రవరిలో కేంద్రమంత్రి చేతుల మీదుగా అందుకోనున్నాడు. భారత్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ శివరామకృష్ణను అవార్డుకు ఎంపిక చేస్తూ లేఖ పంపించింది. కాగా ఇటీవల ఆర్ట్‌ను తిలకించిన ఉత్తరప్రదేశ్ ఎంపీ జగదాంబికపాటిల్ దేశంలో త్రీడీ ఆర్ట్ ఒక శివరామకృష్ణతోనే అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహాభారత కాలంనాటి పురాతన కళ అయిన త్రీడీ ఆర్ట్ తెలిసినవారు దేశంలో అతి తక్కువ మంది ఉన్నారని అందులో శివరామకృష్ణ ఒకరని కితాబునిచ్చారు. ఈ కళను అమెరికాలో ప్రదర్శించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత అతడికే దక్కుతుందని అభినందించారు. అవార్డుకు ఎంపికైన శివరామకృష్ణను కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

కిట్స్‌లో జాబ్‌మేళా



కంపెనీ ప్రతినిధులతో ప్రిన్సిపాల్ శంకర్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం కాల్‌రైట్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ తెలిపారు. కళాశాలలోని 120 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 20 మంది మౌఖిక పరీక్షకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

లెక్చరర్స్ అసోసియేషన్ కార్యవర్గం

సైదాపూర్(హుస్నాబాద్): తెలంగాణ ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ అర్థశాస్త్ర అధ్యాపకుడు పెదముత్తని రాజశేఖర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గాదె వెంకన్న గురువారం ప్రకటించారు. జనరల్ సెక్రెటరీగా అంబటి జయపాల్‌రెడ్డి (వీణవంక), ట్రెజరరీ దానబోయిన మహేందర్ (చిగురుమామిడి), ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి(మానకొండూర్), ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజేశ్వర్(కరీంనగర్), ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ టి.రమేశ్ (మానకొండూర్)ను నియమించినట్లు పేర్కొన్నారు.

అలిశెట్టి.. ఎంతో ఘన కీర్తి

- మరణమెప్పుడూ చివరి చరణం కాదని సంక్షోభ గీతం ఆలపించిన రోజు
- నేడు అలిశెట్టి వర్ధంతి, జయంతి



ప్రభాకర్ (ఫైల్)

జగిత్యాల: మరణమెప్పుడూ చివరి చరణం కాదని సంక్షోభ గీతం ఆలపించిన రోజు.. జనవరి 12న ఒక విషాదమైన రోజు. అక్షరసూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ అస్తమించిన రోజు. 'జనవరి 12 నీ పుట్టిన రోజు నాన్న' అంటూ జగిత్యాల జనం అక్షర నక్షత్రాలు వెలిగిస్తుంటే.. 'జనవరి 12 నీ వర్ధంతి కన్నా' అంటూ ఆ భాగ్యనగరం కన్నీళ్లని కవన భాషలోకి అనువదిస్తోంది. కవిత్వాన్ని అధ్యయనం చేస్తూ చిక్కడపల్లి సెంటర్‌లో తప్పిపోయిన జగిత్యాల పోరడు.. సిటీలైఫ్‌లో మంటల జెండాలెగరెయ్యడానికి పోయి మళ్లీ రాలేదు. అలిశెట్టి చిన్నతనంలోనే మరణించడం సాహితీ లోకానికి తీరని లోటు. తను రాసిన కవితలు బుల్లెట్‌లా ఉంటాయి. చిన్నచిన్న పదాలతోనే ఎంతో అర్థం వచ్చేలా కవితలను అల్లే ఘనత ఆయనకే దక్కుతుంది. ఇప్పటికీ జగిత్యాల జిల్లాలో అతన్ని ఎవరూ మరిచిపోరు.



ప్రభాకర్ కవితాచిత్రాలు

బుల్లెట్ లాంటి కవితలు

తాను శవమై.. ఒకరికి వశమై.. తనువు పుండై.. ఒకరికి పండై.. ఎప్పుడు ఎడారై.. ఎందరికో ఒయాసిస్సై.. జీవితాంతం కలల మత కలేబరాలు కాలుతున్న చోట ఈ కవిత ప్రతిధ్వనిస్తూనే ఉంది. వేదన భరితమైన ఈ కవిత రాసినప్పుడు అలిశెట్టి వయస్సు 18 ఏళ్లు మాత్రమే. గొప్ప కవి, చిత్రకారుడు, ఫొటోగ్రాఫర్ అయిన ప్రభాకర్ 12 జనవరి 1954లో జగిత్యాలలో జన్మించారు. 12 జనవరి 1993లో హైదరాబాద్‌లో మరణించారు. ఎన్నో వెతలతో ఎన్నెన్నో కవితలు రాశాడు. తను అనారోగ్యంతో బాధపడుతూ మందులు కొనుక్కోలేని స్థితిలో హైదరాబాద్‌లో గడిపాడు. చివరకు చనిపోయే రోజు కూడా 'మరణం నా చివరి చరణం కాదు.. మౌనం నా చితాభస్మం కాదు.. మనోహరాకాశంలో విలపించే చంద్రబింబం నా అశ్రుకణం కాదు'.. అంటూ కవిత రాశారు.

కవిత్వానికి జాతీయజెండా..



తెలుగు మినీ కవిత్వంలో జాతీయజెండా లాంటి వాడు అలిశెట్టి ప్రభాకర్. ఆయన కవిత్వమే కాదు జీవితం కూడా ఒక సంక్షోభ గీతం. చనిపోయే రోజు కూడా మరణం నా చివరి చరణం కాదు అంటూ కవిత రాయడం ప్రభాకర్‌కే చెల్లింది. వేశ్య మీద రాసిన కవితకు సమానమైన కవిత ఇప్పటి వరకు ఎవరూ రాయలేకపోయారు. ఈ మధ్యకాలంలో అలిశెట్టి కవితలను ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల్లో ప్రవేశపెట్టడం తెలంగాణ కవులకు ఒక గుర్తింపు లభించినట్లు. తెలంగాణ ఉద్యమంలో ఆయన బతికి ఉంటే ఎంత గొప్ప కవిత్వం వచ్చి ఉండేదో అనిపిస్తుంది.

– కేవీ.నరేందర్, ప్రముఖ కథారచయిత

రహదారి పనుల బిల్లుల విషయంలో వివాదం

- బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం
- పరస్పరం దాడి.. ముగ్గురిపై కేసు



దాడిలో గాయపడిన శ్రీనివాస్

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): రహదారి నిర్మాణ పనుల బిల్లుల చెల్లింపులో జాప్యంపై గురువారం మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య వివాదం జరిగింది. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణాలకు రెండేళ్ల క్రితం ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు కాగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గడ్డం రాజారెడ్డి, మెండె రమేశ్ కాంట్రాక్ట్ దక్కించుకొని మూడు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. వీటికి సంబంధించిన బిల్లులో మొదట రూ.6.49 లక్షలు, రెండోసారి రూ.3.50 లక్షలు చెల్లించినా, మరో రూ.1.38 లక్షల చెల్లింపు విషయంలోనే వివాదం తలెత్తింది. తమకు రావాలిస్సిన మిగతా బిల్లు గురించి గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎన్నిసార్లు వెళ్లినా ఫలితం లేదని గురువారం గ్రామంలోని ఓ హోటల్ వద్దకు వెళ్లిన రాజారెడ్డి, రమేశ్ అక్కడే ఉన్న బీజేపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ (సర్పంచ్ అల్లుడు)ను అడిగారు. ఈక్రమంలో ఇరువురి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. అయితే తమకు రావాల్సిన బిల్లుల చెల్లింపు విషయంలో శ్రీనివాస్ ఉద్దేశపూర్వంగానే అడ్డుపడుతున్నాడని, గతంలో అతడిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, అలా అయితేనే బిల్లులు వస్తాయని చెబుతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంపీటీసీ ఎన్నికల సమయంలో తమ గ్రామంలో బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారని, హామీలు నెరవేర్చాలని తాము నిరసన కార్యక్రమాలు చేపడుతూ ప్రశ్నిస్తున్నందుకే తమపై కక్ష కట్టి దాడులకు పాల్పడుతున్నారని శ్రీనివాస్ ఆరోపించాడు. కాగా ఘర్షణపై రెండు వర్గాలు మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

చిరుత సంచారంపై అటవీ అధికారుల అలర్ట్



చిరుత సంచరించిన ప్రాంతంలో ఫ్లెక్సీ



చిరుత పాదముద్రలు పరిశీలిస్తున్న అధికారులు

- సత్తక్కపల్లి శివారులో రోజంతా గస్తీ
- సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులో చిరుత సంచారంపై ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు అప్రమత్తయ్యారు. గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్న చోట, వరదకాల్వ వైపు, ఇతర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గాలింపు చేపట్టారు. రోజంతా అక్కడే ఉన్న అధికారులు చిరుతపులి ఎక్కడి నుంచి ఏ దారిలో వెళ్తుందోనని పాదముద్రల ఆధారంగా అంచనాకు వచ్చారు. ఉసికెగుట్ట నుంచి మధ్యలో ఉన్న పంటపొలాల మీదుగా వరదకాల్వ వైపు ఒకే దారిలో నడిచినట్లు గుర్తించారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. పెద్దపల్లి జిల్లా మంథని అటవీ కార్యాలయం నుంచి నాలుగు కెమెరాలు తీసుకువచ్చి అనుమానిత ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. కిలోమీటర్‌లోపు 200 మీటర్ల దూరం మధ్య మొత్తం 4 నాలుగు కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా ఓ గొర్రెల కాపరి చిరుత కనిపించందని చెప్పడంతో ఆచోట పాదముద్రలను పరిశీలించారు. మరోవైపు చిరుత సంచరించిన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హఫీజొద్దీన్, బీట్ ఆఫీసర్లు శివరాజ్, రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడం తొలగించాలని ఆమరణ నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న రవిచందర్‌రెడ్డి తదితరులు

జమ్మికుంట(హుజూరాబాద్): అక్రమ కట్టడం తొలగించాలని పట్టణంలోని గాంధీచౌక్ వద్ద వార్డు మాజీ సభ్యుడు తూడి రవిచందర్‌రెడ్డి గురువారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో సర్వే నంబర్ 688లో గల ప్రభుత్వ భూమిని కబ్జాచేసి, నిర్మాణం చేపడుతున్న కౌన్సిలర్ శ్రీపతి నరేశ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (వరంగల్), జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీక్ష చేపట్టడంతో దిగివచ్చిన మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. ఆక్రమణకు గురైన స్థలం వివరాలు అందించాలని రవీచందర్‌రెడ్డిని కోరారు. అనంతరం పోలీసులు దీక్ష శిబిరానికి చేరుకొని విరమింపజేశారు. దీక్షకు మద్దతుగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, నాయకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ హఠాన్మరణం



ధర్మపురి మృతదేహం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన గుమ్మడి ధర్మపురి (58) గురువారం హఠాన్మరణం చెందినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఎప్పటిలాగే ఉదయం విధులకు వచ్చిన ధర్మపురి.. పనిచేస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పరిధిలోని ప్రభుత్వ స్పెషలైజ్‌డ్ అడాప్షన్ ఏజెన్సీ శిశుగృహలో ఖాళీగా ఉన్న ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఏఏ మేనేజర్–1 పోస్టుకు అభ్యర్థులు మాస్టర్స్ డిగ్రీ ఇన్ సోషల్ వర్క్స్, సోషియాలజీ, సైకాలజీ, హోం సైన్స్‌ను ఏదైన గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పూర్తి చేసి, బాలల సంరక్షణ రంగంలో కనీసం మూడేళ్ల అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. 01 జూలై 2023 నాటికి 25 నుంచి 35 ఏళ్ల వయస్సు, ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే 40 ఏళ్లు ఉన్నవారు అర్హులని తెలిపారు. శిశుగృహ ఆయా–1 పోస్టుకు 10వ తరగతి చదివిన వారు, చిన్న పిల్లల బాగోగులు చూసుకునేవారు అర్హులని, చిన్న పిల్లల సంరక్షణ కేంద్రంలో పనిచేసినవారికి ప్రాధాన్యం ఇవ్వబడునని తెలిపారు. 01 జూలై 2023 నాటికి 25 నుంచి 40 ఏళ్ల వయస్సు గల మహిళలు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించి దరఖాస్తులను ఈనెల 24 సాయంత్రం 5 గంటల లోపు భగత్‌నగర్‌లోని బాలరక్షా భవన్‌లో అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 88851 76924 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య



సయ్యద్ నాజీ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన సయ్యద్ అస్లాంకు, వేములవాడ మండలం తుర్కాశీనగర్‌కు చెందిన నాజీ(21)తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి మూడు నెలల క్రితం ఓ పాప జన్మించింది. దురదృష్టవశాత్తు ఆ పాపకు కండ్లు కనిపించకపోవడంతో బాధపడుతున్నారు. వీటికి తోడు భర్త అస్లాం కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. గురువారం ఉదయం భర్త అస్లాం పేయింటింగ్ పనికి, అత్తమామలు కూలీ పనికి వెళ్లిన సమయంలో నాజీ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సైలు ప్రశాంత్, ఆంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన ప్రమాదం



గుంతలో దిగబడిన ఇసుక లారీ

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం మూలమలుపు వద్ద గురువారం ఓవర్ లోడ్‌తో వస్తున్న ఇసుక లారీ భారీ గుంతలో దిగబడి పక్కకు ఒరిగింది. బోల్తాపడితే పెనుప్రమాదం జరిగేదని వ్యాపారులు పేర్కొన్నారు. మూలమలుపుల వద్ద భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఓవర్‌లోడ్ లారీలను అదుపుచేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇసుక లారీ గుంతలో దిగబడటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. రెండు జేసీబీల సాయంతో లారీని ఇసుక క్వారీ సిబ్బంది ఘటన స్థలం నుంచి తొలగించారు. కాగా, పట్టణంలోని మసీదు వద్ద గతంలో ఓవర్‌లోడ్ గ్రానైట్ లారీ ఓ ఇంటి మీద బోల్తాపడింది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఓవర్‌లోడ్ లారీలకు సంబంధిత అధికారులు జరిమానా విధించి అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పల్లెప్రకృతి వనాల ధ్వంసం కేసులో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని సిరిసేడు, భోగంపాడు పల్లెప్రకృతి వనాల ధ్వంసం కేసులో పోలీసులు ఓ ప్రజాప్రతినిధితో పాటు ముగ్గురిని అరెస్ట్ చేశారు. గురువారం హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని సిరిసేడు గ్రామ రెవెన్యూ పరిధి ఎర్రగుట్టల సమీపంలో సిరిసేడు, భోగంపాడు గ్రామాలకు చెందిన పల్లె ప్రకృతి వనాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఈ నెల 7న పంచాయతీ కార్యదర్శులు అంకుస్, శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. సిరిసేడుకు చెందిన రేణికుంట్ల చిన్నరాయుడు, రేణికుంట్ల రామస్వామి పథకం ప్రకారం పల్లెప్రకృతి వనాల్లో చెట్లను తొలగించి, కబ్జా చేసి రామస్వామికి భూమి, కబ్జా కార్యక్రమం చేసినందుకు కొంత మొత్తం డబ్బు చిన్నారాయుడికి ఇచ్చుటకు ఇరువురు ఒప్పందం చేసుకున్నారు. సిరిసేడుకు చెందిన సల్లాల రమేశ్‌కు రూ.పదివేలు అడ్వాన్స్ ఇచ్చి జేసీబీని మాట్లాడుకున్నారు. ఆదివారం రాత్రి జేసీబీ డ్రైవర్ శశికుమార్ పల్లెప్రకృతి వనాల్లోని చెట్లను ధ్వంసం చేశాడు. ఈ కేసులో జేసీబీ, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం



సంపత్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబల్ తిరుపతి వివరాల ప్రకారం.. వీణవంక మండలం శ్రీరాములపేట గ్రామానికి చెందిన కోల సంపత్ (28) హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ (కాంట్రాక్టు) ఉద్యోగి. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో గురువారం జమ్మికుంట– ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య మడిపల్లి గ్రామం కెనాల్ వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య నాగమణి, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కన ఒరిగిన ఆర్టీసీ బస్సు

కోనరావుపేట(వేములవాడ): సిరిసిల్ల నుంచి నిజామాబాద్ జిల్లా సిరికొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. అయితే ప్రయాణికులకు ఎలాంటి గాయాలుకాలేదు. సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు సిరికొండకు 31 మంది ప్రయాణికులతో వెళ్తుంది. సిరికొండ శివారులో మైలారం బొడ్డుమామిడి చెరువు వద్ద ఎదురుగా వస్తున్న కారు హఠాత్తుగా కుడిపక్కకు తిరిగింది. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ కారు ను తప్పించబోగా అదుపుతప్పి పక్క కాలువలోకి ఒరిగింది. బస్సు పక్కకు ఒరగడంతో ప్ర యాణికులు ఆందోళనకు గురయ్యారు. చిన్నపాటి గాయాలు తప్ప ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

వెల్గటూర్(ధర్మపురి): కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలం జగదేవుపేట గ్రామానికి చెందిన మానుపాటి రవీందర్ (31)కు లోకిని సౌందర్యతో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. రవీందర్ కొన్నేళ్లుగా బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లి ఈ మధ్యే వచ్చాడు. అయితే అతడి భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని, తన కుటుంబసభ్యులతో రవీందర్ కుటుంబాన్ని వేధింపులకు గురిచేసింది. దీంతో ఆవేదనకు గురైన రవీందర్ డిసెంబర్ 22న క్రిమిసంహారక మందు తాగగా, కుటుంబసభ్యులు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కామిడి సాంబశివారెడ్డి (47)హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మండలంలోని గొల్లపల్లిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాంబశివారెడ్డికి తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

చందుర్తి(వేములవాడ): వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడ్డ ప్రబుద్ధుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ కిరణ్‌కుమార్ వివరాలు.. చందుర్తి మండలం కట్టలింగంపేటకు చెందిన ఆవునూరి తిరుపతి(37) ఈనెల 9న అదే మండలం లింగంపేటకు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలిని బెదిరించి ఆటోలో ఎక్కించుకొని లింగంపేట శివారులో లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న తిరుపతిని మర్రిగడ్డ శివారులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం



క్యాలెండర్లు ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సంక్షేమమే టీఎన్జీవో సంఘం లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం టీఎన్జీవో సంఘం జిల్లా, తాలుకా క్యాలెండర్లను ఆయా విభాగాల నేతలకు కరీంనగర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా నాయకులు సబిత, మారుపాక రాజేశ్ భరద్వాజ్, నేరెళ్ల కిషన్, వెలిచాల సుమంతరావు, రాధాకృష్ణారెడ్డి, అజయ్, నారాయణ, కిరణ్‌కుమార్, జియా, నరేందర్, విజయలక్ష్మి, నాగరాజు, ప్రవీణ్‌రావు, రాజిరెడ్డి, రాధిక, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోడకూలి గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహం

కోరుట్ల: పట్టణంలోని టీచర్స్‌క్లబ్ రోడ్‌లో గురువారం గోడ కూల్చుతుండగా కూలిపోవడంతో గోడపక్కనే ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియలేదు. వివరాలు తెలిస్తే 87126 56790 నంబర్‌కు తెలుపాలని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



పతంగుల పోటీల్లో ఇంజినీర్లు, డీలర్లు



ఆటలపోటీలు ప్రారంభిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

ముందస్తు సంక్రాంతి సంబరాలు



వేడుకల్లో పారమిత విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరీంనగర్/కొత్తపల్లి: కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏసీసీ, అదానీ, అంబుజా సిమెంట్ సంస్థల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఇంజినీర్లు, డీలర్లకు పతంగుల పోటీలు నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్లు, సభ్యులు నల్లా లక్ష్మయ్య, ఈగల రాజేందర్, పవనకృష్ణ, డీలర్ సత్యనారాయణ, భూమయ్య, అనిల్, సంపత్, ఏసీసీ, అంబుజా అధికారులు అనుదీప్, మధు, వెంకట్, పెద్దపల్లి శివప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో పొంగల్ ప్లే నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి జెండా ఊపి ఆటల పోటీలు ప్రారంభించారు. అలాగే పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్, మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాల, లిటిల్ జీనియస్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల రంగవల్లులు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాలల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు అనూకర్‌రావు, ప్రసూన, వినోద్‌రావు, హనుమంతరావు, ప్రిన్సిపాల్ రితేశ్‌మెహతా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమ్మక్క జాతర ఏర్పాట్లు వేగవంతం చేయాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. త్వరలో జాతర జరగబోయే రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంతాన్ని కమిషనర్ సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. కమిషనర్ వెంట ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ కార్పొరేషన్: 51వ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మాజీ మేయర్, కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ కోరారు. గురువారం నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌ను కలిసి పలు సమస్యలను విన్నవించారు. టవర్‌సర్కిల్‌లో డ్రైనేజీల కనెక్టివిటీ, గురుద్వార్ ఎదుట రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

హుండీ ఆదాయం లెక్కింపు


ఆదాయం లెక్కిస్తున్న కార్యకర్తలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజేయస్వామి ఆలయాల హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. మూడు నెలలకు గానూ రూ.2,50,687 సమకూరినట్లు ఈవో కొన్న కాంతారెడ్డి తెలిపారు. లెక్కింపులో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, భక్తులు గోవిందపతి శ్రీవారి సేవా సమతి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు పరిశీలన

కరీంనగర్: భగత్‌నగర్‌లోని అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం మానకొండూర్ మండలం ఖాదర్‌గూడెంలోని ఫామ్ అరవిందను సందర్శించారు. గ్రామంలోని పంట పొలాలకు వెళ్లి వ్యవసాయం జరిగే విధానం తెలుసుకున్నారు. ఆద్యంతం ఆసక్తికరంగా పరిశీలిస్తూ వారి పాఠ్యాంశాలతో పోల్చుకున్నారు. పాఠశాల డైరెక్టర్ సాగాని అనుదీప్, ప్రిన్సిపాల్ చంద్రకళ తివారి, ఉపాధ్యాయబృందం, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు ఎస్సారార్ వలంటీర్ ఎంపిక

కరీంనగర్ సిటీ: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 12 నుంచి 16 వరకు జరుగనున్న 27వ జాతీయ యువజన ఉత్సవాలకు నగరంలోని ఎస్సారార్ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి సురేష్‌కుమార్ ఎంపికయ్యారు. ఇటీవల శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి యువజన ఉత్సవాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్ జి.సురేష్ కుమార్, 3వ యూనిట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వరప్రసాద్‌లను కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

పరామర్శ



కరీంనగర్: కరీంనగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అఫ్రోజ్ ఖాన్ సతీమణి ఇటీవల గుండెపోటుతో మరణించగా.. వారి కుటుంబ సభ్యులను గురువారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారదాసు లక్ష్మణ్‌రావులు పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.


మానేరులో..


బిర్లా స్కూల్లో..


విజ్ఞాన్ హైస్కూల్‌లో..

విద్యాసంస్థల్లో సంక్రాంతి మురిపెం


విట్స్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో గురువారం ముందస్తుగా సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన భోగి మంటలు కనువిందు చేశాయి. పలువురు విద్యార్థుల వేషధారణలు, నృత్యాలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. వేడుకల్లో ఆయా విద్యాసంస్థల బాధ్యులు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్/సప్తగిరికాలనీ/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి


గోపాల్‌పూర్‌లోని శాతవాహన స్కూల్‌లో..


అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో..


సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ విద్యార్థులు


అచీవర్స్‌లో..


కోరా, జాన్సన్‌లో..


మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో..

చిన్న పంచాయతీల్లో నిధుల కొరత

- గ్రామాల్లో లోపిస్తున్న పారిశుధ్యం

కరీంనగర్‌రూరల్: ప్రజలకు పాలన చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 500 జనాభా కలిగిన అనుబంధ గ్రామాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. కొత్త పంచాయతీలు ఏర్పాటైనప్పటికీ నిధుల కొరత కారణంగా అభివృద్ధి పూర్తిగా పడకేసింది. ఈ నెలాఖరుతో సర్పంచుల పదవీకాలం ముగుస్తుండటంతో పలువురు సర్పంచులు పరిపాలనపై చేతులెత్తేశారు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామపంచాయతీలుండగా కొత్తగా దుబ్బపల్లి, తాహెర్‌కొండాపూర్ గ్రామపంచాయతీలను ఏర్పాటు చేశారు. కొత్త గ్రామపంచాయతీలతో పాటు చిన్న పంచాయతీలైన మందులపల్లి, నల్లగుంటపల్లి, ఇరుకుల్ల, ఫకీర్‌పేట, బహదూర్‌ఖాన్‌పేటలు నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రతినెలా రావాల్సిన నిధులు సకాలంలో రాకపోవడంతో సర్పంచులు అప్పులు చేసి పనులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బందికి వేతనాలు సైతం చెల్లించలేని దుస్థితిలో సర్పంచులున్నారు.


నల్లగుంటపల్లి పంచాయతీ ఎదుట ఉన్న డ్రైనేజీలోని పూడిక

జనాభా ప్రాతిపదికన నిధులు

గ్రామపంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తోంది. చిన్న పంచాయతీల్లో 500 జనాభాలోపు ఉండటంతో ఎస్ఎఫ్‌సీ నిధులు చాలా తక్కువగా వస్తున్నాయి. గత ఏడాది నుంచి నిధులను విడుదల చేయకపోవడంతో అభివృద్ధిపనులు, పారిశుధ్య పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఎస్ఎఫ్‌సీ నిధులు సిబ్బంది వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, ట్రాక్టర్ల కిస్తీల చెల్లింపు, డీజిల్ ఖర్చులకు వినియోగించాల్సి ఉంటుంది. చిన్న గ్రామపంచాయతీ నల్లగుంటపల్లిలో ఇద్దరు కార్మికులతో పారిశుధ్య నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. రెండురోజుల క్రితం మురుగు కాలువల్లోని పూడికను తొలగించి ట్రాక్టర్‌లో తరలించడంలో జాప్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత 11నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు పనులు చేసేందుకు సక్రమంగా ముందుకురావడం లేదని సర్పంచ్ వడ్లూరి సంతోషకిరణ్, పంచాయతీ కార్యదర్శి సుమన్ తెలిపారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నామని, డ్రైనేజీలో తీసిన పూడిక ఎండిన తర్వాత తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

దేశ సేవలో పాత్రులు కావాలి


వలంటీర్లతో వీసీ మల్లేశ్ తదితరులు

కరీంనగర్‌సిటీ: ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లోని (నార్కంద) అటల్ బిహారి వాజ్‌పేయి పర్వతారోహణ సంస్థ శిక్షణా శిబిరంలో శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని 10 మంది వలంటీర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని గురువారం ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేశ్ అభినందించి మాట్లాడారు. వలంటీర్లు ఇలాంటి శిక్షణా శిబిరాల్లో పాల్గొని మానసిక, శారీరక దృఢసంకల్పంతో దేశ సేవలో పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. కాగా వీరు డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు పర్వతారోహణ, ఇతర సాహస కార్యక్రమాల్లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉంటుందని జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఇ.మనోహర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, శిక్షణ శిబిరం కంటిన్జెంట్ లీడర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు విజయప్రకాష్, డాక్టర్ తిరుపతి, డి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహనచట్టం రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని లారీ డ్రైవర్లు సమ్మెబాట పట్టారు. గురువారం బొమ్మకల్ బైపాస్‌రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, కేంద్రం తెచ్చిన కొత్త చట్టం ప్రకారం ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశముందన్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణాలను పరిష్కరించకుండా ప్రభుత్వం డ్రైవర్లపై శిక్షలు పెంచడం సమంజసం కాదన్నారు. చట్టాన్ని రద్దు చేసేవరకు నిరవధిక ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే ఆరిఫ్‌మోయినొద్దీన్, ప్రతినిధులు శ్రీనివాసచారి, దస్తగిరి, షఫీ, భద్రయ్య, వెంకన్న, సురేందర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు


చామనపల్లిలో సమావేశమైన సభ్యులు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం కరీంనగర్ మండలంలోని చామనపల్లి, జూబ్లీనగర్, దుర్శేడ్, బహదూర్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా గ్రామ సర్పంచ్, కన్వీనర్‌గా అంగన్‌వాడీ టీచర్, సభ్యులుగా ఆశా కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బాలల తల్లిదండ్రులు, బాలల సంఘాల సభ్యులు, యువజన, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పోలీస్ అధికారి, వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శి, ఎస్ఎంసీ చైర్మన్, మతపెద్దలను ఎన్నుకున్నారు. బాల్యవివాహాలు జరగకుండా, బాలలందరూ పాఠశాలకు వచ్చేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల కోరారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు తప్పెట్ల భూమయ్య, గాజుల వెంకటమ్మ, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌రావు, ప్రభాకర్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ నగర అధ్యక్షుడిగా శ్రీకాంత్


నియామక పత్రం అందుకుంటున్న శ్రీకాంత్

కరీంనగర్‌కార్పొరేషన్: కాంగ్రెస్ సేవాదళ్ నగర అధ్యక్షుడిగా రాంనగర్‌కు చెందిన బుదవారపు శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ గురువారం నియామక ఉత్తర్వులు అందచేశారు. కరీంనగర్‌లో సేవాదళ్‌ను పటిష్టపరచాలని ఆ ఉత్తర్వులో సూచించారు.

ఎస్టీ సెల్ కార్యవర్గ విస్తరణ

కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ కార్యవర్గాన్ని గురువారం విస్తరించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా భూక్య ప్రేమ్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూడవత్ వినోద్‌నాయక్, కొత్తపల్లి మండల అధ్యక్షుడిగా లావుడియా సుధాకర్‌నాయక్, కొత్తపల్లి పట్టణ అధ్యక్షుడిగా కుతాటి శ్రీనివాస్ నియమితులయ్యారు. వీరికి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, పంజలా స్వామి గౌడ్, అమీర్, నాగప్రసాద్, లావుడియా రంగానాయక్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతలు పంపిణీ

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్‌లో రాములోరి అక్షింతల ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎడ్ల అంజిరెడ్డి, చంద్రశేఖర్, సాన సాయిప్రసాద్, ఇనుకొండ అశోక్‌రెడ్డి, సానగొండ అజయ్, బ్రహ్మం, కన్నం నర్సయ్య, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సంజయ్‌ను కలిసిన కిసాన్ మోర్చా నేతలు


బండి సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఇటీవల జాతీయ కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా గురువారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. పలు విషయాలు చర్చించారు. మోదీ ప్రభుత్వం రైతాంగ సంక్షేమ, అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలను, రైతాంగానికి అండగా నిలుస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు రైతాంగానికి తెలియజేయాలని సంజయ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కోఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ మోతె గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరడి శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, బోడ భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మందా దేవేందర్, ఈస్ట్ జోన్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాచర్ల కోటేశ్వర్, నాయకులు తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరాలయంలో కుడారై ఉత్సవం

కరీంనగర్‌కల్చరల్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కుడారై ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో కొన్న కాంతారెడ్డి తెలిపారు. అలాగే శనివారం ఉదయం 11 గంటల నుంచి గోదా రంగనాథ కల్యాణాన్ని జరుపనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


తీగలగుట్టపల్లిలో ఎరువుల బస్తాలు పరిశీలిస్తున్న ఏవో

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్‌లోని ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారి బి.సత్యం తనిఖీ చేశారు. వారంలో రెండు విడతలుగా మొత్తం 10 దుకాణాలను తనిఖీ చేయాలనే వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు మొదటి విడతగా తీగలగుట్టపల్లిలోని కేడీసీఎంఎస్, వల్లంపహాడ్‌లోని వాసవీ ఫర్టిలైజర్స్, నగునూరులోని ఆగ్రోస్ కేంద్రంలోని యూరియా, డీఏపీ ఎరువుల బస్తాల స్టాక్‌ను పరిశీలించారు. ఈ–పాస్ యంత్రాల ద్వారా పంపిణీ విధానాన్ని తనిఖీ చేశారు. ప్రతీవారం తనిఖీలు నిర్వహిస్తామని, డీలర్లందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులు విక్రయించాలని ఏవో సూచించారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి:: కరీంనగర్‌లో విద్యుత్ నూతన లైన్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల–మధ్యాహ్నం 12 గంటల వరకు ఐబీ చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, ఆక్సిస్ బ్యాంక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ.సర్వర్ తెలిపారు. 29 మందిని గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా ఒక వ్యక్తికి పది, మరొకరికి ఐదు, ఐదుగురికి మూడు రోజుల జైలుశిక్షతో పాటు, రూ.15,550 జరిమానా విధించారు. మిగితా 22 మందికి రూ.35 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఏసీపీ తెలిపారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

కరీంనగర్‌క్రైం: నగరంలోని లక్ష్మీనగర్‌లో పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని పట్టుకున్నారు. గురువారం కరీంనగర్ ఎస్పీ, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సీఐ సృజన్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, రవిలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల లోని తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు ఈనెల 12 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 7న 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 1న హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.









భద్రత కరువాయే.. సామగ్రి బరువాయే

విద్యార్థులకు సంక్రాంతి సెలవుల సంబరం లేకుండా చేస్తున్నారు నగరంలోని జ్యోతిబాపూలే వసతిగృహం నిర్వాహకులు. వసతిగృహంలో పిల్లల సామగ్రి తమ బాధ్యత కాదని, వారం రోజుల సెలవుల కోసం పెట్టా బేడా సర్దుకొని వెళ్లాలంటూ హుకూం జారీ చేయడంతో తల్లిదండ్రులు నానా తంటాలుపడ్డారు. పిల్లలను తీసుకెళ్లడానికి బైక్‌పై వచ్చిన తల్లిదండ్రులు పెట్టెలు, బ్యాగులు, బుక్కులు, బకెట్ల మోత కోసం ఆటోలు మాట్లాడుకోవాల్సి వచ్చింది. వారం పాటు సామగ్రిని కాపాడలేని నిర్వాహకులు పిల్లలను ఎలా చూసుకుంటున్నారో అంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



బొమ్మలరామారం పీహెచ్‌సీ నుంచి గాల్లో ఎగురుతున్న డ్రోన్

బీబీనగర్ ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు

- మర్యాల పీహెచ్‌సీ నుంచి టీబీ పేషెంట్‌ల కఫం నమూనాల సేకరణ
- భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు ఎయిమ్స్‌కు ట్రయల్‌రన్‌లో భాగంగా తరలింపు
- జనవరి 26 తర్వాత పూర్తిస్థాయిలో డ్రోన్ వినియోగం

సాక్షి, యాదాద్రి : డ్రోన్ సేవల వినియోగానికి బీబీనగర్ ఎయిమ్స్ సిద్ధమవుతోంది. గ్రామీణ ప్రాంత రోగులకు సత్వర వైద్య పరీక్షలు, మందులు అందించడానికి డ్రోన్ వాడుకోవాలని భావిస్తోంది. అందులో భాగంగానే గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ట్రయల్‌రన్‌లో భాగంగా డ్రోన్ విజయవంతంగా తన లక్ష్యాన్ని చేరుకుంది. టీబీ పేషెంట్‌ల కఫం నమూనాలను భువనగిరి జిల్లా ఆస్పత్రి, బీబీనగర్ ఎయిమ్స్ ల్యాబ్‌కు డ్రోన్ ద్వారా తరలించారు. ఎయిర్‌వేలో ఈ డ్రోన్ భువనగిరి జిల్లా ఆస్పత్రికి 5 నిమిషాల్లో, అక్కడ నుంచి బీబీనగర్ ఎయిమ్స్‌కు 10 నిమిషాల్లో చేరింది. జనవరి 26 తర్వాత డ్రోన్ సేవలు పూర్తిస్థాయిలో వినియోగించనున్నారు. ఇప్పటికే భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి బీబీనగర్ ఎయిమ్స్ వరకు డిసెంబర్ చివరివారంలో ఒక సారి ట్రయల్ రన్ నిర్వహించారు.

సంక్రాంతి ప్రయాణం సాఫీగా..

హైదరాబాద్-విజయవాడ హైవేపై జీఎంఆర్, పోలీసు యంత్రాంగం ముందుజాగ్రత్త చర్యలు

- 65వ నంబర్ జాతీయ రహదారిపై పండుగ సమయంలో విపరీతమైన రద్దీ
- ఏటేటా పెరుగుతున్న ఏపీకి రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య
- ట్రాఫిక్ నత్తనడక..టోల్‌ప్లాజాల వద్ద బారులు
- ఈసారి రోజుకు 75 వేలమంది వరకు ప్రయాణించే అవకాశం
- బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగు ఏర్పాట్లు చేసిన జీఎంఆర్ సంస్థ
- లైటింగ్, సైన్ బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టిన పోలీసులు

ఎమర్జెన్సీయా.. డయల్ 1033

చౌటుప్పల్, కోదాడ

సంక్రాంతి ప్రయాణం సాఫీగా సాగిపోయేందుకు జీఎంఆర్ సంస్థ, పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతున్నాయి. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పండగ వేళ ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఎక్కడెక్కడో ఉన్న ప్రజలు సంక్రాంతి పండుగకు తమ స్వస్థలాలకు వెళ్తారు. ముఖ్యంగా హైదరాబాద్, ఆ పరిసర ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లేవారితో 65వ నంబర్ హైవేపై విపరీతమైన రద్దీ ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ మినహా మిగతా అన్ని ప్రాంతాలకు రోడ్డు మార్గంలో వెళ్లే వారికి ఇదే ప్రధాన రహదారి. లెక్కకు మించిన వాహనాలు బారులు తీరడంతో సంక్రాంతి సమయంలో ఈ హైవేపై ట్రాఫిక్ నత్తనడకన సాగుతుంది. ఇక సంక్రాంతికి ముందు రోజైతే టోల్‌గేట్ల వద్ద గంటల తరబడి స్తంభించిపోతుంది. ఇక ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఇక అంతే. ఈ నేపథ్యంలో.. శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు దృష్టిలో ఉంచుకుని జీఎంఆర్ సంస్థ ఇప్పటికే తగు చర్యలు చేపట్టింది. మరోవైపు పోలీసులు కూడా అవసరమైన చర్యలు చేపట్టారు. కాగా స్వస్థలాలకు బయలుదేరిన ప్రయాణికులతో గురువారం నాడే హైవేపై రద్దీ పెరిగింది.

సొంత వాహనాలపైనే రాకపోకలు


సంక్రాంతి సమయంలో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాల సంఖ్య ప్రతిఏటా పెరుగుతోంది. గతంలో ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఎక్కువగా సొంత వాహనాల ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. రైళ్లు, బస్సుల్లోని రద్దీని తట్టుకోలేక కొందరు అద్దె వాహనాలను తీసుకొని స్వస్థలాలకు వెళ్లి వస్తుంటారు. దీంతో హైవేపై రద్దీ ఏర్పడుతోంది. గతేడాది సంక్రాంతి పండుగ సమయంలో రోజూ 55 నుంచి 60 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగించగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 70 నుంచి 75 వేల మధ్య ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించినప్పటికీ వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు 275 కి.మీ. దూరం ఉండగా అందులో చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం నుంచి కృష్ణా జిల్లా నందిగామ శివారు వరకు 181 కి.మీ. మేర టోల్‌రోడ్డు ఉంది. కాగా ఈ మార్గంలో ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్లు) చాలా ఉన్నాయి. ఆయా ప్రాంతాలను అధికారులు గుర్తించారు. దండుమల్కాపురం, ఖైతాపురం, ధర్మోజిగూడెం, చౌటుప్పల్, అంకిరెడ్డిగూడెం, పంతంగి, రెడ్డిబావి, పెద్దకాపర్తి, చిట్యాల, గోపలాయిపల్లి, ఏపీ లింగోటం, కట్టంగూర్, పద్మానగర్ జంక్షన్, ఇనుపాముల, కొర్లపహాడ్, టేకుమట్ల, చీకటిగూడెం, సూర్యాపేట శివారు (జనగామ క్రాస్‌రోడ్డు), మునగాల, ముకుందాపురం, ఆకుపాముల బైపాస్, కొమరబండ వై జంక్షన్ కట్టకొమ్ముగూడెం క్రాస్‌రోడ్డు, రామాపురం క్రాస్‌రోడ్డు, నవాబ్‌పేట, షేర్‌మహమ్మద్‌పేట ప్రాంతాలను ప్రధాన బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణకు లైటింగ్, సైన్ బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టారు. రేడియం స్టిక్కర్లతో కూడిన రోడ్ మార్జిన్ మార్కింగ్‌లూ వేశారు.

బ్లాక్‌స్పాట్ల వద్ద భద్రంగా వెళ్లాలి

ప్రతి 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్

సంక్రాంతి రద్దీని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జీఎంఆర్ సంస్థ ఎన్‌హెచ్‌ఏఐ, పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసింది. ప్రతి 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్‌తో కూడిన వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచుతోంది. కొన్ని ప్రాంతాల్లో భారీ క్రేన్‌లను సైతం అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్కో టోల్‌ప్లాజా పరిధిలో షిఫ్టుకు 20మంది చొప్పున అదనపు సిబ్బందిని జీఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసింది. ఈ హైవేపై పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు, కీసర ప్రాంతాల్లో టోల్‌ప్లాజాలు ఉన్నాయి. పోలీస్‌శాఖ ప్రతి టోల్‌ప్లాజా వద్ద 20 మంది పోలీస్‌లతో ప్రత్యేక టీమ్‌లను నియమించనుంది. రిస్క్ మేనేజ్‌మెంట్ టీమ్‌లను కూడా అందుబాటులో ఉంచనున్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఉన్నా 1033 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.



పెద్దఅంబర్‌పేట చెక్‌పోస్టు కూడలి వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

పెద్దఅంబర్‌పేట వద్ద రోడ్డు పనుల కారణంగా ఇరుకైన జాతీయ రహదారి

హయత్‌నగర్ శివారులో జాతీయ రహదారి ఇలా..

గత సంవత్సరం చౌటుప్పల్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

ధర్మోజిగూడెం గ్రామం వద్ద అత్యంత ప్రమాదకరమైన జంక్షన్

గత సంవత్సరం సంక్రాంతికి చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

కట్టంగూరు వద్ద ప్రమాదకరంగా ఉన్న నల్లగొండ క్రాస్ రోడ్డు

నకిరేకల్ వద్ద ప్రమాదకరంగా పద్మానగర్ జంక్షన్

ఆకుపాముల వద్ద ప్రమాదకరంగా రోడ్ క్రాసింగ్

కట్టకొమ్ము గూడెం క్రాస్‌రోడ్

పొద్దునే ప్రయాణం వద్దు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఉదయం పొగ మంచు అధికంగా ఉంటోంది. దీని వల్ల రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువ. ఉదయం పొగమంచు తగ్గిన తర్వాతే ప్రయాణాలు పెట్టుకోవాలని కూడా పోలీసులు చెపుతున్నారు. రహదారిపై ప్రమాదం జరిగే చాన్స్ ఉన్న ప్రదేశాలను ముందుగానే తెలుసుకుని జాగ్రత్తగా ప్రయాణించాలని పేర్కొంటున్నారు.

రోడ్డుపై వాహనాలు నిలపొద్దు


జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌ల వద్ద అధికారులు వేగాన్ని, వాహనాలను నియంత్రించడానికి స్పీడ్ కంట్రోల్ స్టాపర్లను, బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. తక్కువ వేగంతో ప్రయాణించడంతో పాటు రోడ్డుమీద ఉన్న స్పీడ్ స్టాపర్లను గమనించాలని, అతివేగంగా వెళ్లవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డుపై వాహనాలను నిలపవద్దని కోరుతున్నారు.

ఫాస్టాగ్ సరిచూసుకోండి

వాహనదారులు తమ వాహనాలకు ఫాస్టాగ్ వ్యాలిడిటీ ఉందో లేదో చూసుకోవాలి. సరిపడా నగదు ఉందో లేదో గమనించాలి. బ్లాక్‌లిస్టులో పడితే తిరిగి అప్‌డేట్ కావడానికి 24 గంటల సమయం పట్టే అవకాశం ఉంటుంది. అన్నీ సక్రమంగా ఉన్నా నగదు లేకపోతే టోల్ బూత్‌లోకి వెళ్లాక ఆ విషయం తెలిస్తే లైన్‌లోనే చిక్కుకోవాల్సి వస్తుంది. అప్పటికప్పుడు రీచార్జ్ చేసినా సేవలు అందుబాటులోకి రావడానికి సమయం పడుతుంది.

అక్కడ కాస్త జాగ్రత్త

అబ్దుల్లాపూర్ మెట్: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ నుంచి చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్ వరకు 24 కిలోమీటర్ల మేర విజయవాడ జాతీయ రహదారిని ఆరులేన్లుగా విస్తరించే పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి వనస్థలిపురం నుంచి దండుమల్కాపూర్ వరకు పనులు ప్రారంభంగా కాగా నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో మాత్రమే రోడ్డు విస్తరణ పూర్తి దశకు చేరుకుంది. చాలా చోట్ల రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో వాహనాల సంఖ్య పెరిగిన సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.



గురువారం రాత్రి చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు



హైదరాబాద్ – విజయవాడ హైవేపై ప్రమాదాల నివారణకు పెట్రోలింగ్ పెంచాం. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా, రాంగ్ రూట్, ఓవర్ స్పీడ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా పరిధిలో కొన్ని ప్రధాన బ్లాక్ స్పాట్స్ గుర్తించాం. ఇక్కడ ప్రమాదాలు సంభవించకుండా నిబంధనలు అమలు చేస్తున్నాం. స్పీడ్ లిమిట్ బ్లింక్ లైట్స్ ఏర్పాటుతో రోడ్డుపై లైనింగ్ వేస్తాం. హైవే వెంట ఉన్న గ్రామాల ప్రజలకు, రైతులకు రాంగ్ రూట్‌లో వెళ్లవద్దని చెబుతున్నాం.

-రాహుల్‌హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట జిల్లా



సురక్షిత ప్రయాణానికి తగిన ఏర్పాట్లు

సంక్రాంతి పండుగ రద్దీని ఇప్పటికే అంచనా వేశాం. ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

- శ్రీధర్‌రెడ్డి, జీఎంఆర్ సంస్థ మేనేజర్

క్లుప్తంగా...



ఎగ్జిబిషన్‌లో న్యాయ సేవల సహాయ కేంద్రం

సాక్షి, హైదరాబాద్: న్యాయ పరిష్కారంలో కక్షిదారులకు సేవలు అందించేందుకుగాను నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'న్యాయ సేవల సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని గురువారం జస్టిస్ శ్యామ్‌కోషి ప్రారంభించారు. చట్టాలు, జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ పథకాల గురించి ఇక్కడ వివరిస్తారని, కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, పరిపాలనాధికారి కలార్చన తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్స్‌కు బీఐఎస్ అవార్డు



కమలాపురం: సిమెంట్ తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్న భారతి సిమెంట్ పరిశ్రమకు చెందిన కమలాపురం మండలంలోని నల్లింగాయపల్లె యూనిట్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అవార్డు లభించినట్లు భారతి సిమెంట్స్ సీఎంవో సాయి రమేశ్, చీఫ్ మేనేజర్ వై.కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన బీఐఎస్ 77వ వార్షికోత్సవ సమావేశంలో బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ ఎంఏజీ వినోద్ నుంచి భారతి సిమెంట్స్ పరిశ్రమ అధికారులు అవార్డు అందుకున్నారు. అధికారుల సమష్టి కృషి ఫలితంగానే సంస్థకు ఈ అవార్డు వచ్చిందని సాయి రమేశ్, కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబుకు శిరోభారం

- సొంత జిల్లాలోనూ ఎదురీత.. కుప్పంలో ఓటమి ఖాయమని సర్వేల్లో తేటతెల్లం
- తిరుపతి, చిత్తూరుకు పార్లమెంట్ అభ్యర్థులు ఎక్కడ?.. మిగిలిన అసెంబ్లీ స్థానాలకు వేధిస్తున్న అభ్యర్థుల కొరత

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రజాభిప్రాయం.. సామాజిక న్యాయం

- 15 శాసనసభ, 6 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించిన జగన్
- మూడో జాబితాను ప్రకటించిన మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- మొత్తంగా 50 శాసనసభ, 9 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తల నియామకం
- ప్రజాభిప్రాయం, సామాజిక న్యాయం, మహిళలు, యువతకు పెద్దపీట
- గతంలో అగ్ర వర్ణాలకు కేటాయించిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు చోట్ల బీసీలు, రెండు చోట్ల మైనార్టీలకు అవకాశం
- గతంలో ఓసీలకు కేటాయించిన రెండు లోక్‌సభ స్థానాల్లో బీసీలకు అవకాశం
- 50 మంది సమన్వయకర్తల్లో ఎస్సీలు 14, ఎస్టీలు 3, బీసీలు 16, మైనార్టీలు 4, అగ్రవర్ణాలు 13

సాక్షి, అమరావతి: జన బలమే గీటు రాయిగా.. సామాజిక న్యాయం చేకూర్చడంలో మరో అడుగు ముందుకేస్తూ.. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ.. యువతకు ప్రాధాన్యమిస్తూ 15 శాసనసభ స్థానాలకు, 6 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడో జాబితాను ఖరారు చేశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియా పాయింట్‌లో గురువారం రాత్రి విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డిలు ఆ వివరాలను ప్రకటించారు. గత నెల 11న 11 శాసనసభ స్థానాలకు.. ఈ నెల 2న 24 శాసనసభ, 3 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను నియమిస్తూ జాబితలను విడుదల చేశారు. మొత్తం మూడు జాబితాల్లో కలిపి 50 శాసనసభ, 9 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను ప్రకటించారు. గత ఎన్నికల్లో ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నేత కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను సమన్వయకర్తగా నియమించారు. విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి గత ఎన్నికల్లో ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని పోటీకి పెట్టగా, ఇప్పుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీని సమన్వయకర్తగా నియమించారు. శ్రీకాకుళం లోక్‌సభ సమన్వయకర్తగా పేరాడ తిలక్(బీసీ)ను నియమించారు. మంత్రి గుమ్మనూరి జయరాం(బీసీ)ను కర్నూలు లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తిరుపతి లోక్‌సభ స్థానం(ఎస్సీ) సమన్వయకర్తగా, విజయవాడ లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా కేశినేని నానిలను నియమించారు.

బీసీలు, మహిళలు, మైనార్టీలకు పెద్దపీట

మూడు జాబితాల్లో 50 శాసనసభ స్థానాల సమన్వయకర్తలను పరిశీలిస్తే.. సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. గతంలో అగ్ర వర్ణాలకు చెందిన అభ్యర్థులను పోటీ పెట్టిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు స్థానాల్లో బీసీ, రెండు స్థానాల్లో మైనార్టీ వర్గానికి చెందిన వారిని సమన్వయకర్తలుగా నియమించారు. ఆరు శాసనసభ స్థానాలకు మహిళలను, 18 స్థానాల్లో యువతను సమన్వయకర్తలుగా నియమించారు. ఇక మొత్తమ్మీద 50 శాసనసభ స్థానాలకు ప్రకటించిన సమన్వయకర్తల్లో.. ఎస్సీలు 14, ఎస్టీలు 3, బీసీలు 16, మైనార్టీలు 4, ఇతర వర్గాలు 13 (రెడ్డి, కాపు, వైశ్య) మంది ఉన్నారు. ఇప్పటి వరకు ప్రకటించిన 9 లోక్‌సభ స్థానాల సమన్వయకర్తల్లో.. బీసీలు 6, ఒక ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక ఓసీ ఉన్నారు. పెడన శాసనసభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

కొత్త సమన్వయకర్తలు వీరే..

లోక్‌సభ స్థానం	సమన్వయకర్త
1.శ్రీకాకుళం	పేరాడ తిలక్ (బీసీ)
2.విశాఖపట్నం	బొత్స ఝాన్సీ (బీసీ)
3.ఏలూరు	కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ (బీసీ)
4.విజయవాడ	కేశినేని నాని
5.కర్నూలు	గుమ్మనూరి జయరాం (బీసీ)
6.తిరుపతి (ఎస్సీ)	కోనేటి ఆదిమూలం

శాసనసభ స్థానం పేరు	సమన్వయకర్త
1.ఇచ్ఛాపురం	పిరియా విజయ (బీసీ)
2.టెక్కలి	దువ్వాడ శ్రీనివాస్ (బీసీ)
3.చింతలపూడి (ఎస్సీ)	కంభం విజయరాజు
4.రాయదుర్గం	మెట్టు గోవిందరెడ్డి
5.దర్శి	బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
6.పూతలపట్టు (ఎస్సీ)	మూతిరేవుల సునీల్‌కుమార్
7.చిత్తూరు	విజయానందరెడ్డి
8.మదనపల్లి	నిస్సార్ అహ్మద్
9.రాజంపేట	ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
10.ఆలూరు	బూసినే విరూపాక్షి (బీసీ)
11.కోడుమూరు (ఎస్సీ)	డాక్టర్ సతీష్
12.గూడూరు (ఎస్సీ)	మేరిగ మురళి
13.సత్యవేడు (ఎస్సీ)	మద్దిల గురుమూర్తి
14.పెనమలూరు	జోగి రమేష్ (బీసీ)
15.పెడన	ఉప్పాల రాము (బీసీ)

తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తిని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్తగా, ఎమ్మెల్సీ మేరిగ మురళిని గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తగా, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఏపీఐఐసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డిని రాయదుర్గం, మాజీ ఎమ్మెల్యే మూతిరేవుల సునీల్ కుమార్‌ను పూతలపట్టు, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ విజయానందరెడ్డిని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

జెడ్పీ చైర్మన్‌లకు అవకాశం

శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియ విజయను ఇచ్ఛాపురం శాసనసభ స్థానం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా సీఎం జగన్ నియమించారు. ఇచ్ఛాపురం జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మను శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించారు. వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని రాజంపేట శాసనసభ స్థానం సమన్వయకర్తగా నియమించారు. చిప్పగిరి జెడ్పీటీసీ బూసినే విరూపాక్షిని ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

క్లీన్ స్వీప్ లక్ష్యం

ఏపీ సీఎం వైఎస్ జగన్ గత 56 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూ.2.45 లక్షల కోట్లు.. నాన్ డీబీటీ రూపంలో రూ.1.67 లక్షల కోట్లు.. వెరసి రూ.4.12 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చారు. రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం అందితే.. అందులో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉండటం గమనార్హం. గత 56 నెలల పాలనలో సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన వల్ల రాష్ట్రంలో ప్రతి రంగంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. ఆ మార్పు ప్రతి కుటుంబంలో, ప్రతి గ్రామంలో, ప్రతి నియోజకవర్గంలో కళ్లెదుట కన్పిస్తున్నప్పుడు 175కు 175 స్థానాల్లో విజయం సాధించడం సుసాధ్యమేనని పార్టీ శ్రేణులకు సీఎం వైఎస్ జగన్ మార్గనిర్దేశం చేశారు. ప్రతి ఇంటా చేసిన మంచిని ప్రజలకు చెప్పి.. జనంతో మమేకమవుతూ సమస్యలు పరిష్కరించడం ద్వారా వారి మనసులు చూరగొని.. మరింత మంచి చేయడానికి ప్రజలు ఆశీస్సులు కోరాలని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు మార్గ నిర్దేశం చేస్తూ వచ్చారు. ప్రజలతో మమేకం కాకుండా.. జనం మనసులు చూరగొనలేని వారికి టికెట్లు ఇవ్వలేనని ఆది నుంచి సీఎం వైఎస్ జగన్ తేల్చి చెబుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 175కు 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అవసరమైన స్థానాలకు సమన్వయకర్తలను నియమిస్తున్నారు.



జగనన్న తోడు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మరో మహిళా విప్లవం

'జగనన్న తోడు' లబ్ధిదారుల్లో 87.13% మంది నా అక్కచెల్లెమ్మలే: సీఎం జగన్

చిరువ్యాపారులకు తోడుగా.. దేశానికే దిక్సూచిలా పథకం అమలు

- జగనన్న తోడు 8వ విడతతో చిరు వ్యాపారులకు రుణాలు, వడ్డీ రీయింబర్స్ కింద రూ.431.58 కోట్లు నేరుగా ఖాతాల్లోకి జమ చేసిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: 'జగనన్న తోడు'ద్వారా చిరువ్యాపారులకు ప్రభుత్వం తోడుగా నిలుస్తూ మానవత్వానికి మరో పేరుగా నిలిచిందని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. ఈ పథకం దేశానికే దిక్సూచిలా నిలిచిందన్నారు. దేశం మొత్తం మీద 'పీఎం స్వనిధి'ద్వారా ఏడు శాతం వడ్డీకి రూ.10,220 కోట్ల రుణాలు ఇవ్వగా మన రాష్ట్రంలో జగనన్న తోడు కింద 16.73 లక్షల మంది చిరువ్యాపారులకు వడ్డీ లేకుండా రూ.3,373 కోట్లు రుణాలు అందచేశామని తెలిపారు. జగనన్న తోడు ద్వారా వరుసగా 8వ విడత చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం ఇస్తూ, పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికి రూ.10,000, అంతకు పైగా కలిపి 3,95,000 మంది చిరు వ్యాపారులకు రూ.417.94 కోట్ల వడ్డీలేని కొత్త రుణాలను సీఎం జగన్ అందచేశారు. మొత్తం 16,73,576 మంది లబ్ధిదారుల్లో ఈ విడతలో వడ్డీ రీయింబర్స్ కింద 5.81 లక్షల మందికి రూ.13.64 కోట్లను కూడా ప్రభుత్వం అందచేస్తోంది. ఈ రెండూ కలిపి మొత్తం రూ.431.58 కోట్లను ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం జగన్ మాట్లాడారు. ఆ వివరాలివీ..

దశాబ్దాల దుస్థితికి పరిష్కారం..

చిరువ్యాపారుల బతుకులు ఎలా ఉంటాయో మన కళ్లముందే కనిపిస్తున్నా ఆ కష్టాలను ఎలా కడతేర్చాలని ఎప్పుడూ, ఎవరూ ఇంతలా మనసుపెట్టి, ఆలోచన చేసి నిర్ణయాలు తీసుకోలేదు. వారు వ్యాపారం చేసుకోవడానికి కూరగాయలు, పనిముట్లు, ముడిసరుకు కోసం కనీసం వెయ్యి రూపాయిలు పెట్టుబడి అవసరం. రూ.1,000 అప్పు ఇస్తే ప్రైవేట్ వ్యాపారులు అప్పటికప్పుడే వడ్డీ కింద రూ.100 మినహాయించుకుంటారు. ఇలా రూ.10 వడ్డీకి వెయ్యి రూపాయలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. దశాబ్దాలుగా ఇలాంటి పరిస్థితి కనిపిస్తున్నా దీనికి పరిష్కారం చూపేందుకు ఎవరూ ముందుకు రాలేదు. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పరిస్థితి గురించి బ్యాంకర్లతో మాట్లాడాం. ఎలాంటి హామీ లేకుండా రూ.10 వేలు అప్పు ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. సకాలంలో తిరిగి చెల్లించేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ వడ్డీ భారం మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని ఒక భరోసా కల్పించాం. ఇవాళ జగనన్న తోడు 8వ విడతలో మరో 86,084 మంది చిరువ్యాపారులకు రూ.86 కోట్లు వడ్డీ లేని రుణాలుగా అందిస్తున్నాం. వీరితో పాటు గతంలో ఈ స్కీమ్ ద్వారా రుణాలు పొందిన 3.09 లక్షల మంది చిరువ్యాపారులకు రూ.332 కోట్ల రుణాలను రెన్యువల్ కూడా చేస్తున్నాం. మొత్తంగా ఈ కార్యక్రమం ద్వారా దాదాపు రూ.418 కోట్లను 3,95,000 మందికి ఇవాళ కొత్త రుణాలుగా అందిస్తున్నాం. అంతేకాకుండా గతంలో జగనన్న తోడు స్కీం ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 5,80,968 మంది లబ్ధిదారులకు వడ్డీ కింద రూ.13.64 కోట్లను తిరిగి వారికి ఇస్తున్నాం.

> 'జగనన్న తోడు'ద్వారా మహిళా సాధికారత, సామాజిక సాధికారతలో మరో విప్లవాన్ని సాధించాం. పథకం ద్వారా లబ్ధి పొందిన మొత్తం 16.73 లక్షల మంది చిరు వ్యాపారుల్లో 87.13 శాతం మంది నా అక్క చెల్లెమ్మలే కావడం, అందులోనూ 79.14 శాతం మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉండటం దీనికి నిదర్శనం. పారదర్శకంగా రుణాలిప్పించడంతో పాటు అంతే స్థాయిలో సకాలంలో తిరిగి చెల్లింపులు చేయించగలుగుతున్నాం. తద్వారా రుణాల రికవరీ 95 శాతానికిపైగా ఉంది. రికవరీ బాగుండటంతో మళ్లీ రుణాలు అందుతున్నాయి. ఇదంతా ఒక చక్రం మాదిరిగా కొనసాగుతోంది. సాధికారత విషయంలో ఇది చాలా పెద్ద అచీవ్‌మెంట్.
>
> - ఏపీ సీఎం జగన్

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 12-1-2024

పండగ ఫ్యాషన్



పండగ అనగానే సంప్రదాయ చీరకట్టుతో పాటు అమ్మాయిలకు ముందుగా గుర్తొచ్చేది లంగా ఓణీ పట్టుతో డిజైన్ చేసినా, జార్జెట్‌తో సింగారించినా చీరనే ఓణీలా చుట్టినా, కొంగును మాత్రమే కుచ్చిళ్లుగా మార్చినా నడుం పట్టీతో కట్టినా.. వడ్డాణంతో మెరిపించినా ఆధునికపు సొబగులు ఎన్ని అద్దుకున్నా సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలకడానికి తెలుగింటి అలంకారమైన హాఫ్ శారీ డిజైన్స్‌తో ఫుల్ జోష్‌ని నింపచ్చు.

హాఫ్ శారీ ఫుల్ జోష్

ప్లెయిన్ లెహంగాపైన పట్టుచీరను ఓణీలా చుట్టడం ఓ కళ.

నెమలి పింఛాన్ని తలపించేలా చీర ఫ్రిల్స్‌ను లెహంగాపైన బ్యాక్ సైడ్ డిజైన్ చేయడం అందమైన హంగు.



- పెద్దంచు లెహంగాలు పండగకు రెట్టింపు కళను జోడిస్తాయి.
- ఆల్ ఇన్ వన్ ఒకే అంచులున్న ఒకేరంగు కాంబినేషన్ లంగా ఓణీ బ్లౌజ్ డిజైన్ మరో ఆకర్షణ.
- పట్టు లెహంగాకి కాంట్రాస్ట్ హ్యాండ్లూమ్ దుపట్టా అదనపు హంగును తీసుకు వస్తుంది.
- సిల్క్ లేదా జార్జెట్ మెటీరియల్‌పై డిజిటల్ ప్రింట్‌తో తీర్చిదిద్దిన లెహంగా డిజైన్స్ ఆధునికపు సొబగను తీసుకువస్తాయి.
- దుపట్టా అంచులను బ్లౌజ్‌కు అటాచ్ చేస్తూ. వడ్డాణంతో మెరిపిస్తే మరో కొత్త ఆకర్షణ.

మన పండుగ రుచి

వంటిల్లు

అరిశెలు చేసుకున్నాం. అవి ఎన్ని ఉన్నా సరే! పండుగ రోజు తాజాగా ఏమైనా చేయాల్సిందే. దేవుడికి బెల్లం పొంగలి... గోధుమ అప్పాలు... పూర్ణం బూరెలు... గారెలతో నైవేద్యం పెడదాం. మధ్యాహ్నం పండుగ భోజనాన్ని ఆరగిద్దాం. సాయంత్రం టీలోకి సకినాలను కరకరలాడిద్దాం.

పూర్ణం బూరెలు



కావలసినవి: మినప్పప్పు – రెండు కప్పులు; బియ్యం– నాలుగు కప్పులు; ఉప్పు – చిటికెడు; నూనె – వేయించడానికి తగినంత.

పూర్ణం కోసం... బెల్లం – పావుకిలో; శనగపప్పు – కప్పు; ఏలకుల పొడి– టీ స్పూన్

తయారీ: ● బియ్యం, మినప్పప్పును కడిగి మూడు గంటల సేపు మంచి నీటిలో నానబెట్టాలి. ● శనగపప్పు కడిగి పది నిమిషాలు నానిన తర్వాత ప్రెషర్ కుక్కర్‌లో రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ఉడికిన పప్పును వడపోసి నీరంతా కారిపోయేవరకు ఉంచాలి. శనగపప్పు వేడి తగ్గిన తర్వాత గరిటెతో మెత్తగా చిదమాలి. అందులో బెల్లం పొడి వేసి స్టవ్ మీద పెట్టి గరిటెతో కలుపుతూ సన్న మంట మీద ఉడికించాలి. మిశ్రమం దగ్గరైన తర్వాత ఏలకుల పొడి కలిపి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత పూర్ణాన్ని చిన్న గోళీలు చేసుకోవాలి. ● నానిన మినప్పప్పు, బియ్యాన్ని మెత్తగా రుబ్బాలి. గ్రైండ్ చేసేటప్పుడు ఉప్పు కలపాలి. పిండి మరీ పలుచగా ఉంటే పూర్ణానికి పట్టదు. గారెల పిండి కంటే వదులుగా... పూర్ణం ముంచి తీయడానికి తగినట్లు ఉండేలా చూసుకోవాలి. ● బాణలిలో నూనె మరిగించి పూర్ణం గోళీని మినప్పిండి మిశ్రమంలో ముంచి నూనెలో వేయాలి. ఇది చాలా నైపుణ్యంగా చేయాల్సిన పని. మినప పిండి పూర్ణం గోళీ అంతటికీ సమంగా ఒకే మందంలో పట్టాలి. నూనెలో వేసేటప్పుడు కానీ, కాల్చేటప్పుడు కానీ మినప్పిండి కవర్ నుంచి పూర్ణం బయటకు రాకూడదు. బూరెలు దోరగా కాలిన తర్వాత నూనెలో నుంచి తీసేయాలి. **గమనిక:** పూర్ణం పై పొరకు మినప్పప్పు మిశ్రమానికి బదులు మైదాపిండి కూడా వాడవచ్చు. మైదాపిండిలో తగినంత నీటిని పోస్తూ కలుపుకోవడమే. మరీ వదులుగా అనిపిస్తే మరికొంత పిండి వేసుకోవాలి. మరీ చిక్కగా ఉంటే మరికొంత నీటిని కలపాలి. కొత్తగా నేర్చుకునే వాళ్లు మైదాతో ప్రయత్నించడమే మంచిది.

మినప గారెలు



కావలసినవి: మినప్పప్పు – అర కేజీ; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; ఉప్పు – రుచికి తగినంత; నూనె– అర కేజీ.

తయారీ: మినప్పప్పు, శనగపప్పును శుభ్రంగా కడిగి మంచి నీటిలో నాలుగు గంటల సేపు నానబెట్టాలి. నానిన తర్వాత నీటిని వంపేసి గ్రైండర్‌లో కొంచెం పలుకుగా రుబ్బాలి.

బాణలిలో నూనె వేడి చేసి మినప్పప్పు మిశ్రమాన్ని బత్తాయి కాయ పరిమాణంలో తీసుకుని పాలిథిన్ పేపర్ మీద కానీ అరచేతిలో కానీ వేసి వేళ్లతో జాగ్రత్తగా వత్తి మధ్యలో చిల్లు పెట్టాలి. గారె మొత్తం ఒకటే మందంలో ఉండాలి, ఆకారం నిండు చంద్రుడిలా ఉండాలి. ఇలా చేసిన తర్వాత నూనెలో వేయాలి. రెండు వైపులా ఎర్రగా కాలిన తర్వాత నూనెలో నుంచి తీసేయాలి. నూనెలో నుంచి తీసిన పది నిమిషాలకు వేడి అమరి కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

సకినాలు



కావలసినవి: కొత్త బియ్యం– పావు కేజీ; వాము– టీ స్పూన్; జీలకర్ర పొడి– టీ స్పూన్; నువ్వులు– 50 గ్రాములు; ఉప్పు– రుచికి తగినంత; నూనె– వేయించడానికి తగినంత

తయారీ: బియ్యాన్ని కడిగి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం నీటిని వంపేసి మెత్తగా పిండి దంచాలి. పిండిని నూక లేకుండా జల్లించి అందులో వాము, జీలకర్ర, నువ్వులు, ఉప్పు వేసి కలపాలి. ఈ పొడిలో తగినంత నీటిని పోస్తూ ముద్దలా కలుపుకోవాలి. ●కాటన్ క్లాత్‌ను తడిపి పలుచగా పరిచి, పిండిని చేతిలోకి వేళ్లతో సకినాల ఆకారంలో క్లాత్ మీద వేసి పది నిమిషాల సేపు ఆరనివ్వాలి. ఈ లోపు బాణలిలో నూనె వేడి చేయాలి. నూనె కాగిన తర్వాత ఆరిన సకినాన్ని నూనెలో వేసి రెండువైపులా దోరగా కాలనిచ్చి తీసేయాలి.

బెల్లం పొంగలి



కావలసినవి: కొత్త బియ్యం – పావు కేజీ; శనగపప్పు – పావు కప్పు లేదా గుప్పెడు; బెల్లం పొడి – పావు కేజీ; పాలు – అర లీటరు; నెయ్యి – అర కప్పు; పచ్చ కర్పూరం– చిటికెడు; ఏలకుల పొడి– అర టీ స్పూన్; కిస్‌మిస్– గుప్పెడు; జీడిపప్పు – 20 పలుకులు.

తయారీ: బియ్యం, శనగపప్పును శుభ్రంగా కడిగి అర లీటరు నీటిని పోసి పక్కన ఉంచాలి. ● ఒక మందపాటి పాత్రలో నెయ్యి వేడి చేసి కిస్‌మిస్, జీడిపప్పు వేయించి పక్కన పెట్టాలి. ● ఒక పాత్రలో పాలను మరిగించి పక్కన ఉంచాలి ● బియ్యం పాత్రను స్టవ్ మీద పెట్టి ఉడికించాలి. బియ్యం ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత అందులో పాలు పోసి కలపి మంట తగ్గించి ఉడికించాలి. అన్నం ఉడికిన తర్వాత బెల్లం పొడి వేసి కలిపి సన్న మంట మీద కలియబెడుతూ ఉడికించాలి. బెల్లం కరిగి దగ్గరపడే వరకు అడుగు పట్టకుండా కలుపుతూ ఉండాలి. బెల్లం రుచి అన్నానికి పట్టిన తర్వాత ఏలకుల పొడి, పచ్చ కర్పూరం పొడి వేసి సువాసన సమంగా కలిసే వరకు పొడవు గరిటెతో అడుగు నుంచి కలపాలి. చివరగా నెయ్యితోపాటు కిస్‌మిస్, జీడిపప్పు వేసి కలిపి దించేయాలి. పొంగలి చల్లారే కొద్దీ గట్టిపడుతుంటుంది. కాబట్టి గరిట జారుడుగా ఉన్నప్పుడే దించాలి.

గోధుమ అప్పాలు



కావలసినవి: గోధుమ పిండి – పావు కేజీ; మైదా పిండి– టేబుల్ స్పూన్; బెల్లం పొడి – పావు కేజీ; ఏలకుల పొడి – అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత

తయారీ: బెల్లం పొడిలో నీటిని పోసి కరిగిన తర్వాత ఏలకుల పొడి, గోధుమపిండి, మైదా వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. పిండి కలిపిన వెంటనే అప్పాలు చేస్తే సరిగ్గా పొంగవు. కాబట్టి కలిపిన తర్వాత పిండి నానాలి. ● ఇప్పుడు బాణలి స్టవ్ మీద పెట్టి నూనె వేడెక్కిన తర్వాత చిన్న నిమ్మకాయంత పిండి తీసుకుని అరచేతిలో వేసి వేళ్లతో పలుచగా వత్తి నూనెలో వేయాలి. తిరగేసి రెండు వైపులా దోరగా కాలిన తర్వాత తీసేయాలి.

గమనిక: ఎవరి రుచిని బట్టి వాళ్లు బెల్లం మోతాదు మార్చుకోవాలి. ● గోధుమ పిండిలో మైదా కలిపేది అప్పం విరిగిపోకుండా ఉండడానికి మాత్రమే. కొత్తగా నేర్చుకునే వాళ్లు మైదా కలుపుకుంటేనే మంచిది. ● ఎక్కువ నూనె వద్దనుకుంటే పెనం మీద టీ స్పూన్ నెయ్యి వేసి కాల్చుకోవచ్చు. నేతితో చేసిన అప్పం రుచికి మరేదీ సాటి రాదు.

● ముగ్గు-ముచ్చట





సంజీవని జ్యోతి
తాండూర్
వికారాబాద్

26 చుక్కలు
26 వరుసలు
సరి చుక్క





చందూరు
తన్మయి
హైదరాబాద్

18 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు
సరి చుక్క





ఎస్. లావణ్య
నరేష్
హైదరాబాద్

18 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు





ఎ. మహాలక్ష్మి
టాటానగర్
బెంగళూరు

25 చుక్కలు
13 వచ్చేవరకు
మధ్య చుక్క





కె. సుభాషిణి
బ్రాడీపేట,
గుంటూరు

19 చుక్కలు
10 వరుసలు
సరి చుక్క





హర్షిత
నాగొడ్డివల్లె
అన్నమయ్య జిల్లా

10 చుక్కలు
10 వరుసలు
సరి చుక్క





వై. అమృత
శ్రీవల్లి
కడప,
వైఎస్సార్ జిల్లా

21 చుక్కలు
1 వచ్చేవరకు
సరి చుక్క





ఆర్. ఇందిర
వెలమవారి వీధి,
బొబ్బిలి

21 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు

● యంగ్ టాలెంట్

ఫ్యామిలీ ఆఫ్ సీఏ


● సంస్కృతి ● శ్రుతి

చార్టర్డ్ ఎకౌంటెంట్స్ (సీఏ) ఫైనల్ ఎగ్జామినేషన్‌లో ఇరవై రెండు సంవత్సరాల ముంబై ట్విన్స్ సంస్కృతి, శ్రుతి ఆల్-ఇండియా టాప్ టెన్ ర్యాంకుల జాబితాలో చోటు సాధించారు. సంస్కృతి రెండో ర్యాంక్, శ్రుతి ఎనిమిదో ర్యాంకు సాధించింది. పరీక్షలు వస్తున్నాయంటే సాధారణంగా చాలామందిలో ఉండే భయం ఈ ట్విన్ సిస్టర్స్‌లో ఉండేది కాదు. పరీక్షలంటే వారికి పండగతో సమానం. ఆ ఇష్టమే వారిని ఎప్పుడూ విజేతలుగా నలుగురిలో గుర్తింపు తెస్తోంది. ఇద్దరికీ కొరియన్ సినిమాలు చూడడం, బ్యాడ్మింటన్ ఆడడం అంటే ఇష్టం. ఈ ట్విన్ సిస్టర్స్ కుటుంబాన్ని 'ఫ్యామిలీ ఆఫ్ సీఏ' అని పిలుస్తున్నారు. ఎందుకంటే నాన్న, అన్నయ్య, వదిన కూడా సీఏ చేశారు. 'పరీక్షల కోసం నేను శ్రుతి కలిసి చదువుకున్నాం. ఏ డౌట్ వచ్చినా నాన్న, అన్నయ్య అందుబాటులో ఉండేవాళ్లు. కఠినమైన పోటీ పరీక్షలు ఎదుర్కోవడానికి ఈ రకమైన సపోర్టింగ్ సిస్టమ్ అవసరం' అంటుంది సంస్కృతి.



ఇరవై ఏళ్ల వయసు దాటని వారు ఏదైనా కీలక నిర్ణయం తీసుకోవడానికి రెడీ అవుతున్నప్పుడు 'ఈ వయసులో ఎందుకు?' అనే మాట వినిపించడం సాధారణం.

కైవల్య వోహ్రా, అదిత్ పలిచా 'జెప్టో' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టినప్పుడు కూడా ఇలాంటి మాటలు కాస్త గట్టిగానే వినబడ్డాయి.

అయితే ఈ మిత్రద్వయం వెనక్కి తగ్గలేదు. 'జెప్టో'తో సూపర్ హిట్ కొట్టింది. 'సక్సెస్‌కు వయసుతో పనిలేదు' అని మరోసారి నిరూపించింది.

ఆన్‌లైన్ గ్రాసరీ డెలివరీ ప్లాట్‌ఫామ్ 'జెప్టో' సూపర్ సక్సెస్ కావడమే కాదు యూనికార్న్ స్టేటస్ సాధించింది. నడక నుంచి పరుగు వరకు 'జెప్టో' నుంచి యువతరం నేర్చుకోవాల్సిన పాఠాలు ఎన్నో ఉన్నాయి....

పాఠం నెం 1: క్లారిటీ

స్టాన్‌ఫర్డ్‌లో కంప్యూటర్ సైన్స్ చదువును వదిలేసి స్వదేశానికి తిరిగి వచ్చిన కైవల్య, అదిత్‌ల ముందుకు వచ్చి నిలబడిన ప్రశ్న...'మీరు ఏం చేయాలనుకుంటున్నారో క్లారిటీ ఉందా?' హండ్రెడ్ పర్సంట్. లాక్‌డౌన్ సమయంలో వచ్చిన ఐడియాను స్టార్టప్ రూపంలో రోడ్డు ఎక్కించాలంటే ఉత్సాహం మాత్రమే సరిపోదు. సబ్జెక్ట్‌పై క్లారిటీ ఉండాలి. దీని కోసం ఇ-కామర్స్ ఇండస్ట్రీకి సంబంధించిన సమాచారాన్ని కాచి వడబోసినంత పని చేశారు కైవల్య, ఆదిత్‌లు.

పాఠం నెం 2: నమ్మకం

చిన్న వయసు కావడం వల్ల కైవల్య, అదిత్‌లను ఇన్వెస్టర్‌లు నమ్మడం అంత తేలికైన విషయం కాదు. ఫండింగ్ విషయంలో ఇది ఇబ్బందిగా మారుతుంది. 'మీకు ఎలాంటి అనుభవం లేదు కదా. ఎలా నమ్మడం?' అంటారు. అయితే సక్సెస్ అన్ని సమస్యలకు జవాబు చెబుతుంది. మనపై ఇతరులకు నమ్మకం కలిగిస్తుంది. తొలి అడుగుల్లోనే 'జెప్టో' గెలుపు జెండా ఎగరేయడం వల్ల ఫండింగ్ విషయంలో ఇబ్బంది కాలేదు.

పాఠం నెం 3: ధైర్యం

'ఈ పని రాదు అని మేము ఎప్పుడూ భయపడలేదు. ఎందుకు రాదు...ప్రయత్నించి చూద్దాం అనుకొని ముందుకు వెళ్లాం. ఈ క్రమంలో పెద్ద కంపెనీల నుంచి పోటీ ఎదురైంది. ఆ పోటీ నుంచి కూడా ఎన్నో విషయాలను నేర్చుకున్నాం. మేము భయం దగ్గరే ఆగిపోయి ఉంటే మా ప్రయాణం కొనసాగేది కాదు' అంటాడు 'జెప్టో' కో-ఫౌండర్, సీయివో కైవల్య వోహ్రా. స్టార్టప్ మొదలు పెట్టినప్పుడు పెద్ద కంపెనీలతో పోల్చి మాట్లాడుతుంటారు చాలామంది. వారి మాటలకు చిక్కితే భయమే మిగులుతుంది. భయం అనేది అపజయానికి క్లోజ్ ఫ్రెండ్.

పాఠం నెం 4: టీమ్ స్ట్రెంత్

స్టీవ్ జాబ్స్‌ను అభిమానించే కైవల్య, అదిత్‌లకు ఆయన నోటి నుంచి వచ్చిన 'వ్యాపారంలో గొప్ప విజయాలు అనేవి ఒక వ్యక్తి వల్ల వచ్చేవి కాదు. అది సమష్టి కృషి' అనే మాట తెలియనిదేమీ కాదు. అందుకే తమ మీద తమకు ఆత్మవిశ్వాసం ఉన్నా అది హద్దులు దాటకుండా చూసుకున్నారు. టీమ్ స్ట్రెంత్‌ను నమ్ముకున్నారు. వారి నుంచి సలహాలు తీసుకున్నారు.

పాఠం నెం 5: రీసెట్ డీఎన్‌ఏ

తమ కంపెనీ తక్కువ టైమ్‌లోనే ఘన విజయాన్ని సాధించిన సంతోషంలో 'జెప్టో స్పీడ్' అనే టర్మ్‌ను కాయిన్ చేశాడు 'జెప్టో' కో-ఫౌండర్, సీయివో అదిత్ పలిచా. అయితే ఈ జెప్టో స్పీడ్‌కు స్పీడ్ బ్రేకర్లు ఎదురొచ్చిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి క్లిష్ట సమయాల గురించి అదిత్ పలిచా ఇలా స్పందిస్తాడు 'మరింత క్రమశిక్షణతో ఉండాలనుకున్న సమయం, సుస్థిరమైన ఎదుగుదల మార్గాలపై మరింత దృష్టి పెట్టాలని అనుకున్న సమయం, కంపెనీ డీఎన్‌ఏను రీసెట్ చేయాలనుకున్న సమయం అది.'




● బ్లూ వేల్ నాలుక బరువు ఏనుగంత ఉంటుంది ● జెల్లీఫిష్‌లో 95 శాతం నీరే! ● 68 శాతం మంది ఫాంటమ్ వైబ్రేషన్ సింబ్రోమ్‌కు గురవుతున్నారు. పాకెట్‌లోని మొబైల్ మోగకపోయినా మోగినట్లు భ్రమించడమే ఫాంటమ్ వైబ్రేషన్ సింబ్రోమ్ ● చర్మ సంరక్షణ ప్రచారంలో భాగంగా నివియా కంపెనీ 'నివియా డాల్'కు రూపకల్పన చేసింది. ఈ బొమ్మకు సన్‌స్క్రీన్ లేకపోతే కాలిపోతుంది. చర్మసంరక్షణ గురించి పిల్లల్లో అవగాహన కలిగించడానికి యూవీ-సెన్సిటివ్ మెటీరియల్స్‌తో ఈ బొమ్మను తయారుచేశారు.

రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ 'లైక్ ఏ డ్రాగన్: ఇన్ఫినెట్ వెల్త్' ఈ నెల 26న విడుదల కానుంది, 'లైక్ ఏ డ్రాగన్ సిరీస్'లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. టర్న్-బేస్డ్ కంబాట్ సిస్టమ్‌తో కూడిన ఈ గేమ్‌లో ప్లేయర్స్ కసుగ, కిర్యూ అనే పాత్రలను నియంత్రిస్తారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఆర్‌జీ స్టూడియో ఈ గేమ్‌కు సంబంధించిన కథ, క్యారెక్టర్లు, గేమ్‌ప్లే ఫీచర్‌లను ట్రైలర్‌ల ద్వారా పరిచయం చేసింది. తాజా గేమ్‌లో గత డ్రాగన్ గేమ్స్‌కు సంబంధించి ఎన్నో క్యారెక్టర్లు కనిపిస్తాయి. ఉదా: గోరో మజీమా, తైగా సెజిమా, డైగో డోజిమా. ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, జానర్: రోల్-ప్లేయింగ్ మోడ్: సింగిల్ ప్లేయర్

దమ్ముతో దూసుకుపోవాల్సిందే!





క్వియర్ ఫిష్

ఒక వ్యక్తి ప్రవర్తన, స్వభావం వింతగా, అసాధారణంగా ఉన్నప్పుడు వాడే మాట...క్వియర్ ఫిష్.

ఉదా: సునీల్, యువర్ గ్రేట్ గ్రాండ్‌ఫాదర్ వాజ్ ఏ క్వియర్ ఫిష్. హీ యూజ్‌డ్ టు రైట్ ఫన్నీ పోయెమ్స్ అండ్ దెన్ హీ హ్యాడ్ రీడ్ దెమ్ ఎలౌడ్ టు ఎవ్రీవన్ ఆన్ ది ట్రైన్ ఆన్ హిజ్ వే టు వర్క్.

బిహైండ్ ది ఎయిత్ బాల్

ఇతరులతో పోల్చితే అస్తవ్యస్తమైన పరిస్థితులు, కష్టనష్టాలతో ఉన్నప్పుడు వాడే మాట... బిహైండ్ ది ఎయిత్ బాల్.

ఉదా: మెనీ ఫ్యామిలీస్ ఇన్ దిస్ కంట్రీ ఆర్ స్టిల్ బిహైండ్ ది ఎయిత్ బాల్ అండ్ డోన్ట్ ఎంజాయ్ ది సేమ్ స్టాండర్డ్ ఆఫ్ లివింగ్ దట్ అదర్ పీపుల్ ఎంజాయ్.

యువర్స్

● టెక్.. టాక్

ఆసుస్ రోగ్ ఫోన్ 8



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
బ్యాటరీ: 5,500 ఎంఏహెచ్
రిఫ్రెష్ రేట్: 165 హెచ్‌జడ్
బరువు: 225 గ్రా.
రిజల్యూషన్: 1080x2400 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 14
కలర్స్: రెబెల్ గ్రే, ఫాంటమ్ బ్లాక్

శాంసంగ్ గెలాక్సీ ఎస్ 24 అల్ట్రా



సైజ్: 6.8 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 14
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
ర్యామ్(జీబి): 12
రిజల్యూషన్: 1440x3088 పిక్సెల్స్
ఇంటర్నల్: 256 జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్

ఇన్‌స్టాలో నచ్చిన పోస్ట్‌ల కోసం...



ఇన్‌స్టాగ్రామ్‌లో (ఆండ్రాయిడ్ అండ్ ఐఫోన్)లో మీకు నచ్చిన పోస్ట్‌లు, కామెంట్ చేసిన పోస్టులను చూడడానికి...

1) ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేసిన తరువాత బాటమ్ రైట్ కార్నర్‌లోని ప్రొఫైల్ పిక్చర్‌ని ట్యాప్ చేయాలి. 2) టాప్‌రైట్ కార్నర్‌లోని మూడు హారిజంటల్ లైన్స్ ట్యాప్ చేయాలి 3) యాక్టివ్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి 4) లైక్స్ ఆప్షన్ ట్యాప్ చేయడం ద్వారా మీకు నచ్చిన పోస్ట్‌లు, చేసిన కామెంట్స్ చూడవచ్చు.

కంప్యూటర్‌లో: ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌లో లాగిన్ అయిన తరువాత బాటమ్ లెఫ్ట్ కార్నర్‌లోని 'మోర్ ఆప్షన్స్' క్లిక్ చేయాలి 2. యువర్ యాక్టివిటీ ఆప్షన్-క్లిక్ 3. ఇంటరాక్షన్ అప్షన్-క్లిక్ 6. లైక్స్ ఆప్షన్-క్లిక్

ర్యాబిట్ ఆర్1



హాఫ్-ఫ్లిప్ ఫోన్‌లా కనిపించే ఈ పాకెట్ సైజ్ పరికరంలో ఫోటోలు, వీడియోలను కాప్చర్ చేసే రొటేటింగ్ కెమెరా ఉంటుంది. బిల్ట్-ఇన్ వాయిస్ అసిస్టెంట్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లే మాట్లాడవచ్చు. మెసేజ్‌లను సెండ్ చేయవచ్చు. స్పాటిఫైలాంటి సర్వీసుల కోసం యూజ్ చేయవచ్చు. ఇందులో రెండు మైక్రోఫోన్లు, ఒక స్పీకర్ ఉంటుంది. 2.88 అంగుళాల ఎల్‌సీడీ టచ్ స్క్రీన్ ఉన్న ఈ పరికరాన్ని 'ర్యాబిట్' అనే స్టార్టప్ రూపొందించింది. వాయిస్ కమాండ్స్‌ను ఉపయోగించి ఈ డివైజ్‌ను కంట్రోల్ చేయవచ్చు.

సినిమా


● 'అన్నపూర్ణి'లో నయనతార

అన్నపూర్ణి ఆగింది

బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అన్నపూర్ణికి దేశంలోనే నంబర్ వన్ చెఫ్ కావాలన్నది ఆశయం. తన ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి మాంసాహార వంటలు చేసేందుకు సిద్ధం అవుతుంది. అది మాత్రమే కాదు.. ముస్లిమ్ యువకుడితో ప్రేమలో పడుతుంది. నయనతార టైటిల్ రోల్‌లో నటించిన 'అన్నపూరణి' చిత్రం ప్రధానాంశం ఇది. 'ది గాడెస్ ఆఫ్ ఫుడ్' అనేది ఉపశీర్షిక. నీలేష్ కృష్ణ దర్శకత్వంలో జతిన్ సేథీ, ఆర్. రవీంద్రన్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న థియేటర్లలో విడుదలై, అంతగా ఆకట్టుకోలేకపోయింది. అయితే ఓటీటీ ప్రేక్షకులను కొంత ఆకట్టుకోగలిగింది. ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. కానీ ఓ బ్రాహ్మణ యువతి మాంసాహారం వండటం, ముస్లిమ్ యువకుడితో ప్రేమలో పడటం అనే కథాంశం వివాదమైంది. పైగా రాముడు కూడా మాంసాహారం తిన్నాడన్నట్లు, వాల్మీకి అయోధ్య కాండలో ఉందన్నట్లు ఓ డైలాగ్ కూడా ఉంది. ఓ దేవత (అన్నపూర్ణ) మీద టైటిల్ పెట్టి ఇలాంటి సినిమా తీయడం తగదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దాంతో ఈ చిత్రాన్ని బ్యాన్ చేయాలని కొందరు బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ మొదలుపెట్టారు. అలాగే మహారాష్ట్రకు చెందిన శివసేన మాజీ నేత రమేశ్ సోలంకి ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌పై తగిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నయనతారపై కూడా కేసు నమోదైంది. వివాదం పెద్దదవుతుండటంతో ఈ సినిమా స్ట్రీమింగ్‌ను నిలిపివేస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఆ విధంగా ఓటీటీలో 'అన్నపూరణి' ఆట ఆగింది.

వివేకానందగారి బయోపిక్‌కి స్క్రిప్ట్ కుదరడం లేదు. నేను, నాని ఓ సినిమా చేయబోతున్నామా అంటే.. నానీతోనే కాదు.. నేను అందరితో కలిసి సినిమాలు చేయాలనుకుంటున్నాను. నా తర్వాతి సినిమా కోసం మూడు కథలు విన్నాను. తర్వలో చెబుతాను.



కొన్ని వాటంతటవే కుదురుతాయి

- వెంకటేశ్

"నా 75వ సినిమా కాబట్టి 'సైంధవ్' నాకు స్పెషల్ ఫిల్మ్ అనేం కాదు. నా ప్రతి సినిమా నాకు స్పెషలే. నిర్మాతలు సినిమాకు డబ్బులు ఖర్చు పెడుతున్నారు. ఓ నటుడిగా నేను పారితోషికం తీసుకుంటున్నాను. సో.. నటుడిగా నేను వంద శాతం నిజాయితీగా కష్టపడాలి. ప్రతి సినిమాకు ఇదే చేస్తున్నాను" అని వెంకటేశ్ అన్నారు. వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సైంధవ్'. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 75వ చిత్రం. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించారు. ఈ చిత్రంలో ఆర్య, నవాజుద్దీన్ సిద్దిఖీ, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, చైల్డ్ ఆర్టిస్టు సారా కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం రేపు (శనివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెంకటేశ్ చెప్పిన విశేషాలు.

● నా కెరీర్‌లో నేను చేసిన చాలా సినిమాలు సంక్రాంతికి విడుదలయ్యాయి. కొన్ని సినిమాలు ఆడాయి.. కొన్ని నిరాశ పరచాయి. ఈ సంక్రాంతికి 'సైంధవ్' వస్తోంది. ఓ మంచి సినిమా చేశాం. ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాం. అలాగే ఈ పండగకి 'సైంధవ్'తో పాటు వస్తున్న మిగతా సినిమాలు 'నా సామిరంగ', 'గుంటూరు కారం', 'హను-మాన్' కూడా విజయం సాధించాలి. సినిమా బాగుంటే ప్రేక్షకులు చూస్తారు. అయినా ఓ వారం పోతే సంక్రాంతి సినిమాల గురించి ఎవరూ మాట్లాడుకోరు.

● 'సైంధవ్' కథను శైలేష్ చెప్పినప్పుడు బాగుందనిపించింది. ఓ యాక్టర్‌గా నా పని నేను చేశాను. దర్శకుడిగా తన పని తాను చేశాడు. చైల్డ్ ఆర్టిస్టులతో కలిసి నటించడం నాకు సరదాగా ఉంటుంది. 'కలిసుందాం..రా', 'తులసి' వంటి సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టులతో కలిసి చేశాను. 'సైంధవ్'లో సారాతో చేశాను. సారా బాగా నటించింది. నవాజుద్దీన్‌తో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్. 'సైంధవ్'లో కథ ముందుకు కదులుతూనే ఎమోషన్స్, యాక్షన్ సీన్స్ ఉంటాయి. ముఖ్యంగా క్లైమాక్స్ బాగుంటుంది. ● ప్రత్యేకంగా యాక్షన్ సినిమాలు చేయాలని చేయడం లేదు. 'బొబ్బిలిరాజా' సినిమా సమయంలో కొన్ని గాయాలయ్యాయి. ఆ సమయంలో కొన్ని ఫ్యామిలీ సినిమాలు చేశాను. ప్రేక్షకులు ఆదరించారు. అప్పుడప్పుడు యాక్షన్ సినిమాలూ చేశాను. ఇప్పుడు 'సైంధవ్' చేశాను. ఇదంతా జర్నీలో ఓ భాగం. స్పిరిట్యువల్‌గా చెప్పాలంటే.. మనకి జీవితంలో కొంత అదృష్టం కూడా ఉంటుంది. కొన్ని కాంబినేషన్స్, సినిమాలు వాటంతట అవే కుదురుతాయి. కొన్నిసార్లు ఓ సినిమా ప్రయాణంలో అది అంతగా ఆడదేమో అనిపిస్తుంది. మంచి సబ్జెక్ట్ లేకపోతే యాక్టర్స్‌గా మేం ఏమీ చేయలేం. కథ కుదరకపోతే పెద్ద కాంబినేషన్స్‌తో కూడిన సినిమాలు కూడా నష్టపోయిన రోజులు ఉన్నాయి.

● 75వ సినిమా, 100వ సినిమా అనేవి నా దృష్టిలో నంబర్స్ మాత్రమే. అలాగే రికార్డ్స్, కలెక్షన్స్ వంటి అంశాల జోలికి వెళ్లను. నా కెరీర్ ఆరంభంలో 98 రోజులు ఆడిన సినిమాలను సడన్‌గా ఆపేసిన ఘటనలు ఉన్నాయి. నేను అంతగా ఏం ఫీల్ కాలేదు. అది నిర్మాతలు, పంపిణీదారుల నిర్ణయం కదా అని అనుకునేవాడిని. ఈ విషయంలో నా అభిమానులు మొదట్లో కాస్త అసహనంగా ఉండేవారు. కానీ నా స్టైల్‌ను వారు అర్థం చేసుకున్నారు. అందుకు వారికి థ్యాంక్స్ ● నేను డిఫరెంట్‌గా చేసిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ ఇంపాక్ట్ నా సినిమాలపై ఉండదనే అనుకుంటున్నాను. అభిప్రాయాలు మారుతూ ఉంటాయి. యాక్టర్‌గా మనం నిజాయితీగా చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. నెగటివ్ ఫీడ్‌బ్యాక్ ఉండొచ్చు. కానీ నేను తీసుకోను. పాజిటివ్‌గానే ఉంటాను. అప్పుడే మన జీవితంలో మనం సంతోషంగా ఉండగలం. అలాగే నటుడిగా నా సుదీర్ఘమైన కెరీర్‌లో ఎందుకు వివాదాలు లేవో నాకే తెలియదు. నాకు తెలిస్తే అందరికీ చెబుతాను (నవ్వుతూ). అయితే నా స్కూల్, కాలేజీ, ఇప్పుడు ఇండస్ట్రీ... ఇలా ఎప్పుడైనా నాతోటి వారు నావల్ల అసౌకర్యంగా ఫీల్ కాకూడదని భావిస్తుంటాను.



రాజమౌళిగారు చేస్తానన్నారని నేను డ్రాప్ అయ్యాను

- ప్రశాంత్ వర్మ

"ఒక ఫిల్మ్ మేకర్‌గా క్వాలిటీ ప్రొడక్ట్ ఇవ్వడంపైనే నా ఏకాగ్రత ఉంటుంది. సినిమా విడుదల, థియేటర్ల కేటాయింపులు వంటివి నిర్మాతలకు చెందినవి. ఈ సినిమా సక్సెస్ అయితే రాబోయే పదేళ్లల్లో తెలుగు ప్రేక్షకులు గర్వపడే సినిమాలు చేసేలా మేం కొన్ని ప్లాన్ చేసి ఉన్నాం. కానీ ఇప్పుడు ఇదంతా (థియేటర్స్ గురించిన వివాదం గురించి పరోక్షంగా స్పందిస్తూ..) జరుగుతోంది. తప్పు జరుగుతున్నప్పుడు మాట్లాడకపోవడం అనేది ఇంకా పెద్ద తప్పు అన్నట్లుగా ఓ సామెత ఉంది. అందుకే కొన్ని విషయాలపై స్పందిస్తున్నాను" అన్నారు ప్రశాంత్ వర్మ. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ప్రశాంత్ వర్మ చెప్పిన విశేషాలు.

● 'హను-మాన్' సినిమా కోసం తేజ సజ్జా కొత్తగా మేకోవర్ అయ్యాడు. ఇక యాక్టింగ్ గురించి నేను అతనికి నేర్పించాల్సింది ఏమీ లేదు. పైగా సెట్స్‌లో ఫలానా సన్నివేశంలో ఇలా యాక్ట్ చెయ్ అని నటించి, చూపించడం నాకు రాదు. 'హను-మాన్'పై నా కన్నా ఎక్కువగా తేజ ఆశలు పెట్టుకున్నట్లు ఉన్నాడు. ఈ సినిమా కోసం చాలా సమయం కేటాయించాడు. కొత్త సినిమాలేవీ చేయలేదు. రీసెంట్‌గా ఓ సినిమా ఒప్పుకున్నాడు. సినిమా మొదలైన ఇరవై నిమిషాలు హీరో క్యారెక్టర్ సింపుల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే హీరో పాత్రకు సూపర్ పవర్స్ వస్తాయో అప్పట్నుంచి కథ మరింత ఆసక్తిగా ముందుకు వెళ్తుంది. ● పురాణాలు, ఇతిహాసాల కథలు, హనుమంతునిపై వచ్చిన కొన్ని ఆర్టికల్స్, ప్రచారంలో ఉన్న కొన్ని అంశాల ఆధారంగా ఈ సినిమా కథ రెడీ చేసుకున్నాను. తెలుగు సినిమా స్టైల్‌ని పోలి ఉండే సూపర్ హీరో సినిమా 'హను-మాన్'. 'బ్యాట్‌మేన్' సినిమాను రాజమౌళిగారు తీస్తే ఎలా ఉంటుందో అలా 'హను-మాన్' ఉంటుంది. 'కేజీఎఫ్'లో యశ్‌ను ఎలివేట్ చేసినట్లుగా 'హను-మాన్' సినిమా ఉంటుంది. నిర్మాత నిరంజన్ రెడ్డిగారు నాకన్నా పాజిటివ్ పర్సన్. మేం సినిమా కోసం ఓ ఆలోచన చెబితే, దానికి ఎక్స్‌టెన్షన్ లెవల్లో ఆయన ఆలోచించేవారు. దాశరథి శివేంద్ర గారు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. ● మేం అనుకున్న దాని కన్నా 'హను-మాన్' బడ్జెట్ మూడింతలు పెరిగింది. కానీ పదింతల క్వాలిటీ సినిమాను ఆడియన్స్ చూస్తారు. ఇక ఈ సినిమాను త్రీడీలో రిలీజ్ చేయాలంటే మరికొంత బడ్జెట్ కావాలి. అందుకే త్రీడీలో విడుదల చేయడం లేదు. అయితే రిలీజ్ తర్వాత మంచి స్పందన వస్తే, భవిష్యత్‌లో రీ-రిలీజ్‌లో త్రీడీలో కూడా రిలీజ్ చేస్తాం. ఓ నెల గ్యాప్ తర్వాత విదేశీ భాషల్లో 'హను-మాన్'ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నాం. ● పురాణాలు, ఇతిహాసాల ఆధారంగా సినిమాలు చేయాలనే ఆసక్తి ఉంది. మహాభారతంపై ఓ సినిమా చేయాలనుకున్నాను. కానీ రాజమౌళిగారు చేయాలనుకుంటున్నారని తెలిసి డ్రాప్ అయ్యాను.

మణిరత్నం థగ్ లైఫ్‌లో...


● ఐశ్వర్యా లక్ష్మి

హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో 'నాయగన్'-1987 ('నాయకుడు') తర్వాత 37 ఏళ్లకు రూపొందనున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'పై అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో త్రిష, 'జయం' రవి, దుల్కర్ సల్మాన్ వంటి స్టార్స్ ఖరారయ్యారు. తాజాగా ఐశ్వర్యా లక్ష్మి ఈ జాబితాలో చేరారు. ఈ చిత్రంలో ఆమె నటించనున్నట్లు గురువారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ఇక మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్'లో ఐశ్వర్యా లక్ష్మి కీలక పాత్ర చేసిన విషయం తెలిసిందే. మరో విషయం ఏంటంటే... 'థగ్ లైఫ్'లోకి ఐశ్వర్యా రాయ్ ఎంట్రీ ఇవ్వనున్నారనే టాక్ వినిపిస్తోంది. మణిరత్నం దర్శకత్వంలో 'ఇద్దరు, గురు, రావణ్, పొన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాల్లో ఐశ్వర్యా రాయ్ నటించారు. మరి... 'థగ్ లైఫ్'లో ఆమె నటించనున్నది నిజమేనా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే. మణిరత్నం, కమల్‌హాసన్, మహేంద్రన్, శివ అనంత్ నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కావచ్చాయని, ఈ నెలాఖరులో షూటింగ్ ఆరంభమయ్యే చాన్స్ ఉందని సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

జీవితం అనేది యుద్ధం


● సూర్య, ధన్యా బాలకృష్ణ

సూర్య అయ్యల సోమయాజుల హీరోగా, మిహిరామ్ వైనతేయ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ర్యాపిడ్ యాక్షన్ మిషన్'. ఇందులో ధన్యా బాలకృష్ణ హీరోయిన్. దీపికాంజలి వడ్లమాని నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను డైరెక్టర్ శైలేష్ కొలను విడుదల చేశారు. 'జీవితం అనేది ఒక యుద్ధం.. చుట్టూ మనుషులు ఉన్నా లేకపోయినా.. నీ పోరాటం నువ్వే చేయాలి.. ఆ పోరాటంలో నా రామ్ గెలుస్తాడని నాకు నమ్మకం ఉంది' అనే డైలాగ్స్‌తో ట్రైలర్ సాగుతుంది. 'ఈ 60 ఏళ్ల స్వాతంత్ర్యం ప్రజలది కాదు... అధికారులది కాదు... రాజకీయ నాయకులది మాత్రమే... మీరు అప్పుడూ బానిసలే... ఇప్పుడూ బానిసలే... ఎప్పుడూ బానిసలే' అంటూ 'శుభలేఖ' సుధాకర్ చెప్పిన డైలాగ్ కూడా ఉంది. ''దేశభక్తి నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్

శుక్రవారం
12-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
63	28
71,721	21,647

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.00 గంటలకు)

నాస్‌డాక్	14,829	▽	141
డోజోన్స్	37,447	▽	248
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,582	▽	70
డాక్స్	16,550	▽	139
షాంఘై	2,886	▲	9
నికాయ్	35,050	▲	608

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
62,262	▽	86
బంగారం (99.5 స్వచ్ఛత)		
62,013	▽	85
వెండి (కేజీ)		
71,532	▲	85

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.66	83.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.85	107.42
€	యూరో	ఒకటి	90.13	92.57
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.59	57.90
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.04	56.96
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	పదింతలకి	21.18	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	పదింతలకి	21.71	23.50
¥	చైనా యువాన్	పదింతలకి	10.48	12.55

ఇన్ఫోసిస్.. ప్చ్!

- క్యూ3లో లాభం రూ.6,106 కోట్లు; 7.3 శాతం డౌన్
- 1.3 శాతం పెరిగిన ఆదాయం; రూ. 38,821 కోట్లు
- షేరుకు రూ.18 మధ్యంతర డివిడెండ్



మూడో త్రైమాసికంలో మా పనితీరు నిలకడగానే ఉంది. బడా డీల్స్ దన్నుతో 3.2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకున్నాం. జెనరేటివ్ ఏఐ, డిజిటల్, క్లౌడ్ తదితర విభాగాల్లో మా పోర్ట్‌ఫోలియో పటిష్టతకు ఇది నిదర్శనం. స్థూల ఆర్థిక పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. ఫైనాన్షియల్ సర్వీసులు, టెల్కోలు, హైటెక్ రంగాల్లో ప్రభావం కొనసాగవచ్చని భావిస్తున్నాం.

– సలీల్ పరేఖ్, ఇన్ఫీ సీఈఓ

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ.. ఇన్ఫోసిస్ నిరుత్సాహకరమైన ఫలితాలతో బోణీ కొట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2023–24, క్యూ3)లో కంపెనీ రూ. 6,106 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో లాభం రూ.6,586 కోట్లతో పోలిస్తే 7.3% తగ్గింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 1.3% పెరుగుదలతో రూ. 38,821 కోట్లకు చేరింది. గతేడాది క్యూ3లో ఆదాయం రూ. 38,318 కోట్లుగా నమోదైంది. క్లయింట్ల నుండి డిమాండ్ మందగించడం ఫలితాలపై ప్రభావం చూపింది.

గైడెన్స్ కట్...

2023–24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఇన్ఫోసిస్ ఆదాయ వృద్ధి అంచనాలను (గైడెన్స్) కుదించింది. 1.5–2 శాతానికి తగ్గించింది. గత ఫలితాల సందర్భంగా ఆదాయ వృద్ధిని 1–2.5 శాతంగా అంచనా వేసింది.

'ఇన్‌సెమీ' కొనుగోలు...

బెంగళూరుకు చెందిన సెమీకండక్టర్ డిజైన్ సర్వీస్ ప్రొవైడర్ ఇన్‌సెమీ కొనుగోలు ప్రతిపాదనకు ఇన్ఫోసిస్ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. దాదాపు రూ.280 కోట్లకు దీన్ని దక్కించుకోనుంది. 2024 మార్చిలోపు ఈ కొనుగోలు పూర్తయ్యే అవకాశం ఉందని కంపెనీ వెల్లడించింది.

ఇతర ముఖ్యాంశాలు...

- క్యూ3లో ఇన్ఫీ 3.2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకుంది. ఇందులో నికరంగా 71% కొత్త డీల్స్ ఉన్నాయి.
- డిసెంబర్ 31 నాటికి కంపెనీలో 3,22,663 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. క్యూ2తో పోలిస్తే (3,28,764) నికరంగా 6,101 మంది (1.8 శాతం) సిబ్బంది తగ్గారు. క్రితం ఏడాది డిసెంబర్ క్వార్టర్ నాటికి ఉన్న 3,46,845 మందితో పోలిస్తే ఉద్యోగుల సంఖ్య 7% తగ్గింది. క్యూ3లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.9%గా ఉంది. కాగా, ఉద్యోగుల వినియోగాన్ని నిశితంగా పరిశీలిస్తామని సీఎఫ్‌ఓ నీలాంజన్ రాయ్ చెప్పారు. క్యాంపస్ హైరింగ్ అనేది క్లయింట్ల డిమాండ్‌పై ఆధారపడి ఉంటుందని, ప్రస్తుతానికి దీని అవసరం ఉండకపోవచ్చని పేర్కొన్నారు.
- రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ. 18 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో షేరు ధర 1.62% నష్టంతో రూ.1,495 వద్ద ముగిసింది.

టీసీఎస్.. గుడ్!

- నికర లాభం రూ. 11,735 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 60,853 కోట్లు
- షేరుకి మొత్తం రూ. 27 డివిడెండ్



సాఫ్ట్‌వేర్ సేవలకు సీజనల్‌గా బలహీన త్రైమాసికంగా పేర్కొనే అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లోనూ కంపెనీ ప్రోత్సాహకర పనితీరును ప్రదర్శించింది. డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో, కస్టమర్ కేంద్రంగా అమలు చేసే వ్యూహాలతోపాటు.. పటిష్ట బిజినెస్ మోడల్‌ను ఇది ప్రతిబింబిస్తోంది. వివిధ మార్కెట్ల నుంచి కాంట్రాక్టులు కుదుర్చుకునేందుకు పలు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది భారీ ఆర్డర్ బుక్‌కు కారణమవుతోంది.

– కె. కృతివాసన్, టీసీఎస్ సీఈఓ

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 8.2 శాతం పుంజుకుని రూ. 11,735 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 4 శాతం వృద్ధితో రూ. 60,583 కోట్లకు చేరింది. భారత్(23.4 శాతం)సహా వర్ధమాన మార్కెట్లలో అమ్మకాలు రెండంకెల స్థాయిలో పుంజుకోవడం ఇందుకు సహకరించింది. ఈ బాటలో ప్రధాన మార్కెట్లలో యూకే 8.1 శాతం, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా 16 శాతం, లాటిన్ అమెరికా 13.2 శాతం చొప్పున వృద్ధి సాధించగా.. ఉత్తర అమెరికా నుంచి 3 శాతం క్షీణత నమోదైంది. ఇక విభాగాలవారీగా చూస్తే ఎనర్జీ, రిసోర్సెస్– యుటిలిటీస్(11.8 శాతం), తయారీ(7 శాతం), లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్(3.1 శాతం) ఆదాయానికి దన్నుగా నిలిచినట్లు కంపెనీ పేర్కొంది. అయితే కీలకమైన బీఎఫ్‌ఎస్‌ఐ విభాగంలో 3 శాతం, మీడియా, టెక్నాలజీలలో 5 శాతం చొప్పున ప్రతికూల వృద్ధి నమోదైంది. వాటాదారులకు షేరుకి రూ. 27 చొప్పున డివిడెండును ప్రకటించింది. దీనిలో రూ. 18 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. ఇందుకు రికార్డ్ డేట్ ఈ నెల19కాగా.. ఫిబ్రవరి 5నుంచి చెల్లించనుంది.

పలు ఒప్పందాలు

క్యూ3లో దిగ్గజ యూకే బ్యాంక్ మోటార్ ఫైనాన్స్, లీజింగ్ బిజినెస్‌లకు ఎండ్‌టు ఎండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ భాగస్వామిగా టీసీఎస్‌ను ఎంపిక చేసుకుంది. ఈ బాటలో ఆస్ట్రేలియా ప్రధాన ఎక్స్ఛేంజీ ఏఎస్‌ఎక్స్ అధునాతన క్లియరింగ్, సెటిల్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. యూఎస్ హెల్త్‌కేర్ కంపెనీ ప్రస్తుత నిర్వహణ వ్యవస్థను ఆధునీకరించేందుకు క్లౌడ్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ కోసం టీసీఎస్‌తో చేతులు కలిపింది.

ఇతర విశేషాలు...

- నిర్వహణ మార్జిన్లు 0.5 శాతం మెరుగుపడి 25 శాతానికి చేరాయి. నికర మార్జిన్లు 19.4 శాతంగా నమోదయ్యాయి.
- ఆర్డర్ బుక్ 8.1 బిలియన్ డాలర్లను తాకింది.
- డిసెంబర్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 10,669 మంది తగ్గి 6,03,305కు చేరింది. వీరిలో మహిళల సంఖ్య 35.7%.
- కార్యకలాపాల ద్వారా రూ. 11,276 కోట్ల నగదును జమ చేసుకుంది.
- గత 12 నెలల్లో ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 13.3 శాతంగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 3,736 వద్ద ముగిసింది.

సింగపూర్ నుంచి క్షణాల్లో నగదు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) యాప్స్ ద్వారా సింగపూర్ నుంచి భారత్‌లో ఉన్న బ్యాంక్ ఖాతాలకు క్షణాల్లో నగదును పంపుకోవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. భీమ్, ఫోన్‌పే, పేటీఎం యాప్స్‌తోపాటు ఎస్‌బీఐ, యాక్సిస్, ఐసీఐసీఐ, డీబీఎస్ బ్యాంక్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ యాప్స్ ద్వారా ఈ సేవలను పొందొచ్చని ఎన్‌పీసీఐ గురువారం ప్రకటించింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), సింగపూర్‌కు చెందిన పేనౌ మధ్య సీమాంతర అనుసంధానంతో ప్రవాస భారతీయుల నుండి నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి తక్షణ, సురక్షిత, తక్కువ ఖర్చుతో కూడిన చెల్లింపులను స్వీకరించడానికి భారతీయులకు అనుమతిస్తుందని ఎన్‌పీసీఐ తెలిపింది.



గూగుల్‌లో ఉద్యోగాల కోత

హార్డ్‌వేర్, ఇంజినీరింగ్ విభాగాలకు షాక్ • వాయిస్ అసిస్టెంట్ సర్వీసుల్లోనూ లేఆఫ్



శాన్‌ఫ్రాన్సిస్కో: టెక్నాలజీ, డైవర్సిఫైడ్ దిగ్గజం గూగుల్ వ్యయ నియంత్రణల్లో భాగంగా లేఆఫ్ (ఉద్యోగాలలో కోత) అమలు చేస్తోంది. ప్రధానంగా హార్డ్‌వేర్, వాయిస్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ విభాగాలలో వందలకొద్దీ ఉద్యోగులను తొలగిస్తోంది. అధిక ప్రాధాన్యమున్న విభాగాలలో పెట్టుబడులు చేపట్టనున్నట్లు గూగుల్ పేర్కొంది. భారీ అవకాశాలు ముందున్నట్లు పేర్కొంది. కొన్ని టీములలో వ్యవస్థాగత మార్పులు చేపడుతున్నట్లు తెలియజేసింది. వెరసి కొన్ని వందల ఉద్యోగాలకు కోత పడుతున్నట్లు ప్రధానంగా ఆగ్మెంటెడ్ రియాలిటీ(ఏఆర్) హార్డ్‌వేర్ టీముల్లో ఈ ప్రభావం ఉండనున్నట్లు వివరించింది. ఏడాది క్రితం మొత్తం సిబ్బందిలో 6 శాతంవరకూ(సుమారు 12,000 మంది ఉద్యోగులు) తొలగించనున్నట్లు గూగుల్ పేర్కొన్న విషయం విదితమే. గూగుల్‌తోపాటు.. మాతృ సంస్థ అల్ఫాబెట్ వ్యయాలను తగ్గించుకునే బాటలో ఉపాధి కల్పనకు షాకిస్తోంది.

ఇతర కంపెనీలు సైతం

మ్యూజిక్ స్ట్రీమింగ్ కంపెనీ స్పాటిఫై ప్రపంచవ్యాప్త సిబ్బందిలో 17 శాతం మందిని తొలగించనున్నట్లు 2023 డిసెంబర్‌లో వెల్లడించింది. ఇక ఈ వారం మొదట్లో ప్రైమ్ వీడియో, స్టుడియో విభాగాల నుంచి అమెజాన్ వందలకొద్దీ ఉద్యోగులను తొలగించింది. లైవ్‌స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ ట్విచ్ నుంచి సైతం 500 మంది ఉద్యోగులను తీసేసింది. 2023 జనవరిలో 18,000 మందిని విధుల నుంచి తప్పించే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలిపిన అమెజాన్ మార్చిలో 9,000 మందిని తొలగించనున్నట్లు వెల్లడించింది.

ప్రతిఘటిస్తాం..

అవసరం లేకపోయినా అల్ఫాబెట్ మరోసారి సిబ్బంది తొలగింపు చేపడుతున్నట్లు వర్కర్స్ యూనియన్ ఎక్స్(ట్విట్టర్)లో పేర్కొంది. ప్రతీ త్రైమాసికంలోనూ వందల కోట్ల డాలర్లను ఆర్జిస్తున్న కంపెనీ సహచర ఉద్యోగులను తొలగించడాన్ని కొనసాగించేందుకు వీలులేదని హెచ్చరించారు. ఉద్యోగులకు రక్షణ లభించేవరకూ పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. కాగా.. ఇన్వెస్టర్లకు భరోసానిస్తూ గతేడాది మరో టెక్నాలజీ దిగ్గజం మెటా(ఫేస్‌బుక్ మాతృ సంస్థ) సైతం 20,000 ఉద్యోగాలలో కోత పెట్టిన విషయం విదితమే. అయితే మెటా షేరు 2023లో ఏకంగా 178 శాతం దూసుకెళ్లడం గమనార్హం!

స్వల్ప లాభాల ముగింపు

క్యూ3 ఫలితాలు, ద్రవ్యోల్బణం డేటా వెల్లడికి ముందు అప్రమత్తత

ముంబై: దేశీయ ఐటీ దిగ్గజ సంస్థలు టీసీఎస్, ఇన్ఫోసిస్ క్యూ3 ఆర్థిక ఫలితాలు, అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడి(గురువారం రాత్రి), వీక్లీ ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా ఇంట్రాడే ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్‌లో 456 పాయింట్లు పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 63 పాయింట్లు పెరిగి 71,721 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నిఫ్టీ 21,594 – 21,726 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి 28 పాయింట్లు బలపడి 21,647 వద్ద నిలిచింది. ఇంధన, ఆయిల్‌అండ్‌గ్యాస్, కన్జూమర్, వినిమయ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.79%, 0.66% చొప్పున లాభపడ్డాయి.



- రిలయన్స్ షేరు జోరు రెండోరోజూ కొనసాగింది. బీఎస్‌ఈలో 2.58% లాభపడి రూ.2718 వద్ద ముగిసింది. ట్రేడింగ్లో 3% పెరిగి రూ.2725 వద్ద తాజా రికార్డు గరిష్టాన్ని నమోదు చేసింది.
- ఇటీవల ఐటీ సోదాల్లో రూ.1,000 కోట్ల 'నల్లధన లావాదేవీలు' బయటపడటంతో పాలీక్యాబ్ ఇండియా షేరు 21% క్షీణించి రూ.3877 వద్ద స్థిరపడింది.
- మాల్దీవుల వివాదంతో ఈజీమైట్రిప్ షేరు రూ.17% లాభపడి రూ.52 వద్ద ముగిసింది.
- చివరి రోజు నాటికి జ్యోతీ సీఎన్‌సీ ఆటోమేషన్ ఐపీఓకు 38.53 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ 1.75 కోట్ల షేర్లు జారీ చేయగా, 67.58 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

సాక్షి స్పోర్ట్స్



మరొకటి గెలిస్తే మెయిన్ 'డ్రా'లోకి...

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించాడు. మెల్‌బోర్న్‌లో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 139వ ర్యాంకర్ సుమిత్ 6–3, 6–2తో 'వైల్డ్ కార్డు' ప్లేయర్ ఎడ్వర్డ్ వింటర్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. 64 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. 12 విన్నర్స్ కొట్టిన సుమిత్ 11 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్‌వద్దకు 14 సార్లు దూసుకొచ్చి 10 సార్లు పాయింట్లు గెలిచాడు. 118వ ర్యాంకర్ మోల్కన్ (స్లొవేకియా)తో నేడు జరిగే ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ నెగ్గితే రెండోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధిస్తాడు. సుమిత్ 2019, 2020 యూఎస్ ఓపెన్‌లో, 2021 ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'లో పోటీపడ్డాడు.

అమన్ 'పసిడి పట్టు'

జాగ్రెబ్ (క్రొయేషియా): కొత్త ఏడాదిని భారత రైజింగ్ స్టార్ రెజ్లర్ అమన్ సెహ్రావత్ స్వర్ణ పతకంతో ప్రారంభించాడు. జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో అమన్ 57 కేజీల విభాగంలో చాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో అమన్ 4 నిమిషాల 21 సెకన్లలో 10–0తో 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో చైనా రెజ్లర్ జౌ వాన్‌హావోపై గెలుపొందాడు. ప్రత్యర్థిపై 10 పాయింట్ల ఆధిక్యం వచ్చిన వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపివేసి 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. అమన్ తాను పోటీపడిన నాలుగు బౌట్‌లలోనూ ప్రత్యర్థులను 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలోనే ఓడించడం విశేషం. తొలి రౌండ్‌లో అమన్ 15–4తో కరావుస్ (తుర్కియే)పై, క్వార్టర్ ఫైనల్లో 11–0తో రిచర్డ్స్ రోడ్స్ (అమెరికా)పై, సెమీఫైనల్లో 11–0తో రొబెర్టి డాంగాష్విలి (జార్జియా)పై విజయం సాధించాడు.



హసరంగ 7/19

కొలంబో: గాయం నుంచి కోలుకున్నాక శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగ ఘనంగా పునరాగమనం చేశాడు. జింబాబ్వేతో గురువారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో హసరంగ బంతితో మాయ చేశాడు. 5.5 ఓవర్లు వేసిన హసరంగ కేవలం 19 పరుగులిచ్చి ఏకంగా 7 వికెట్లు పడగొట్టాడు. వన్డే క్రికెట్‌లో ఇవి ఐదో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు కావడం విశేషం. వర్షం కారణంగా 27 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే జట్టు హసరంగ ధాటికి 22.5 ఓవర్లలో 96 పరుగులకే ఆలౌటైంది. వన్డే మ్యాచ్‌లో 7 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన 15వ బౌలర్‌గా... చమిందా వాస్ (8/19; జింబాబ్వేపై 2001లో), ముత్తయ్య మురళీధరన్ (7/30; భారత్‌పై 2000లో) తర్వాత ఈ ఘనత సాధించిన మూడో శ్రీలంక బౌలర్‌గా హసరంగ గుర్తింపు పొందాడు. జింబాబ్వే నిర్దేశించిన 97 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక 16.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించి గెలిచింది. ఈ గెలుపుతో శ్రీలంక సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. తొలి వన్డే వర్షంతో రద్దయింది.



కుర్రాళ్లు గెలిపించారు

విరాట్ కోహ్లి ఆడలేదు... రోహిత్ శర్మ విఫలమయ్యాడు... అయినా సరే యువ ఆటగాళ్ల ప్రదర్శనతో భారత్ విజయాన్ని అందుకుంది. అఫ్గానిస్తాన్‌తో పోరులో అక్కడక్కడా కాస్త శ్రమించినా... చివరకు గెలుపు టీమిండియాదే అయింది. ముందుగా అక్షర్ పటేల్ కట్టుదిట్టమైన బౌలింగ్, ఆపై బ్యాటింగ్‌లో శివమ్ దూబే మెరుపులు జట్టును సిరీస్‌లో ఆధిక్యంలో నిలిపాయి. అఫ్గాన్ ఆటగాళ్లు కొంత పోరాడినా... మంచు ప్రభావంతో పాటు ఒత్తిడిలో ఆ జట్టు చిత్తయింది.



శివమ్ దూబే

- తొలి టి20లో భారత్ విజయం
- 6 వికెట్లతో ఓడిన అఫ్గానిస్తాన్
- శివమ్ దూబే అజేయ అర్ధ సెంచరీ
- ఆదివారం ఇండోర్‌లో రెండో మ్యాచ్

మొహాలి: అఫ్గానిస్తాన్‌తో టి20 సిరీస్‌లో భారత్ 1–0తో ముందంజ వేసింది. గురువారం జరిగిన తొలి పోరులో భారత్ 6 వికెట్ల తేడాతో అఫ్గాన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. నబీ (27 బంతుల్లో 42; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం భారత్ 17.3 ఓవర్లలో 4 వికెట్లకు 159 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శివమ్ దూబే (40 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ సాధించగా, జితేశ్ శర్మ (20 బంతుల్లో 31; 5 ఫోర్లు) రాణించాడు.

నబీ మెరుపులు...

అఫ్గాన్‌కు ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (22 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్), గుర్బాజ్ (28 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుగైన ఆరంభం అందించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 48 బంతుల్లో 50 పరుగులు జోడించారు. 1 పరుగు వద్ద ఇబ్రహీమ్ ఇచ్చిన క్యాచ్‌ను దూబే వదిలేయడం కూడా జట్టుకు కలిసొచ్చింది. అయితే ఒకే స్కోరు వద్ద వీరిద్దరిని అవుట్ చేసి భారత్ పైచేయి సాధించింది. తొలి అంతర్జాతీయ టి20 ఆడుతున్న రహ్మత్ షా (3) కూడా విఫలమయ్యాడు. ఈ దశలో నబీ, అజ్మతుల్లా (22 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్) భాగస్వామ్యంతో అఫ్గాన్ కోలుకుంది. ముఖ్యంగా నబీ దూకుడు ప్రదర్శించడంతో స్కోరు వేగంగా దూసుకుపోయింది. రవి బిష్ణోయ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 16 పరుగులు రాగా... ముకేశ్ వేసిన తర్వాతి ఓవర్లో నబీ 2 సిక్స్‌లు బాదాడు. నబీ, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు 43 బంతుల్లో 68 పరుగులు జత చేయగా... ముకేశ్ ఒకే ఓవర్లో వీరిని పెవిలియన్ పంపించాడు. చివరి 2 ఓవర్లలో అఫ్గాన్ 6 ఫోర్లతో 28 పరుగులు రాబట్టింది.

రోహిత్ డకౌట్...

ఛేదనలో రెండో బంతికే భారత్‌కు అనూహ్య షాక్ తగిలింది. శుబ్‌మన్ గిల్ (12 బంతుల్లో 23; 5 ఫోర్లు)తో సమన్వయ లోపంతో కెప్టెన్ రోహిత్ శర్మ (0) రనౌట్‌గా వెనుదిరిగాడు. మిడాఫ్ దిశగా ఆడిన రోహిత్ సింగిల్ కోసం దూసుకుపోగా, గిల్ ఏమాత్రం స్పందించకుండా తన క్రీజ్‌లోనే ఉండిపోయాడు. దాంతో డకౌట్ అయిన రోహిత్ తన సహచరుడిపై తీవ్ర ఆగ్రహాన్ని ప్రదర్శిస్తూ వెనుదిరిగాడు. ఆ తర్వాత కొన్ని చక్కటి బౌండరీలు కొట్టిన గిల్ అదే జోరులో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. భారీ షాట్లు ఆడటంలో తడబడిన తిలక్ వర్మ (22 బంతుల్లో 26; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఈ దశలో దూబే, జితేశ్ భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా నడిపించింది. అఫ్గాన్ పేలవ ఫీల్డింగ్ కూడా భారత్‌కు సానుకూలంగా మారింది. జితేశ్ వెనుదిరిగినా... రింకూ సింగ్ (9 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు) సహకారంతో దూబే మరో 15 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించాడు.



స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (స్టంప్డ్) జితేశ్ (బి) అక్షర్ 23; ఇబ్రహీమ్ (సి) రోహిత్ (బి) దూబే 25; అజ్మతుల్లా (బి) ముకేశ్ 29; రహ్మత్ (బి) అక్షర్ 3; నబీ (సి) రింకూ (బి) ముకేశ్ 42; నజీబుల్లా (నాటౌట్) 19; కరీమ్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 158. వికెట్ల పతనం:** 1–50, 2–50, 3–57, 4–125, 5–130. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–1–28–0, ముకేశ్ 4–0–33–2, అక్షర్ 4–0–23–2, సుందర్ 3–0–27–0, దూబే 2–0–9–1, బిష్ణోయ్ 3–0–35–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (రనౌట్) 0; శుబ్‌మన్ గిల్ (స్టంప్డ్) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; తిలక్ (సి) గుల్బదిన్ (బి) అజ్మతుల్లా 26; శివమ్ దూబే (నాటౌట్) 60; జితేశ్ శర్మ (సి) ఇబ్రహీమ్ (బి) ముజీబ్ 31; రింకూ సింగ్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (17.3 ఓవర్లలో 4 వికెట్లకు) 159. వికెట్ల పతనం:** 1–0, 2–28, 3–72, 4–117. **బౌలింగ్:** ఫారుఖీ 3–0–26–0, ముజీబ్ 4–1–21–2, మొహమ్మద్ నబీ 2–0–24–0, నవీన్ 3.3–0–43–0, అజ్మతుల్లా 4–0–33–1, గుల్బదిన్ 1–0–12–0.

ఒలింపిక్ బెర్త్ నంబర్ 16

'పారిస్'కు భారత్ నుంచి అత్యధిక షూటర్లు అర్హత



టీమ్ విభాగం రజత పతకాలతో సిమ్రన్‌ప్రీత్, ఇషా సింగ్, రిథమ్

జకార్తా: ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో ఈసారి భారత్ నుంచి షూటింగ్ క్రీడాంశంలో అత్యధిక మంది పోటీపడనున్నారు. ఈ ఏడాది జూలై–ఆగస్టులలో పారిస్ వేదికగా ఒలింపిక్స్ జరగనున్నాయి. 2020 టోక్యో ఒలింపిక్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా 15 మంది షూటర్లు అర్హత పొందగా... ఈసారి ఆ సంఖ్య 16కు చేరుకుంది. ఇంకా షూటింగ్‌లో మరో మూడు క్వాలిఫయింగ్ టోర్నీలు మిగిలి ఉండటం, మరో ఎనిమిది బెర్త్‌లు ఖాళీగా ఉండటంతో భారత్ నుంచి మరింత మంది షూటర్లు అర్హత సాధించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో గురువారం భారత్‌కు 16వ బెర్త్ ఖరారైంది. మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో రిథమ్ సాంగ్వాన్ కాంస్య పతకం సాధించింది. ఫైనల్లో హరియాణాకు చెందిన 20 ఏళ్ల రిథమ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి భారత్‌కు ఒలింపిక్ బెర్త్‌ను అందించింది. రిథమ్, తెలంగాణ షూటర్ ఇషా సింగ్, సిమ్రన్‌ప్రీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 1743 పాయింట్లతో రజత పతకాన్ని సొంతం చేసుకుంది.

అశ్విని-తనీషా సంచలనం

తొమ్మిదో ర్యాంక్ జోడీపై విజయం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) జోడీ సంచలనం సృష్టించింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 24వ ర్యాంక్ ద్వయం అశ్విని–తనీషా 21–19, 13–21, 21–15తో ప్రపంచ 9వ ర్యాంక్ జంట వకాన నాగహార–మాయు మత్సుమోటో (జపాన్)ను బోల్తా కొట్టించింది. ఈ గెలుపుతో సూపర్–1000 స్థాయి టోర్నీలో అశ్విని–తనీషా ద్వయం తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల డబుల్స్ విభాగంలో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ 21–11, 21–18తో లుకాస్ కోర్వీ–రొనన్ లాబర్ (ఫ్రాన్స్)లపై గెలిచారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత్ కథ ముగిసింది. ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 13–21, 17–21తో ఓడిపోయాడు.

నేటి నుంచి ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీ

దోహా: ప్రతిష్టాత్మక ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీ శుక్రవారం ఖతర్ రాజధాని దోహాలో మొదలవుతుంది. 24 జట్లు పోటీపడుతున్న ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి 10 వరకు జరుగుతుంది. మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'బి'లో భారత్, సిరియా, ఉజ్బెకిస్తాన్, ఆస్ట్రేలియా జట్లున్నాయి. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఖతర్‌తో లెబనాన్ తలపడుతుంది. వాస్తవానికి ఈ టోర్నీ గత ఏడాది చైనాలో జరగాల్సింది. అయితే కోవిడ్ కారణంగా చైనా ఆతిథ్యం నుంచి తప్పుకోగా ఖతర్‌కు ఈ టోర్నీని కేటాయించారు.

అంతరిక్ష రంగంలో భారత్ అద్భుతాలు

ఎన్‌జీఆర్‌ఐ సెమినార్‌లో ఇస్రో డైరెక్టర్ తీర్థ ప్రతిమ్‌దాస్



ఉప్పల్: అంతరిక్ష రంగంలో భారతదేశం అద్భుతాలు సృష్టించిందని ఇస్రో ప్రధాన కార్యాలయ అంతరిక్ష విజ్ఞాన కార్యక్రమ సంచాలకుడు డాక్టర్ తీర్థ ప్రతిమ్‌దాస్ అన్నారు. 'చంద్రయాన్–3 అంతరిక్ష భుజబలం భవిష్యత్తు'అనే అంశంపై గురువారం ఇక్కడ ఉప్పల్ సీఎస్ఐఆర్, జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ(ఎన్‌జీఆర్‌ఐ) ప్రత్యేక సెమినార్ నిర్వహించాయి. ముఖ్యవక్తగా తీర్థ ప్రతిమ్‌దాస్ మాట్లాడుతూ చంద్రయాన్ తొలిమిషన్–1 2008లో, చంద్రయాన్–2 ను 2019లో ప్రారంభించామని, చంద్రయాన్–3ని 2023కి వచ్చేసరికి పరిశోధన రంగాల్లో మార్గాన్ని సుగమం చేశామని పేర్కొన్నారు. చంద్రమండలానికి సంబంధించి భారతదేశం అందించిన తోడ్పాటు ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయేలా ఉందన్నారు. అంగారక గ్రహం, సూర్యుడి దిశగా భారతదేశం చేస్తున్న అంతరిక్ష పరిశోధన, ఖగోళ మిషన్లు తదితర వాటిల్లో సాధించిన విజయాలను గుర్తుచేశారు. ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్ మాట్లాడుతూ సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్‌ఐ, ఇస్రో సంస్థల మధ్య సన్నిహిత శాస్త్రీయ పరిశోధన పరస్పర సహకారాల ఆవశ్యకతను వివరించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.